ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 7 ఏప్రిల్ 2022 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి

# 'మాలపల్లి @ 100' ప్రస్థానం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



'మాలపల్లి' ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న బి. తులసీదాసు, తెలకపల్లి రవి, సత్యాజీ.



తెలకపల్లి రవి



బి. తులసీదాస్

డిసెంబరు 2021, జనవరి 2022 నెలల ప్రత్యేక సంచికగా వెలువడిన సాహిత్య ప్రస్థానం **'మాలపల్లి @ 100'** ఆవిష్కరణ సభ మార్చి 26వ తేదీ సాయంత్రం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో జరిగింది. సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ ఈ సంచికను ఆవిష్కరించారు. 'మాలపల్లి' నవల్ని వందేళ్లయినా దాని ప్రాసంగికతపై సాహితీవేత్తలు, మేధావులతోపాటు ఈ తరం వారు చర్చించుకోవడం దాని విశిష్టతను చాటి చెబుతోందని తులసీదాస్ అన్నారు. భవిష్యత్ పరిణామాలను ఊహించి ఆనాడే ఉన్నవ ఈ నవలలో పేర్కొన్నారని గుర్తు చేశారు. ఈ నవల ఇప్పటికీ అన్ని తరగతుల ఆదరాభిమానాలతో సజీవంగా ఉందన్నారు.

పత్రిక ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ.. వందేళ్ల నాటి భారతీయ సమాజంలో అన్ని కోణాలను వాస్తవికంగా, ప్రామాణికంగా, ప్రతిభావంతంగా ఆవిష్కరించిన నవల 'మాలపల్లి' అని అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన చారిత్రక నవల 'మాలపల్లి'కి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సాహితీ ప్రస్థానం పత్రికను ప్రత్యేక వ్యాసాలతో రూపొందించామని చెప్పారు. సమగ్రత, పరిణతి, ప్రాతినిధ్య స్వభావం, వినూత్న వాస్తవికత మేళవించిన దృష్టికోణం వంటి అంశాలను నవల ద్వారా వివరించడం అత్యంత అరుదైన విషయమని అన్నారు. సమాజ గమనానికి రోడ్‌మ్యాప్‌ను, పీడిత వర్గాలను, రాజకీయంగా, సామాజికంగా ప్రగతి నిరోధక శక్తులను, ఆ శక్తుల రూపురేఖలు ఏమిటో అన్న అంశాలను ఈ నవల కళ్లకు కట్టిందని చెప్పారు. నాటి నాటి పోరాటాలను చిత్రించి రాబోయే కాలాన్ని దానిలా మార్చుకోవచ్చో దార్శనికంగా సూచించిందని అన్నారు. ఈ నవలపై మరింత చర్చ జరగాలని అన్నారు. సీనియర్ జర్నలిస్టు జివి రంగారెడ్డి అతిథులను వేదికపైకి ఆహ్వానించగా, సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు ఎ. శాంతిశ్రీ వందన సమర్పణ చేశారు.

# సాహిత్య ప్రస్థానం


## విద్య, వినోదం అంతా వివాదమే!

**దే**శంలో వివాదాస్పద అంశాలు అంతకంతకూ పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దానికి పాలక వర్గాలే వ్యూహం పన్నడం మరింత అభ్యంతరకర, అప్రజాస్వామికం. విద్య నుంచి వినోదం వరకూ ఏదీ దీనికి మినహాయింపుగా లేదు. ఎన్నడూ లేనిది కర్ణాటకలో హిజాబ్ వివాదమైంది. యూనిఫాం అంటూ వున్నాక అందరూ అనుసరించాల్సిందే. అయితే తరతరాలుగా దేశంలో భిన్న మతాల వారు విద్యాసంస్థల యూనిఫాంతోపాటు భిన్నమైన వస్త్రధారణ, అలంకరణ రీతులు పాటిస్తున్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో దీనిపై  ఇలాగే ఉండాలన్న రాజ్యాంగ నిబంధనలూ లేవు. అలాటిది హఠాత్తుగా కర్ణాటక ప్రభుత్వం హిజాబ్‌ను అనుమతించరాదని ఉత్తర్వులు ఇవ్వడం, ఒకటి రెండు చోట్లనే వాటిని గట్టిగా అమలు చేసి ఉద్రిక్తత పెంచడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ సమస్య హైకోర్టు ముందుకు వచ్చినపుడు అసలు సంగతి వదిలేసి హిజాబ్ ముస్లిం మతంలో ప్రాథమిక సూత్రం అవునా కాదా అని తీర్పు చెప్పడం మరింత విడ్డూరం. ఇప్పుడీ సమస్య సుప్రీం కోర్టు ముందుంది గనక సహేతుకమైన తీర్పు వస్తుందని ఆశించాలి.

గుజరాత్ ప్రభుత్వం పాఠశాలల్లో భగవద్గీతను పాఠ్యాంశంగా తేవాలని ప్రతిపాదించింది. మరో రెండు ప్రధాన  పార్టీలు కూడా ఇందుకు అనుకూలంగానే మాట్లాడాయి. ముస్లిములకు ఖురాను, క్రైస్తవులకు బైబిల్ ఉన్నట్టు హిందూమతానికి ఏకైక మత గ్రంథం లేదు. అయితే భగవద్గీతను ఆ విధంగా చెప్పడం, తర్వాతి కాలంలో వచ్చిన పరిణామం. ప్రభుత్వ పాఠశాలల్లో ఏ మత బోధనా ఉండరాదనేది రాజ్యాంగం 28 (1) అధికరణం చెప్పే మాట. మైనార్టీ విద్యాసంస్థలు లేదంటే ప్రైవేటు విద్యాసంస్థలకు మరో విధమైన నిబంధనలుంటాయి. ఎవరైనా సరే ఇతర మతాల పట్ల ద్వేషం పెంచే బోధలను పాఠాలు చేయడం నిషిద్ధం. కాని గుజరాత్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ విధానాన్ని కర్ణాటక బిజెపి ప్రభుత్వం వెంటనే అందిపుచ్చుకుంది. ఇప్పటికే పాఠ్యాంశాలను మతం కొలబద్దతో చూడటం వల్ల ఏది వుంచాలి ఏది తొలగించాలి అన్నది అశాస్త్రీయంగానూ, రాజకీయ ప్రేరితంగానూ మారుతున్న స్థితి. దేశభక్తుడైన టిప్పుసుల్తాన్ పాఠాన్ని తొలగించాలని కర్ణాటక ఉద్దేశిస్తే ఎట్టకేలకు సంబంధిత విద్యాకమిటీ కొనసాగించాలని తుది నిర్ణయం చెప్పింది. అయితే టిప్పును గురించి గొప్పగా చెప్పే భాగాలు తొలగించాలని సూచించింది.

కాశ్మీర్ ఫైల్స్ చిత్రాన్ని సాక్షాత్తూ ప్రధాని మోడీ ప్రశంసించడం, పలు రాష్ట్రాల్లో వినోదపు పన్ను మినహాయింపు ఇవ్వడం ఈ ధోరణులకు పరాకాష్ట. 1990లో కాశ్మీర్ పండిట్లపై తీవ్రవాదుల దాడులను హత్యలను అందరూ ఖండించారు. అయితే బలైన వారిలో అన్ని మతాల వారూ ఉన్నారు. కాశ్మీర్ ముస్లిములు కొన్ని రెట్లు ఎక్కువున్నారు. పంజాబ్‌లో లోగడ సిక్కు ఉగ్రవాదం వచ్చినపుడు ఆ మతానికి చెందినవారితో సహా  బలయ్యారు. పండిట్లకు అవసరమైన సాయం చేయడం, పునరావాసం కల్పించడం ఒక విషయం. కాని  దాన్ని రెండు మతాల మధ్య వివాదంగా చూపడం విద్వేషాల పెరుగుదలకే దారితీస్తుంది.

హైదరాబాద్‌లో ఒక స్వామిజీ కింది కులాలపై, మాంసాహారంపై చేసిన వ్యాఖ్యలు ఎందరినో గాయపర్చాయి. అడవి దేవతలను అవహేళన చేస్తూ ఆయన ఎప్పుడో మాట్లాడిన అంశాలు పైకి రావడం మరో వివాదమైంది. భిన్నమతాలు, కులాలు, విశ్వాసాలు గల ఈ దేశంలో ఇలాటివి మాట్లాడేప్పుడు సంయమనం పాటించాల్సిందే. తప్పయితే దిద్దుకోవాల్సిందే. ■


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్**
**◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి**
మేనేజర్ : **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh.
Editor : Telakapalli Ravi

## కథలు


జంఝూటం : శ్రీను కుదుపూడి .......... 5
సదువూ - స్మార్ట్‌ఫోనూ : రెడ్డెప్ప రెడ్డి .............. 22
లచ్చి : రాజాబాబు కంచర్ల ........ 33
తోట అమ్మకానికి లేదు : డా.కె.సుభాషిణి ........... 45


## కవితలు


చెదరని కల : అను : కొత్తపల్లి రవిబాబు 10
ఉగాది ముంగిట ... : పాపినేని శివశంకర్ ........ 18
జ్వలిస్తూ ... : లక్ష్మీ కందిమళ్ల ........... 21
ఆశల సముద్రానికి ఆవల : ఏటూరి నాగేంద్రరావు ... 25
పాలికేక ... : సిరికి స్వామినాయుడు ..... 31
మార్గమధ్యంలో ... : డా. పెరుగు రామకృష్ణ .... 32
గది : కోడే యామినీదేవి .......... 36
నీరు మింగిన నేల : గిరిప్రసాద్ చెలమల్లు ...... 52
చిన్న తోక పెద్ద లోపం : చందలూరి నారాయణరావు 53
తడి విలువ తెలిస్తే .. : సురేంద్ర రొద్ద .............. 56
నిప్పుల దీపం : బి గోవర్ధనరావు .......... 57
ఉక్కిరిబిక్కిరి అవుతోంది : గుండాన జోగారావు ....... 58
యుద్ధానికి హృదయముంటుందా: దాసరాజు రామారావు 61
ఒక యుద్ధం అనేక విధ్వంస దృశ్యాలు : గవిడి శ్రీనివాస్ ......... 62
ప్రజాస్వామ్య ముసుగులో..: రజిత కొండసాని ........ 62


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం జనవరి 2021 పురస్కారాలు ....... 21
మాలపల్లి - సాహిత్య విమర్శ - డాక్టరు ఎంసి వెంకటేశ్వర్లు ..... 11
సంయమనంతో సాగిపోయే అడిగోపుల కవిత్వం - దాస్యం సేనాధిపతి ............. 19
అన్నదాతలకు అండగా అక్షర సేద్యం - కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి ...... 26
ముఖాముఖి : కవి ఆశయం, ఆచరణ ఒకటవ్వాలి - ప్రముఖ కవి కె.శివారెడ్డి ..... 28
సాహితీ ప్రజ్ఞ : నిర్వహణ : పిల్లా కుమార స్వామి ....... 37
పొత్తి నవల : తెలంగాణా జీవన చిత్రణం - డా.మహ్మద్ హసేనా ........... 38
మాకినీడి బాల సాహిత్యం - డా.జోశ్యుల కృష్ణబాబు ........... 41
వర్తమానం : కార్మిక కర్షక ఐక్యతతోనే దేశానికి భవిష్యత్తు - తపన్ సేన్ ...................... 50
నానీల్లో కరోనా కాలాన్ని బంధించిన చలపాక - వొర ప్రసాద్ ..................... 54
మనుషుల కవి కుంచె శ్రీ - రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 59
డైరీ .......................................................63
పుస్తకాలు ....................................................65



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::
సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# జంఝాటం

- శ్రీను కుడుపూడి
89192 62864

**ము**సురు పట్టింది. రాత్రనంగా మొదలైన వాన తెల్లగా తెల్లారినా తెరిపివ్వలేదు. వాన తో బాటే సన్నగా మొదలయింది మా వాదోపవాదన. రాత్రంతా చిలికి చిలికి, తెల్లారే సరికి ఉధృతమై చివరాఖరికి కన్నీటి వరదైపోయింది 'మహా'. తుపానులో చిక్కుకున్న లంకతోటలా ఈసురోమంటుంది ఇల్లు. తన మనసు నుండి నన్ను వెలి వేసి మొహన్ని అటు వైపుకి తిప్పుకుని మూగగా రోదిస్తుందామె.

వీధి గుమ్మం దాటి వీధిలోకొచ్చాను. హోరున కురుస్తుంది వాన. గమ్య నిర్ధారణ లేని నా అడుగులు నిర్లక్ష్యంగా పడుతున్నాయి. ఎడ తెరిపిలేని ఆలోచనలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

అసలు నేనే మన్నానని...ఇంత రాద్ధాంతం?

'ఇంకొన్నాళ్ళు ఆగి చూద్దాం!' అని కదా అంట.

'ఇంకొన్నాళ్ళు ఆగితే మాత్రం మిద్దెలు మేడలు కట్టేసి రాజ్యాలు ఏలేస్తారా?' తన మాటల్లోని నిష్ఠూరం మనసుకి తూటాలా తాకినా తప్పదన్నట్టు ఊరుకున్నాను. మిద్దెలు మాట ఎలా ఉన్నా, ఇప్పుడుంటున్న ఇంటికి అద్దె కూడా కట్టే స్తోమత లేదని తెలుసు తనకి. అయినా సరే నన్ను ఇష్టపడే పెళ్లి చేసుకుంది ఆరోజు.

పెళ్ళై ఏడాదైంది. ఈ మూడొందల అరవై ఐదు రోజుల్లో ఏనాడూ నా మాట జవదాటలేదు. ఇప్పుడు మాత్రం కాస్త ఓపిక పట్టలేకపోయింది. ఓపిక పట్టేంత తేలిక విషయం కాదని తెలుసు నాకు. అయినా సరే 'తప్పని సరి' వాదన నాది! ఆమె పంతం ఆమెది!

'నీ పంతం నెగ్గించుకోవాలనుకోవడమే తప్పు, ముందు చూపుతో కొంచెమైనా ఆలోచిస్తున్నావా మహా...!' తనని కన్విన్స్ చేయాలనుకోవడం వ్యర్ధ ప్రయత్నం అని తెలుసు నాకు.

'నా బాధ పంతంలా అనిపిస్తుందండీ మీకు?'

ఆమె కళ్ళు యెర్ర బడ్డాయి.

'అది కాదు మహా... మనిద్దరం బతకడమే కనాకష్టంగా ఉంది. మళ్ళీ మనిద్దరి మధ్యలోకి ఇంకొకరంటే కొంచెం ఆలోచించాలి కదా...!'

'మరి మీరెందుకు ఆలోచించలేదు. పడక సుఖం పంచుకుంటే సరిపోతుందా? ప్రతిఫలంతో పని లేదా?'

తను అడిగిన ప్రశ్నకి 'ఎదురు దాడి' తప్ప నా దగ్గర సమాధానం లేదు.

'అయితే ఇప్పుడేమంటావ్?' నా స్వరం హద్దు దాటింది.

'అనడానికి ఇంకేం ఉంది. పరిస్థితి చేజారి పోయాక' తను కూడా స్వరం పెంచింది.

'అయితే నీ పంతం నీదేనన్నమాట'

'ఇదిగో మళ్ళీ చెబుతున్నా... నాది పంతం అంటే ఊరుకునేది లేదు' సివంగిలా లేచింది.

'ఊరుకోక పోతే ఏం చేస్తావేం?!' నాలో ఆధిపత్యం రంకెలేసింది. తానూ ఊరుకోలేదు. గొడవ మెల్లగా చిలికి చిలికి చివరికి పెద్దదైంది, వానతో బాటే! రాత్రంతా కంటి మీద కునుకు లేదు ఇద్దరికీ. పెళ్లయ్యాక మా ఇద్దరి మధ్య ఇంత పెద్ద గొడవ జరగడం ఇదే తొలిసారి.

కుండపోతగా కురుస్తున్న వాన నన్ను నిలువునా తడిపేస్తుంది. ఎగువనుండి ఉప్పొంగుతున్న వాననీరు నా కాళ్ళ సందులో నుంచి దిగువుకి జారిపోతుంది.ఆ నీటిలో తేలివస్తున్న ఎంగిలి ఆకులు వెనకాల ఆబగా  పరుగులెదుతున్నాయి రెండు వీధి కుక్కలు. వీధి మలుపు దగ్గరున్న చెత్త కుప్పల్లో ఉల్లాసంగా పొర్లాడుతున్నాయి ఊర పందులు.

'మనదీ ఒక బ్రతుకేనా, కుక్కలవలె నక్కలవలె. మనదీ ఒక బ్రతుకేనా సందులలో పందులవలె' నా గుండె గదిలో శ్రీ శ్రీ గొంతు ఘల్లుమంది. నిజమే కదా, వాటికేమీ అతీతులం కాదు మనం ఈ ఆత్రపు ప్రపంచంలో! ఇలాంటి లోకంలో మనం బతకడమే ఒక దౌర్భాగ్యం నిజంగా! మళ్ళీ పిల్లలు.. వారసత్వలంటూ వెంపర్లాటలు!

వాన నీటి ప్రవాహాన్ని చీల్చుకుంటూ భారంగా ముందుకు సాగుతున్నాయి నా అడుగులు.

నా గమ్యం అగమ్యం. ఎటు వైపు పోవాలి?

ఎవరితో పంచుకోవాలి నా బాధ?

శంకరం గారి ఇంటికెళ్తే?! బాధల్ని అనుభవించేవాళ్లే ఎదుటి వారి బాధల్ని అర్థం చేసుకోగలరు. శంకరం గారు మాత్రమే నా బాధని అర్థం చేసుకోగలరనిపించింది. దారెటో తెలిసాక నా అడుగులు నీటి ప్రవాహాన్ని చీల్చే చురకత్తులయ్యాయి. నడకలో వేగం పెరిగింది. తడిసిన బట్టల్తో వాళ్ళింటికి వెళ్తే బాగోదన్న శంక ఒక పక్కలాగుతున్నా, అంతకంటే వేరే దారి లేదంపించింది. మరో  ఆలోచనేమీ పెట్టుకోకుండా, శంకరం గారింటివైపు సంధించి వదిలిన బాణంలా కదిలిపోయాను.

♦ ♦ ♦

వీధి గుమ్మం తలుపులు దగ్గరకి వేసి ఉన్నాయి.

ఇంట్లో నుండి శంకరం గారి అరుపులు వినిపిస్తున్నాయి.

దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో అనుదినమూ యుద్ధమే!

వెళ్లాలా? వద్దా అనుకుంటూ వీధి గుమ్మం దగ్గరే ఆగిపోయాను. అలికిడయ్యిది కాబోలు, శంకరం గారొచ్చి తలుపుతీశారు. తెల్లటి ఆయన మొహం కంద గడ్డలా జేవురించి అప్రసన్నంగా ఉంది. వాళ్ళబ్బాయి పద్దెనిమిదేళ్ల అభినవ్ మొహం నల్లగా మాడిపోయుంది. నాకు తుడుచుకోవడానికి తువ్వాలిచ్చి, ఇద్దరికి టీ తెచ్చిచ్చారు కృష్ణవేణి గారు. తాగడం పూర్తయ్యాక, 'అలా బయటకెళ్ళొద్దాం రా' అంటూ పైకి లేచాడాయన. చిలక్కొయ్యకి తగిలించి ఉన్న గొడుగు తెచ్చిచ్చింది వాళ్ళమ్మాయి కౌముది.

బయట వాన కాస్త తగ్గుముఖం పట్టింది.

భాగ్యనగరం – భరత్‌నగర్ 'ఎంఎంటిఎస్' వైపు అలవాటుగా పడుతున్నాయి మా ఇద్దరి అడుగులు. మా కష్టసుఖాల్ని కలబోసుకునే అడ్డా అది. ఫ్లైఓవర్ కిందున్న మార్కెట్ ఆదివారం కావడం వల్ల సందడిగా ఉంది. సెలవు రోజు కావడం వల్ల పెద్దగా జనాల్లేరు స్టేషన్లో. ప్లాట్‌ఫామ్ మీద ఓ మూలనున్న బెంచి మీద కూర్చున్నాం ఇద్దరం. సంగతేమిటన్నట్టు కళ్ళెగరేసారు శంకరం గారు.

విషయం చెప్పాను. క్షణ కాలం తలొంచి ఆలోచలలో పడ్డ అయన తలెత్తి, 'నీవు అన్నది సబబే గానీ... పూర్తిగా అయితే సమర్థించలేనయ్యా!' అనేసి నా భుజం మీద చిన్నగా తట్టారు.

ఓ క్షణకాలం ఊపిరి పీల్చుకుని వొదిలి,

మళ్ళీ ఆయనే 'చావు పుట్టుకలు అనేవి సహజం. మధ్యలో బతుకు పోరు అనివార్యం. అన్నిటికి భయపడుతూ కూర్చుంటే బతకలేం సూరిబాబూ. అంతా బానే ఉంటుందన్న భరోసాతో బతికేయాలంతే!' అంటూ హితబోధ చేశారు.నేను  తలాడించడం తప్ప ఇంకేం మాట్లాడలేకపోయాను.

సన్నగా కురుస్తున్న వాన మళ్ళీ జోరందుకుంది.

'నేను చూడు. ఎలాగోలా ఇద్దరి పిల్లల్ని పెంచి పెద్దచేయలా. రేపో మాపో పెళ్లి చేయాల్సిన ఆడపిల్ల ఉంది ఇంట్లో. నీలా ఆలోచిస్తూ కూర్చున్నానా చెప్పు.' నాలో ధైర్యం నూరి పోయడానికి ప్రయత్నిస్తున్నారాయన.

'మీరు ఓపికమంతులండీ. మీ పిల్లలు కూడా మీలానే సహనపరులు. జీవితం అంటే మీ అంత సానుకూల దృష్టి లేదు నాకు. నేనే ఇలా ఉంటే నా పిల్లలు ఇంకెలా ఉంటారో. సర్దుకు పోయే మనస్తత్వాలు ఉంటాయో లేవో?' నా సంశయాన్ని బయట పెట్టాను.

'ఏది ఏమైనా గానీ... మనుషులుగా పుట్టాక పెళ్ళి, పేరంటం అయ్యాక మన కర్తవ్యం మనం నిర్వర్తించాలయ్యా. పిల్లల్ని కనడం అనేది మన చేతుల్లో ఉంటుంది గానీ వాళ్ళ బుద్ధులైతే మాత్రం మన చేతిలో లేవు. అంతెందుకు.. ఇందాకటి వరకూ నీలాగానే అనుకున్నానయ్యా, నా పిల్లలు సంస్కారవంతులు, సహనపరులు అని! తాను కొనివ్వమన్న 'ల్యాప్ టాప్' ఇప్పట్లో కొనలేనన్నానని నా కొడుకు ఏమన్నాడో తెలుసా? అంత చేతకానోళ్లు నన్నెందుకు కన్నారని అడిగాడయ్యా. ఆ క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు నాకు. పిచ్చిగా అరవడం తప్ప ఇంకేం చేయలేకపోయాను. అంతకంటే ఇంకేం సమాధానం లేదు నా  దగ్గర.'

ఆయన ఆ మాటలంటున్నపుడు గొంతు గాద్గదికమై సన్నగా వొణికింది. ఆయన కనుకొలకుల్లో సన్నటి కన్నీటి పొర లీలగా కదలాడింది. అప్పటిదాకా తెచ్చిపెట్టుకున్న ధైర్యం ఎటు పోయిందో గానీ మనిషి ఒక్కసారిగా డీలా అయిపోయారు. దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో ధైర్యం చేసుకోవడం, మళ్ళీ

పోగొట్టుకోవడం ఎంత సేపు! కొంచెంగా తేలికవుతున్న నా గుండె, ఆయన్ని అలా చూసాక మళ్ళీ బరువెక్కింది. నేను చిన్నాడిని కాబట్టి నా భుజం తట్టి ధైర్యం చెప్పారాయన. అంతటి పెద్దాయన్ని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు నాకు. చాలా సేపు మాటలు కరువయ్యాయి మా మధ్య.

చాలాసేపటి తరవాత ఆయనే గొంతు సరి చేసుకుని, 'ఇవన్నీ మనలాంటోళ్ళ బతుకుల్లో మామూలేనయ్యా. ఇందాకేదో పిచ్చిగా వాడి మీద అరిచేశాను గానీ, కాకపోతే వాడు అడిగింది కొని ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది కదా. ఒకప్పుడు చదువుకి పలక బలపమే కనీస అవసరం. ఇప్పుడు 'ల్యాప్ టాప్' కూడా వీళ్ళకి అంతే అవసరం. కాకపోతే మన ఆర్థిక స్థితి బాగోక, మన కంటికి అదొక విలాస వస్తువులా కనిపిస్తుందంతే. ఏమాటకామాటే చెప్పుకోవాలి. డబ్బున్నోళ్ల పిల్లతో పోల్చుకుంటే మన పిల్లలు రత్నాలయ్యా. ఏదో ఆవేశంలో ఏదో ఓ మాట అనేసినా మన కష్టాల్ని కన్నీళ్ళని వాళ్ళు అర్థం చేసుకున్నంతగా ఇంకెవరూ అర్థం చేసుకోరు. అది సరే గానీ, సాయంత్రం మన బాసు కొడుకు పుట్టినరోజు పండగ సంగతి గుర్తుందా లేదా నీకు?' అనడిగేరు.

'గుర్తు పెట్టుకోకపోతే ఇంకేమైనా ఉందా! ఇంతకీ మీరొస్తున్నారా? వస్తే గనక ఇద్దరం కలిసిపోదామండీ' అన్నాను.

'రాకపోతే కొంపలంటుకుపోవూ. అసలే యజమాని కొడుకాయే. వాళ్ళ మనోభావాలు దెబ్బ తింటే మనం బతికి బట్ట కట్టగలమా చెప్పు' కాస్త విరక్తి నవ్వేడాయన.

మా మాటల ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ మా ముందు నిలబడ్డాడు ఓ బక్క పల్చని కుర్రాడు. వాడి ఒంటి మీద నీలం రంగు నిక్కరు, మాసిపోయి భుజాలు, జారిపోతూ కాస్త చిరుగులు పట్టిన తెల్లని టీ షర్టు వేలాడుతుంది.

'టీ కావాలా సారూ' వాడి మొహం మీద చెరగని చిరు నవ్వు. ఆ కళ్ళలో ఏదో తెలియని మెరుపు. బతుకంటే భయం లేని తెంపరితనం వాడి ప్రతి కదలికలోనూ ప్రస్ఫుటంగా కదలాడుతుంది. యేమి చదువుకుంటే వచ్చింది వాడికి అంతటి ధైర్యం! మేము చదివిన చదువులు మాకు బతుకుదెరువు కంటే, బతుకు భయాన్నే ఎక్కువ కలిగిస్తున్నాయి కదా!

◆◆◆

వాన కాస్త తగ్గు ముఖం పట్టింది. సన్నటి చినుకులు మెల్లగా రాలుతున్నాయి. ఇద్దరం పైకి లేచి ఇంటి వైపు అడుగులేశాము.

'ఎంత కాలమండీ ఈ భరోసా లేని ఉద్యోగాలు చేస్తూ ఈసురో దేవుడా... అంటూ ఏడ్వాలి. ఇలాంటి ఉద్యోగాలు చేస్తూ పిల్లల్ని కనాలంటేనే భయం వేస్తుందండీ' మెల్లగా నాలోని అభద్రతా భావాన్ని బయట పెట్టాను.

'ఏం చేస్తాం సూరిబాబు.. మన కాళ్ళమీద మనం బతుకుదామంటే బుర్రలో అక్షరం తప్ప, చేతిలో 'పని' లేదు. ఇంకో ఉద్యోగం వెతుక్కుందామంటే జీతం, జీవితం మళ్ళీ మొదటి కొస్తాయి. ప్రైవేట్ కంపెనీల్లో కొలువంటే ఎక్కడైనా ఒకటే పరిస్థితి! సర్దుకుపోతూ బ్రతికేయాలంతే!' నీరసంగా నవ్వేడాయన.

'అన్నిటికీ సర్దుకు పోవాలంటే ఎలా శంకరం గారూ... కనీసం ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ లాంటివి ఇచ్చినా ఎంతోకొంత గట్టెక్కుతాం కదండీ!' నా గొంతులో దీనత్వం సన్నగా ధ్వనించింది.

శంకరం గారు గొల్లుమని నవ్వేశారు.

'మనం గట్టెక్కితే ఎక్కడికి పారిపోతామోనని వాళ్ళ భయం. అందుకే మనల్ని మునగనీయరు, అలాగని తేలనీయరు. త్రిశంకు స్వర్గంలో నిలబెట్టి, మన జీవితాలతో ఆటలాడుకోవడం ఈ లక్ష్మీ పుత్రులకి మహా సరదా. నీవు చెప్పిన వెసులుబాట్లు ఏవో కొన్ని లిమిటెడ్ కంపెనీల్లో తప్ప, మన కంపెనీ లాంటి వాటిలో అంత సులువుగా జరిగే పనులు కావు సూరిబాబు. వాటికి చాలా లెక్కలుంటాయి వాళ్ళదగ్గర! లెక్కల్ని తారు మారు చేసే మేధావులు ఉంటారు వాళ్ళ దగ్గర. రక్తపింజరల్లాంటి ఇలాంటి సంస్థల్లో పని చేసే మనలాంటి 'బలి పశువులు' చాలా మంది ఉంటారు మన దేశంలో'.

◆◆◆

శంకరం ఇల్లు రాగానే, గొడుగు నాకిచ్చేసి సాయంత్రం ఐదు కల్లా స్టేషనుకి వచ్చేయమని చెప్పి ఇంట్లో కెళ్ళిపోయారు. నాకైతే ఇంటికెళ్ల బుద్ధి కాలేదు. మళ్ళీ 'ఎంఎంటిఎస్' కే వెళ్లి కూర్చున్నాను. నా ఒంటిమీద తడిబట్టలు ఎప్పుడు పొడి బారినాయో కూడా తెలీలేదు నాకు. కరెక్టగా ఐదింటికి స్టేషన్ కొచ్చేసారు శంకరం గారు. నన్ను చూసి కంగారైపోయారు.

'ఏవయ్యా, ఇంటికెళ్లలేదా? పొద్దున వేసుకున్న బట్టలు వేసుకున్నట్టే ఉన్నాయ్. ఇంటికెళ్ళడం ఇష్టం లేకపోతే మా ఇంట్లోనే ఉండక పోయావా? అసలు ఏమైనా తిన్నావా కడుపుకి. లే.. టిఫిను చేద్దువుగానీ..' నా రెక్క పుచ్చుకుని పైకి లేపాడాయన.

'పర్లేదులెండీ నాకివన్నీ మామూలే. ఆకలి మంట నాకు చిన్నప్పుడే అలవాటైపోయింది. ఈ మంటని నా పిల్లలు అనుభవించకూడదనే నా బాదండీ...' నీరసంగా నవ్విన నవ్వు, నా పెదాలు దాటి బయటికి రాలేదు.

లింగంపల్లి టూ సికింద్రాబాద్ వెళ్లే ట్రైనొచ్చింది.

ఇద్దరం అటువైపు కదిలాం. అది మమ్మల్ని తన బాహువుల్లో పొదివి పట్టుకొని, పట్టాల మీద వేగంగా గమ్యం వైపు పరుగులు

తీసింది. ట్రైను దిగాక మాబోటి ఉద్యోగులే ఇంకొందరు మాతో జమయ్యారు. అందరం కలిసే వేదుకకి బయల్దేరాం. విద్యుత్ దీపాల అలంకరణ తో దేదీప్యమానంగా వెలిగిపోతుంది ఫంక్షన్ హాలు. పార్కింగ్‌లో పెట్టిన ఖరీదైన కార్లు ధగధగలాడి పోతున్నాయి.

కార్ల లోంచి దిగుతున్న జనాల చేతుల్లో రకరకాల రంగుల్లో గిఫ్ట్ ప్యాకెట్లు తలతల్లాడిపోతున్నాయి. మనుషులు ఖరీదైన వస్త్రాభరణాల్లో లక్ష్మీపుత్రుల్లా మెరిసిపోతున్నారు. వేదిక మధ్యలో మా అమ్మ గారి ఒడిలో కూర్చుని బోసినవ్వులు చిందిస్తున్నాడు చిన్నారి కృష్ణ చైతన్య. వాడ్ని (అనొచ్చా ) చూడగానే మనసుకెంతో హాయిగా అనిపించింది. వీడైనా మా యజమానిలా మారకుంటే బావుణ్ణు అనిపించిందా క్షణం. మా యజమాని హర్షవర్ధన్ గారు విఐపిలను రిసీవ్ చేసుకుంటూ ఊపిరి సలపనంత బిజీ అయిపోయారు. సిటీలో 'రియల్ ఎస్టేట్' కంపెనీని స్థాపించి, అతి తక్కువ కాలంలోనే మంచి పేరు గడించిన యువ వ్యాపార వేత్త ఆయన. ఆయన ఎదుగుదలకి అసలు కారణం, నమ్మ కస్తులైన తన ఉద్యోగస్తుల కృషియే 'పెట్టుబడి' అని చాలాసార్లు గొప్పగా చెబుతుంటారాయన! అలా అనడం ఆయన మంచితనం అని పొగ వేస్తుంటారు, ఆయన చుట్టూ ఉన్న కొందరు పెద్ద మనుషులు!

ఆ మంచితనం ఆయన మాటల్లో తప్ప చేతల్లో ఎప్పుడూ కన్పించలేదు నాకు. ఎక్కువ పని గంటలు, తక్కువ వేతనాలు. గొర్రెకు బెత్తడు తోక జీతాలు. ఎప్పుడైనా మేము ఎదురు పడితే ఒక మెత్తని చిర్నవ్వు తప్ప. ఆ నవ్వు చాలదూ, నెత్తురు రాకుండా మా గుండెల్ని మెత్తగా కోయడానికి!

వేదిక దగ్గర కాసేపు కూర్చుని నా బోటి వాళ్లమంతా భోజనాల వైపు కదిలాము. నేను తింటున్నాను గానీ నాలుకకి రుచి తగలడం లేదు, వంటలు బాగోక కాదు మనసు బాగోక. ఉదయం మా ఇంట్లో జరిగిన గొడవే మనసులో గింగిరాలు తిరుగుతుంది. ఏదో తిన్నానన్పించి అందరి కంటే ముందే తినేసి, బయటుంటానని చెప్పి ఫంక్షన్ హాలు బయటకొచ్చి నిలబడ్డాను. ఫంక్షన్ హాలు బయట సినిమా తెరంత హోర్డింగ్ మీద చిరునవ్వులు చిందిస్తున్న చిన్నోడు కృష్ణ చైతన్య ఛాయా చిత్రం చాలా అందంగా మెరుస్తుంది.

'నాక్కూడా అలాంటి కొడుకో కూతురో పుడితే ఇంతే అందంగా పుడతారా? నా ఆలోచనికి నాకే నవ్వొచ్చింది. పిల్లంటేనే అందం కదా! ఎవరి పిల్లలైనా పుట్టినప్పుడు బానే ఉంటారు, పెరిగేకొద్దీ మాత్రమే కదా సరైన తిండి లేకనో బతుకుదెరులేకనో బక్కపల్చని బడుగు జీవులైపోతారు.

'ఖర్చు... పాతిక లక్షలపై చిలుకేనంట సూరిబాబు. ఇందాక మూర్తి గారు చెప్పేరు. తొలి పుట్టినరోజుకే ఇంత ఖర్చు పెట్టేడంటే వాడు ఎదిగే లోపు ఎన్ని లక్షలు ఖర్చు చేస్తాడో. అయినా పిచ్చిగానీ అంత ఖర్చుపెట్టి పండగ చేయకపోతే ఆ పసోడు అడుగుతాడా అలుగుతాడా? వేలంవెర్రి కాకపోతే!' శంకరం గారు పెదవి విరిచారు.

"డబ్బున్నోళ్ళండి. అడిగినా అడగకపోయినా పిల్లల కోసం ఆకాశంలో చందమామని తెంపుకురావడానికి కూడా ఆలోచించంచరండీ. మనలాంటోళ్ళమే పది రూపాయలు పెట్టి పచ్చి మిరపకాయ బజ్జీలు పట్టికెల్లాళ్ళన్నా పది సార్లు ఆలోచించు కోవాలి' అన్నాను.

◆◆◆

రోడ్డుమీదకొచ్చి రైల్వే స్టేషన్ వైపు వడి వడిగా అడుగులేస్తుంటే శంకరం గారి ఫోను రింగయ్యింది. 'అమ్మాయే నయ్యా... ఇదిగో మాట్లాడు.' అని చెప్పి ఫోను నాచేతిలో పెట్టారు. అప్పుడు వరకూ గుర్తేలేదు, నా మొబైల్ ఇంట్లో వదిలేసిన సంగతి. నేను ఎక్కువ సేపు కనిపించలేదంటే శంకరం గారి దగ్గరే ఉంటానని మహా నమ్మకం. అవతల తన గొంతు నీరసంగా ఉంది. మాటలు పొడి పొడిగా రాలుతున్నాయి. మౌనంగా వినడం తప్ప, ఆ క్షణం ఎలా స్పందించాలో అర్థం కాక గమ్మున ఫోను పెట్టేసి శంకరం గారికిచ్చేసాను.

'ఏమయ్యింది సూరిబాబూ... ఊరకేనా ఫోన్ చేసిందా అమ్మాయి?' ఆరా తీశారు.

'ఊరకేనండి... తలనొప్పిగా ఉందంట. వొచ్చేటప్పుడు మందు బిళ్ళలు తీసుకురమ్మంది' ముక్తసరిగా అనేసి ఊరకుండిపోయాను.

'ఆడోళ్ళు చాలా సున్నిత మనస్కులయ్యా. చిన్న విషయానికే ఎక్కడికో ఆలోచిస్తారు. అలాంటిది ఇలాంటి విషయాల్లో నిర్ణయం తీసుకోవాలంటే ప్రాణ సంకటమే పాపం!' శంకరం గారి గొంతులో సానుభూతి ధ్వనించింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో ట్రైనెక్కి భరత్ నగర్‌లో దిగేసరికి టైం ఎనిమిది దాటేసింది. శంకరం గారు గొడవలేమీ పడొద్దని జాగ్రత్తలు చెప్పి, తలనొప్పి మాత్రలు మర్చిపోకుండా తీసుకెళ్లమని చెప్పి ఇంటిదారి పట్టారు.

◆◆◆

నేను రోడ్డు దాటి ఇంటి వైపు నిస్సత్తువుగా అడుగులు వేశాను. దారి మధ్యలో ఆగి నాకు తెలిసిన మందుల షాపు అతణ్ణి, మహా అడిగిన మందులు అడిగి తీసుకున్నాను.

కాస్త తెరిపిచ్చిన నీలాకాశాన్ని మళ్ళీ నల్లటి మబ్బు మెల్లగా కమ్ముకొస్తుంది. ఇంటి వైపు అడుగులు భారంగా పడుతున్నాయి. వీధిలో కుక్కలు ఎందుకనో గోల గోలగా ఏడుస్తున్నాయి. మా ఇంటి తలుపులు బార్లా తెరిచే ఉన్నాయి. ఇంటి మధ్యలో శోక

దేవతలా కూర్చునుంది 'మహా'. ఆమె మొహం ఏడ్చి ఏడ్చి వాడిపోయి వుంది.

నన్ను చూడగానే, కసాయి వాడు ముందు మెడ సాచి నిలబడ్డ గోవులా నిస్సహాయంగా తలొంచుకుని మందుల కోసం చేయి చాసింది. నాకు తల కొట్టేసినట్టయింది. సిగ్గుతో మొహం కుచించుకుపోయింది.

'తలొంచుకోవాల్సింది నువ్వుకాదు మహా...నేను! నన్నింత పిరికోడ్ని చేసి, చివరాఖరుకి కాషాయివాడిగా మార్చేసిన ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ, దాన్ని భుజాలకెత్తుకునే సర్కారోళ్లు.' నా మనసులో మాట గొంతు దాటలేదు. నేను తెచ్చిన మందుల పొట్లం ఆమె చేతిలో పెట్టాను. పొట్లం విప్పిచూసిన ఆమె కళ్ళల్లో మెల్లగా దిగులు మేఘాలు కరిగి కన్నీరవడం చూశాను. ఆమెనలా చూసి తట్టుకోవడం నా వల్ల కాదనిపించి, బయట కొచ్చి నిలబడ్డాను.

నీలాకాశంలో మబ్బు కరిగి హోరుమంటూ వాన మొదలైంది. బయట పెళపెళమంటూ ఉరుములు మెరుపులు. ఇంటి లోపల బోరుమంటూ 'మహా' ఏడుపు. వాన హోరులో మహా ఏడ్చిన ఏడుపు కలగలిసిపోతుంది. ఈ క్షణమో మరుక్షణమో వాన ఆగిపోవొచ్చు. మహా మాత్రం, నిత్యం వర్షిస్తూనే ఉంటాది కొన్నాళ్లపాటు!

◆ ◆ ◆

మహా నెల తప్పిన విషయం మా ఇద్దరితో బాటు, శంకరం గారొక్కరికే తెలుసు. రేపు ఎప్పుడైనా ఆయనకి గుర్తొచ్చి, 'అమ్మాయికి ఇప్పుడు ఎలా వుందోయ్? ఇప్పుడు ఎన్నో నెల?' అని అడిగితే?

'మొన్నొక రోజు అనుకోకుండా గర్భస్రావం అయిపోయిం దండీ' అని చెప్పి తప్పించుకుంటే సరి, సమస్య తీరినట్టే! నిర్దోషిగా దర్జాగా చలామణి అయిపోవొచ్చు నేను! సమాధానం దొరికాక గుండెల మీద భారమేదో దిగినట్టన్పించి, తేలిగ్గా ఊపిరి తీసుకుని జేబులో సిగరెట్టు తీసి వెలిగించాను. ఎర్రగా మండిపోతూ నుసి నుసిగా రాలిపోతుంది సిగరెట్టు. బహుశా నేను తెచ్చిచ్చిన మందులతో 'మహా' కడుపులో ఊపిరి పోసుకుంటున్న మా 'అంకురం' కూడా ఈలాగే చితికి పోతూండొచ్చు. ఇంట్లో ఉన్న 'మహా' రోదనతో పోటీ పడుతూ మెల్లగా జోరందుకుంది మాయదారి వాన. వీధి అరుగు మీద పడక కుర్చీలో కూర్చుని మెల్లగా వెనక్కి తల వాల్చాను. ఏదో తెలియని అపరాధ భావంతో మనసు మూలుగుతున్నా, అలసిపోయిన నా కళ్ళు మాత్రం మెల్లగా మూతలు పడుతున్నాయి.

◆ ◆ ◆

తెల్లగా తెల్లారిపోయింది. వాన తగ్గి మబ్బులు వీడి మెల్లగా వెలుగు రేఖలు విచ్చుకున్నాయి.వాకిట్లో అలికిడికి చప్పున మెలకువ వొచ్చింది. వాకిట్లో గొంతుక్కూచుని ముగ్గులేస్తుంది మహా. తలంటు పోసుకుని వదులుగా వదిలేసిన జుట్టు మొహం మీదకి జారి అల్లరి పెడుతుంది. నా ఊహకి విరుద్ధంగా మబ్బులు తేలిపోయిన ఆకాశంలా నిర్మలంగా ఉంది ఆమె మొహం. నన్ను చూడగానే ముగ్గు గిన్నె పక్కకి పెట్టి మెల్లగా నాపక్కకొచ్చి కూర్చుంది. సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ 'ఏవండీ.. నేనో మాట చెబుతాను వింటారా?!' అనడిగింది.

నిలువునా తలాడించాను.

'ఏవండీ... మీ బాధ నాకు అర్థమయ్యింది. పిల్లలంటే మీకు ఇష్టమే. కాకపోతే వాళ్ళు పుట్టి మనలా కష్టపడకూడదనే కదా మీ ఆలోచన.' నా కళ్ళల్లోకి చూస్తూనే ఉంది.

నా కళ్ళల్లో చప్పున నీళ్లు తిరిగాయి. కన్నీటి చుక్కలు నేల రాలకుండా తలని పైకెత్తి కుర్చీలో వెనక్కి వాలిపోయాను.

"ఏమండీ.. రాత్రంతా ఆలోచించాను. నేనూ మీతో బాటే కష్టపడి నాలుగు రూపాయలు సంపాదించాలనుకుంటున్నా నండీ. రేపు మనకి పుట్టబోయే పాపకో, బాబుకో మంచి జీవితాన్ని ఇవ్వడానికి ఇద్దరం కష్టపడదాం. మన స్థాయికి తగ్గట్టు ఒక్కరంటే ఒక్కర్నే కందాం. మనిద్దరం కలిసి ఆ ఒక్కరి బతుక్కి మంచి దారి చూపిద్దామండీ. ప్లీజ్!' ప్రాధేయపూర్వకంగా అడిగింది.

'అంతా అయిపోయాక... ఏం ఆలోచించి ఏం లాభం పిచ్చి మొద్దూ!' పడక కుర్చీలోనుండి పైకి లేచి నిర్వేదంగా నవ్వాను నేను.

'ఏం ఐపోలేదండీ' అంటూ గబగబా తన చీర చెంగున కట్టుకున్న పొట్లాన్ని విప్పదీసి హుషారుగా చేతిని నా మొహం ముందరికి చాపింది. అర చేతిలో రాత్రి నేను తెచ్చిచ్చిన మందుల పొట్లం!

ప్రశ్నార్థకంగా చూశాను తన వైపు.

మెల్లగా తలదించుకుంది.

'రాత్రి ఈ మందులు వేసుకోలేదండీ. తప్పైతే చెప్పండీ... ఇప్పుడే వేసేసుకుంటా' మందుల పొట్లాన్ని విప్పదీయబోయింది మహా.

గబుక్కున చేతిలో పొట్లాన్ని లాక్కుని విసురుగా వాకిట్లోకి విసిరేశాను. ఆమెని గట్టిగా హత్తుకుని మెత్తగా బుగ్గలపై ముద్దాడాను. నాలో గువ్వలా వొదిగిపోయింది మా ఇంటి మహాలక్ష్మి 'మహా'.

■

## అనువాద కవిత

# చెదరని కల

ఆంగ్ల మూలం :
**డాక్టర్ షాలు నిగమ్**
అనువాదం :
**కొత్తపల్లి రవిబాబు**




ప్రతి చిన్న పిల్లకూ వుంటుంది ఒక కల
చదువుకోవాలనే కల
ఆటపాటల్లో మునిగితేలాలనే కల
నాట్యం చేయాలనే కల, ఆకాశంలోకి ఎగరాలనే కల
అన్నీ అడ్డంకుల నుంచి స్వేచ్ఛ కోరే కల
సమానత్వాన్ని ఊహించే కల
హెచ్చుతగ్గులు నిర్మూలన కావాలనే కల
అడ్డుగా నిలిచే అద్దాలను పగలగొట్టాలనే కల
పితృస్వామ్యాన్ని సవాలు చేసే కల
అణచివేతను, లింగుబాటును వ్యతిరేకించే కల
అవకాశాల, అభిరుచుల, ఆకాంక్షల కల
ఎప్పటికీ మరణించని కల!

నీవు గోడలు, కంచెలు, సరిహద్దులు నిర్మించవచ్చు
కులమత ప్రాంతీయ భేదాలు సృష్టించవచ్చు
స్కూళ్ళు మూసేయవచ్చు
కళాశాలలకు ఆర్థిక సహాయం ఆపేయవచ్చు
విశ్వవిద్యాలయాల ఊపిరి హరించవచ్చు
గ్రంథాలయాలు మూసేయవచ్చు
ఆయుధాలను, బాంబులను, సైన్యాన్ని,
జైళ్లను ఉపయోగించవచ్చు
కానీ, ఊహల కర్మాగారానికి తాళం వేయలేవు
తరతరాల నుంచి కంటున్న ఈ కలలు
తరువాతి తరాలకు తరలుతూ వుంటాయి.
ఈ కలలకు మరణం లేదు!

నిరంకుశ పాలకుల వివక్షాయుత
అణచివేత చట్టాలతో
పురాతన ఛాందసుల తిరోగమన భావాలతో
ఆమె చలనానికి పరిమితులు విధిస్తూ
ఆమె శరీరాన్ని పరదా వెనక్కు నీవు నెట్టవచ్చు
పితృస్వామిక భావజాలాన్ని ఆమెలో నింపవచ్చు
భయాన్ని, బీభత్సాన్నీ, బెదిరింపునీ
ఆమెపై ఉపయోగించవచ్చు
పురుషత్వ విషాన్నీ, క్రోధాన్నీ, ద్వేషాన్నీ
ఆమెపై ప్రయోగించవచ్చు
కానీ ఆమె సాహసోపేతమైన మానసిక చర్యలను అడ్డుకోలేవు
యుద్ధవీరుని బాటలో ఆమె పయనిస్తుంది
ఎందుకంటే ఆమె అనంతంగా కలలు కంటూ వుంటుంది కనుక!

ఆడపిల్లలను గర్భస్థ శిశువులుగానే నీవు చంపవచ్చు
బతికితే వివక్ష చూపవచ్చు
కానీ వారిలో వున్న నిర్భయత్వాన్నీ,
ధైర్య సాహసాలను నీవు చంపలేవు
పరువు హత్యలు, బాల్య వివాహాలూ రుద్ద వచ్చు
కానీ వారి కలలను ఏ పంజరంలోనూ బంధించలేవు
నీవు మతోన్మాదంతో మలాలానెందరినో కాల్చవచ్చు
స్త్రీ ద్వేషంతో ఎందరో ఆసిఫాలను భ్రష్టు పట్టించవచ్చు
నీవు మదమెక్కి ఆశాలెందరిపైనో లైంగిక దాడి చేయవచ్చు
కానీ ఆమె దార్శనికతను చంపలేవు
ధైర్యంగా ఊహించడం నేర్చుకున్న ఆమె మనసును బంధించలేవు
నీవు ఎంత అణగదొక్కితే
ఆ కలలు అంతా బలీయమౌతాయి

నీకు సాధ్యమైనది ఏమైనా చేసుకో పో!
ఈ కలలకు మరణం లేదు
ఇక్కడ ప్రతి బాలికకు ఒక కల వుంటుంది
లక్షలాది అవకాశాలను,
అభిరుచులనూ ఎదురుచూసే కల
సృజనాత్మకత ద్వారా, కరుణ ద్వారా
మార్పు సాధించే కల
తన చుట్టూ హింస లేని ప్రపంచాన్ని ఊహించే కల
ఆ చిన్నపిల్లకు తెలుసు ప్రతిఘటించడం
తన తిరుగుబాట్ల ద్వారా, విప్లవాల ద్వారా నిరసన తెలియచేయడం
ఆమెకు తెలుసు ఆమె కల భగ్నం కాదని,
నీవేం చేసినా సరే
ఆ బాలిక ఒక యోధ, ఎవరూ అడ్డుకోలేరు
ఇవాళో, రేపో ఆమె కల నెరవేరుతుంది
ఆమె కలకు చావులేదు గాక లేదు!




# మాలపల్లి
# సాహిత్య విమర్శ

- డా. పిసి వెంకటేశ్వర్లు

94901 64963

ఏ రచనకైనా, ఏ కావ్యానికైనా, ఏ గ్రంథానికైనా ఆయా గ్రంథకర్తల ముందుమాటలు తప్పకుండా ఉంటాయి. ఇవి పాఠకుణ్ణి చేయి పట్టుకొని తన గ్రంథంలోనికి నడిపించుకొని తీసుకెళ్ళడానికి సహాయపడతాయి. రచయిత సృష్టించిన గ్రంథం ఏ విషయాన్ని చెబుతుంది? దానిలో వస్తువేమిటి? ఎందుకు రాయాల్సి వచ్చింది? వంటి విషయాలను ఈ ముందు మాటలు తెలియజేస్తాయి. అయితే ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవలకు రాసిన 'పరిచయం'లో ఇలాంటి సంప్రదాయాలేవీ పాటించలేదు. పుస్తకాన్ని వాడుక భాషలో రాయడానికి ప్రయత్నించినపుడు ఎదురైన సమస్యలను మాత్రం చెప్పుకున్నారు. పుస్తకం ప్రారంభంలో పెట్టిన పేరు, కొద్దిదూరం పోయాక 'సంఘ విజయం' అని పిలవడం మేలనిపించిందని చెప్పుకున్నాడు. ఈ రెండు విషయాలు తప్ప నవలా వస్తువును గురించి కానీ, నవల రాయడానికి ప్రేరణ కానీ ప్రస్తావించ లేదు. చర్చ జరిగిన తరువాత అవసరం ఉంటే సవరించు కుంటానని మాత్రం చెప్పుకున్నాడు. ఏ గ్రంథానికైనా దాని కర్త రాసే మొదటిమాటలే ఆ గ్రంథానికి మొదటి విమర్శ వాక్యాలు అవుతాయి. అయితే గ్రంథాన్ని చదివి ఇతరులు రాసిన విమర్శను మాత్రమే గ్రంథవిమర్శగా మనం భావిస్తున్నాం. ఆ దృష్టితో చూసినపుడు 'మాలపల్లి' నవలకు మొదటి విమర్శగా చెప్పుకోవాల్సింది ఈ నవలకు ముందుమాట రాసిన కాశీనాథుని నాగేశ్వరరావు 'తొలి పలుకు'. 'శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణ గారి మాలపల్లి తెలుగు సాహిత్యము మానవధర్మ పరిణామమునకు సాధనగా గల విధమును హృద్యముగా నిరూపించుచున్నది. ఆంధ్ర సాహిత్య పరిణామమునందు నిరుపమానమైన గ్రంథము సంఘ విజయము. మాలపల్లికి నామాంతరము రెండు పేర్లందు ఏ పేరు సార్థకమైనను ఈ గ్రంథము ధర్మపరిణామ నిర్ణయము లందొక మహాభారతము.' (మాలపల్లి ముందుమాట పుట – 8,9) అని చెప్పి మాలపల్లిలో రచయిత నవజీవన నిర్మాణ విధానాన్ని చక్కగా ఆవిష్కరించాడని చెప్పారు. ఈ నవలలో ఉపయోగించబడ్డ వాడుక భాష, శైలి, పరమార్థం వంటి విషయాలను తెలియజేశాడు. ఈ విమర్శ తరువాత విమర్శ కులు రకరకాలుగా స్పందించారు.

మాలపల్లి నవలపై వచ్చిన విమర్శను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. సంపూర్ణ పరిశోధన గ్రంథాలు, 2. పరిశోధనల్లో మాలపల్లిని చర్చించిన గ్రంథాలు, 3. విమర్శ వ్యాసాలు, 4. సాహిత్య చరిత్రలు, ఇతరాలు.

**1. సంపూర్ణ పరిశోధన గ్రంథాలు :** మాలపల్లి నవలపై వివిధ విశ్వవిద్యాలయాల్లో అనేక పరిశోధనలు జరిగాయి. అవి :

1. మాలపల్లి పరామర్శ
   : జి.ఆంజినేయులు నాయుడు (1978 – యస్వీయూ)
2. మాలపల్లిలో సామాజిక స్పృహ
   : జె.పి. సుహాసిని (1979 – నాగార్జున)
3. మాలపల్లిలో పాత్రచిత్రణ : పి. భాగ్యమ్మ (1982 – కాకతీయ)
4. మాలపల్లి విమర్శనాత్మక పరిశీలన
   : ఎస్.కృష్ణమాచార్య (1988 – కాకతీయ)
5. మాలపల్లి నవల – దళిత జీవితచిత్రణ
   : బి. లక్ష్మి (2003 – తెలుగు వి)
6. మాలపల్లి – గోదాన్ తులనాత్మక పరిశీలన
   : ఎన్. స్వామి (1984 – ఉస్మానియా)
7. మాలపల్లి – కూలిగింజలు నవలల్లో శ్రామిక జీవిత చిత్రణ
   : టి.మౌళి (1990 – శ్రీకృష్ణదేవరాయ)
8. మాలపల్లి – వేయిపడగలు తులనాత్మక పరిశీలన
   : టి. వీరప్రసాద్ (1994 – శ్రీకృష్ణదేవరాయ)

9. మాలపల్లి– రక్తనది నవలలు తులనాత్మక పరిశీలన

: పెరుగు రమేష్‌బాబు (2015– శ్రీకృష్ణదేవరాయ)

10. ఉన్నవ లక్ష్మీనారాయణ (మోనోగ్రాఫ్) : కేంద్ర సాహిత్య అకాడమీ

11. మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు : బండి గోపాల్ రెడ్డి

12. మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం : అనుమాండ్ల భూమయ్య

13. ఉన్నవ రచనలు కొన్ని (సంకలనం) : కె.వి. రమణారెడ్డి

పిహెచ్.డి., ఎం.ఫిల్. డిగ్రీల కోసం కాకుండా మాలపల్లిపై కఠోరమైన పరిశోధన చేసి, సంపూర్ణమైన పరిశోధన గ్రంథంగా మనకు కొత్త ఆలోచనలు రేకెత్తించే గ్రంథం బంగోరె రాసింది. 'మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు' గ్రంథం. డిగ్రీల త్రాసులో తూగని విమర్శ. అలాగే అనుమాండ్ల భూమయ్య రాసిన 'మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం'. డిగ్రీలతో సంబంధం లేకుండా రాయబడ్డ మరొక విమర్శ. అలాగే కె.వి. రమణారెడ్డి సంపాదకత్వంలో వచ్చిన 'ఉన్నవ రచనలు కొన్ని' గ్రంథం ఉన్నవ సాహిత్య సృజన విరాట్రూపాన్ని ఆవిష్కరించింది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ పరిశోధన కోసం జి.ఆంజినేయులు నాయుడు 'మాలపల్లి పరామర్శ' అనే అంశాన్ని ఎంచుకున్నారు. కేతు విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో విశ్వవిద్యాలయ స్థాయిలో వచ్చిన మొదటి పరిశోధన ఇది. ఈ పరిశోధన మాలపల్లి నవలలోని కవి జీవితానికి, ఇతివృత్త పరిచయానికి, పాత్ర నిర్మాణ ప్రతిఫలనానికి పరిమితమైంది. ఉన్నవ వారి మాలపల్లి నిషేధానికి కారకాలు, తదనంతర పరిణామాలు వంటి వాటిని చర్చించలేదు. అయితే ఈ నవల వేలూరు జైలులో ఉన్నప్పుడు ఏప్రిల్ 9, 1920 నాటికి ఉన్నవ పూర్తి చేశారని, ఇది తెలుగు తొలి నవల వచ్చిన యాభై ఏళ్ళకు వచ్చినట్లుగా నిర్ధారించారు.

1979లో బండి గోపాల్ రెడ్డి శ్రమతో వెలుగు చూసిన 'మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు' గ్రంథం తెలుగు పరిశోధన రంగంలో మేలిమి ముత్యం. పరిశోధన రాక్షసుడైన బంగోరె తాను మాలపల్లి నవల వచ్చిన తరువాత అది రెండు సార్లు నిషేధానికి గురికావాల్సిన అవసరాన్ని తెలుసుకొనేందుకు అనేక డాక్యుమెంట్లు సంపాదించి నకళ్ళతో సహా గ్రంథంలో అచ్చువేశాడు. అలాంటి నిషేధానికి 'మాలపల్లి' గురికావడానికి కారణాలను ప్రముఖ విమర్శకులు దిగువల్లి వెంకట శివరావు, కె.వి రమణారెడ్డి, నగ్నముని వంటి వారి చేత వ్యాసాలు రాయించి ఈ గ్రంథం ముందు చేర్చాడు. నిషేధానికి నేపథ్యంలో పనిచేసిన శక్తులు అనే ముందు మాటలో దిగువల్లి వారు ఆనాడు జరిగిన మాలపల్లి నిషేధంలో తెరవెనుక సంగతులను కళ్ళముందుంచారు. బ్రిటిష్ పాలక వర్గం వారికి తాబేదార్లుగా పనిచేసిన జస్టిస్ పార్టీ మంత్రులు మాలపల్లి నిషేధంలో కీలకపాత్ర పోషించారు. ఆరోజు బ్రహ్మణులను వ్యతిరేకిస్తున్న, కమ్మవారిని (చౌదరయ్య), భూస్వామ్య నిరంకుశ విధానాలకు ప్రతినిధులుగా చెప్పడం ఒక బ్రహ్మణుడిగా ఉన్నవ వారు పొరబాటు చేశారని వెంకట శివరావు గారు అభిప్రాయపడ్డారు. 'ఈ నవలలోని కథా సంవిధానం, పాత్రపోషణ కేవలం గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని కమ్మ భూస్వాములను అవమానించి వారి కింది కూలిజనాన్ని రెచ్చగొట్టే దురుద్దేశంతోనే ఆ సంఘంలోని వారే బాహటంగా చెప్పుకోవడం ప్రారంభించారు.' అంటూ ఆనాడు బ్రహ్మణులను దుర్మార్గాలను ఎండగడుతూ త్రిపురనేని, కొత్త భావయ్య చౌదరి వంటి వారు రాసిన పుస్తకాలను ఉటంకించారు.

'నా యాంగిల్ నుంచి' అంటూ కె.వి.రమణారెడ్డి రాసిన విమర్శ వ్యాసంలో– ఉన్నవ వారిని మినీ వీరేశలింగం పంతులుగా అభివర్ణించారు. వీరేశలింగం, ఉన్నవ వారి మధ్య అభిప్రాయ భేదాలకు కారణాలు తెలియవని ముక్తాయింపు ఇచ్చాడు. మాలపల్లి సంగమ విజయమయ్యింది కానీ, వెంకట విజయం కాలేదంటూ కెవిఆర్ చేసిన వ్యాఖ్య ఎంతో లోతైంది. ఉన్నవ ఆలోచనను స్పష్టపరిచేవిగా ఉన్నాయి. ఉన్నవ ఇక ఊహాజనిత (యూటోపియన్) సోషలిజాన్ని కలగన్నాడని చెబుతూ ఉన్నవ వాడిన ధర్మక వర్ణాలు అనే పదాన్ని రాబిన్ హూడ్‌ను జ్ఞాపకం చేస్తాయని తెలిపాడు.

'తెలుగులో నాటకానికి కన్యాశుల్కం నవలకు మాలపల్లి ఈనాటికీ సాటిలేనివి. వాటిలో జీవితముంది. దాని తాలూకూ వాస్తవం స్పదిస్తుంది. కాబట్టే అవి అనన్యం, అసమానం కాగలుగుతున్నాయి.' అని మెచ్చుకున్నాడు. ఈ నవలపై నిషేధం ఎత్తివేసే విషయ చర్చ జరిగినప్పుడు ఉన్నవ వారు మెత్తబడి కొన్ని వాక్యాలు తీసేయడానికి ఒప్పుకోవడం గురించి సూటి ప్రశ్న వేశాడు. అది ఉద్యమకారుడిగా ఉన్నవ లొంగుబాటా? లౌక్యమా? అని ప్రశ్నించాడు. పద్యం కోసం జైలు కెళ్ళిన గరిమెళ్ళలోని ధైర్యాన్ని ప్రస్తావించాడు. అంత నిబద్ధత ఉన్నవ వారిలో లేదా! అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

'సంగమ విజయం' పేరిట నగ్నముని రాసిన ముందు మాట ప్రతి రంగంలోనూ అతివాదులు, మితవాదులు, విప్లవ వాదులు ఉంటారని; వారందరూ మాలపల్లి నవలలో కనిపిస్తారని చెప్పారు. 'మాలపల్లిపై మిసెస్ హెన్రీవుడ్ ఈస్టెన్' ఆంగ్ల నవల ప్రభావం ఉందని తెలుగుదేశంలో కొందరు పరిశోధకులు, మేధావులుగా చలామణి అయ్యేవాళ్ళు, మాలపల్లిపై మసి పూయడానికి చేసిన ప్రయత్నం వారి బుద్ధి తక్కువకు, మత్సరానికి, కుత్సితానికి నిదర్శనం' అంటూ ఇక్కడి జీవితం, ఇక్కడి సమస్యలు మాలపల్లి నిండా ఉన్నాయని తెలియజేశాడు.

బంగోరె 'ముందుమాటలు'లో వ్యవహారిక భాష విషయం లో బ్రౌన్ కన్న కలలు 'మాలపల్లి' రూపంలో కన్పించాయని మెచ్చుకున్నాడు. అయితే ప్రభుత్వం 1923లో నిషేధించిన 'మాలపల్లి' కంటే ముందు ఎన్నో పుస్తకాలపై ప్రభుత్వాలు సమాధి కట్టిన విషయాన్ని ప్రస్తావించాడు. 'స్వరాజ్యసోపానం', 'అవతార పరివర్తనం' గాంధీ మహో దయం (1921) వంటి రచనలను ప్రభుత్వం నిషేధించిన విషయాన్ని గుర్తు చేశాడు. రమణారెడ్డి వంటివారు మాలపల్లిలో వెంకటదాసు కమ్యూనిస్ట్ కాదని చెప్పారని, అయితే వెంకట దాసు కోర్టులో చేసిన ఉ పన్యాసంలో, బుర్రకథా గేయంలో, ఆనాటి కమ్యూనిస్టులు అతడిని కమ్యూనిస్ట్‌గానే చూసుకున్నారని గట్టిగా చెప్పారు. ఈ గ్రంథాన్ని ఉన్నవ వ్యక్తిత్వ అంశాలు, మాలపల్లి పూర్వరంగం, ఫైలోపాఖ్యానం, పత్రికల్లో మాలపల్లి ప్రస్తావనలు, నవల వ్రాతప్రతిని కాల్చేస్తే సరి, పత్రికల్లో సమీక్షలు, కౌన్సిల్లో ప్రశ్నల వర్షం, ఫైలురథం మళ్ళీ కదిలింది, అభ్యంతరకర భాగాలు, ఉన్నవ చేసిన వాదాలు, పునర్ముద్రణ పునర్నిషేధం, అనుబంధాలు వంటి విషయాలుగా బంగోరె వర్గీకరించాడు. ఏదో నవల రాసుకుంటాడులే అని అను మతించిన జైలు అధికారులు ఆయన రాసిన ఎనిమిది ఎక్సర్సైజు పుస్తకాలు, 609 పుటల నవల చూసి నిశ్చేష్టులై పోయారనే విషయాన్ని బంగోరె చెప్పడంలో ఉన్నవ వారి దక్షతను అంచనా వేయడమే. ప్రతి అధ్యాయానికి, ప్రతి మాటకు, వారు చేసిన ప్రతిపాదనకు ఆధారాలున్నాయని స్పష్టంగా చూపించారు. ఆరోజు జారీ చేసిన నిషేధాజ్ఞల ఉ త్తర్వుల, ఉన్నవ రాసిన సమాధానాల నకలు ప్రతులను ఈ గ్రంథం దర్శింపచేసింది.

కె.వి.రమణారెడ్డి సంకలనం చేసిన 'ఉన్నవ రచనలు కొన్ని' (1979) 222 పుటల గ్రంథం. మాలపల్లికి సంబంధం లేకపోయినా ఆయన కలం నుంచి వెలుగు చూసిన రచనల గురించి చెప్పే క్రమంలో మాలపల్లి ప్రస్తావన జరిగింది. ఉ న్నవ రాసిన నాటకాలు, కవిత్వం, వ్యాసాలు వంటి వాటితో పాటు ఆయన జీవిత కాలంలో సాగించిన కార్యక్రమాలను ఈ గ్రంథం పాఠకుల కళ్ళ ముందుంచుతుంది. ఈ గ్రంథానికి 'ఉన్నవ వెలుగు నీడలు' అనే శీర్షికతో ముందుమాట రాసిన కె.వి.రమణారెడ్డి ఉన్నవ వారి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని గురించి విమర్శనాత్మకమైన చర్చ చేశారు. ఉన్నవ ... కందుకూరి లాంటి వారి ప్రభావంతో మొదట సంఘ సంస్కరణ వైపు ప్రయాణించి ఆ తరువాత సాహితీవేత్తగా మారాడని తెలియజేశాడు. 'గ్రామ్యాన్ని వాడకపోయినా పాత్రోచిత భాషా నియమాన్ని పాటించకపోయినా, శైలిలో ఒడిదుడుకులు ఉన్నా మాలపల్లి ఒక్కటే ఏ విషయంలోనూ కన్యాశుల్కంతో సమ ఉజ్జీ' అని సమర్థించాడు.

అనుమాండ్ల భూమయ్య 'మాలపల్లి అభ్యుదయ మహా కావ్యం' (1992) గ్రంథం అభ్యుదయ గీతాలు రెండు, చరమ గీతం ఒకటి, సమతాధర్మం రెండు అనే అధ్యాయాలతో సాగిన విమర్శ గ్రంథం. మాలపల్లి నవల అయినప్పటికీ ముందుమాట రాసిన కాశీనాథుని నాగేశ్వరరావు కావ్యమని కితాబివ్వడం వల్ల ఈ గ్రంథానికి అలాంటి శీర్షిక పెట్టానని ముందుమాటలో చెప్పారు. ఈ విమర్శ గ్రంథం మాలపల్లి నవలలోని రెండు గీతాల్లోని లోతైన విషయాలను చర్చించింది. చరమగీతం, సమతాధర్మం అనే రెండు గీతాల ఆధారంగా, వాటిని రాసిన తొలి అభ్యుదయ కవిగా ఉన్నవను గుర్తించాడు. శ్రీశ్రీ కవిత్వం లోని కొన్ని ఉదాహరణలను తీసుకొని సమతా ధర్మంలోని భావాలతో పోల్చి చూపించాడు. శ్రీశ్రీ వాడిన 'చీనాలో రిక్షావాలా' వంటి కవితా వాక్యాలు ఎన్నో సంవత్సరాల ముందు ఉన్నవ 'పనివాళ్లందరూ ఏకమైతిరా/ ప్రపంచమే మీది' అని వాక్యం రాశాడని తెలియజేశాడు. అభ్యుదయ కవిత్వానికి విమర్శకులందరూ చెప్పిన వాక్యాలన్నీ సమతాధర్మం గీతంలో ఉన్నాయని తెలియజేశాడు. అయితే మాలపల్లి పుట్టిన ప్రాంతంలోనే 70 ఏళ్ళ తర్వాత చుండూరు లాంటి సంఘట నలు జరగడాన్ని విమర్శకుడు గుర్తుచేశాడు. అప్పటినుండి ఇప్పటిదాకా ఇరు వర్గాల మధ్య సామాజిక అంతరాలు నడుస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అంపశయ్య నవీన్ ఈ పుస్తకంపై తర్వాత లోతైన విమర్శ వాస్యం రాశారు. మాలపల్లి అభ్యుదయ కావ్యం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

'మాలపల్లి – విమర్శనాత్మక పరిశీలన' (1990) అనే పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథాన్ని సముద్రాల కృష్ణమాచార్య రూపొందించారు. ఈ గ్రంథం అయిదు అధ్యాయాలతో, రెండు అనుబంధాలతో సాగింది. 'మాలపల్లి – పూర్వరంగం', 'మాలపల్లి – ఐతిహాసికత', 'మాలపల్లి – అచలం', 'మాలపల్లి – గాంధీ ప్రభావం', 'మాలపల్లి – భాషాసాహిత్యోదమాలు' అధ్యాయాలుగా చర్చించారు. ఇది మాలపల్లిపై అప్పటికే వచ్చిన పరిశోధన గ్రంథాల కంటే భిన్నంగా ఆవిష్కరించే ప్రయత్నం చేసింది. మాలపల్లి తొలి ఆధునిక ఇతిహాసంగా పరిశోధకుడు నిర్ధారించాడు. అందుకోసం ఇతిహాస లక్షణాలను చెప్పి 'మాలపల్లి' ఏ విధంగా అలాంటి లక్షణాలను చెప్పి 'మాలపల్లి' ఏ విధంగా అలాంటి లక్షణాలను కలిగి ఉందో ఉదాహరణ పూర్వకంగా తెలియజేశారు. మాలపల్లిలోని భిన్న పాత్రల మధ్య జరిగిన సంఘర్షణలను కూడా పరిశోధకుడు లోతుగానే చర్చించారు. ఆంధ్రదేశంలో అచలమత్వాన్ని వ్యాప్తి చేసిన

శ్రీమద్రామదగు శివరామ దీక్షితులు ప్రభావం ఆనాటి అనేక మందిపై ఉందని ఆయన ఆధారం చేసుకున్న వీరబ్రహ్మం వంటి వారి అచల సిద్ధాంతం మాలపల్లిలో ఎక్కడ కనిపిస్తుందో పరిశోధకుడు వివరించారు. మాలపల్లిలోని రామదాసు కుటుంబం వారు మూడు తరాలుగా అచల బోధనను అనువర్తిస్తున్నారనే విషయాన్ని పరిశోధకుడు తెలియజేశారు.

మాలపల్లి నవలను ఇతర భాషా నవలలతో పోలుస్తూ వచ్చిన గ్రంథాలు కూడా ఉన్నాయి. హిందీ గోదాన్, తెలుగులో వచ్చిన కూలిగింజలు, వేయిపడగలు, రక్తనది వంటి నవలలతో సాగిన తులనాత్మక అధ్యయనంలోనూ మాలపల్లి నవలపై మరికొంత చర్చ సాగింది. అయితే తులనాత్మక పరిశీలనల దృష్టి వేరు. రెండింటి మధ్య ఉన్న సామ్యాలు, భేదాలు వంటి వాటికే అవి పరిమితమవుతాయి. ఇది కూడా మాలపల్లి సాహిత్య విమర్శలో భాగంగానే మనం అర్థం చేసుకోవాలి.

**2. పరిశోధనల్లో మాలపల్లిని చర్చించిన గ్రంథాలు :**

ఒక సమస్యను జాతీయ ఉద్యమాన్ని సామాజిక విషయాలను సాహిత్యం గ్రంథస్థం చేసినపుడు వాటిపై సాగే ప్రతి విమర్శా ఆయా గ్రంథాలను ఉటంకిస్తూ ఉంటుంది. సమకాలీన సమాజాన్ని ప్రతిబింబింపజేసిన మాలపల్లి లాంటి గ్రంథం ఎన్నో విమర్శ గ్రంథాల్లో చోటు సంపాదించుకుంది. మాలపల్లి నవలలో చర్చించబడ్డ అనేక కోణాలను విమర్శకులు తమ గ్రంథాల్లో చర్చకు పెట్టారు. ఆ దృష్టితో చూసినపుడు ఈ గ్రంథాల్లో మాలపల్లికి సంబంధించిన విమర్శ కనిపిస్తుంది. 1. తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం : వి. సంజీవమ్మ. 2. తెలుగు నవల అస్పృశ్యతా సమస్య : ననుమాసస్వామి, 3. సాహిత్యంలో దృక్పథాలు : ఆర్.ఎస్.సుదర్శనం, 4. తెలుగు నవల వికాసం : మొదలి నాగభూషణ శర్మ, 5. ఆంధ్ర నవలా పరిణామం : బొడ్డుపాటి వెంకట కుటుంబరావు, 6. తెలుగు నవల సాహిత్య వికాసం : పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు, 7. నవలాశిల్పం : వల్లంపాటి వెంకట సుబ్బయ్య, 8. తెలుగు నవలానుశీలం : ముదిగొండ సుజాత రెడ్డి, 9. తెలుగు సాంఘిక నవలలు – వాస్తవికత : పి. భవాని. 10. గాంధీజీ ప్రభావం – సమకాలీన తెలుగు నవలలు : కె.వి.ఎన్.ఎల్. సీతాకుమారి, 11. మన తెలుగు నవలలు : కడియాల రామమోహన్ రాయ్. 12. మన నవలలు – మన కథానికలు : రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, 13. నూరేళ్ళ తెలుగు నవల : సహవాసి మొదలైనవి.

సంజీవమ్మ రాసిన 'తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం' గ్రంథంలో రెండవ అధ్యాయంలో మాలపల్లి నవలకు సంబంధించిన నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలు చేశారు. స్వాతంత్ర్యోద్యమ ప్రాతిపదిక మీద రాయబడ్డ మాలపల్లి నవలను 'నాటి సామాజిక, రాజకీయ చైతన్యానికి ఉన్నవ శిల్ప ప్రతిమ మాలపల్లి విస్తృతమైన కాన్వాస్‌పై గీచిన యథార్థ చిత్రం' అని మెచ్చుకున్నారు. ఈ నవల రాసే క్రమంలో పాటించిన నిర్మాణాత్మకమైన అంశాలను ఉదాహరణలతో నిరూపించారు. పరిచయంలో తన అభిప్రాయాలను ఆలోచనలను ఏవీ చెప్పకుండా నవల ఆరంభించడం వస్త్వాశ్రయానికి ఉన్నవ కట్టుబడ్డాడని నిర్ణయించింది. ఐర్లాండులో అధ్యయనం చేసిన సామాజిక అంశాలు, ఐరిష్ జాతి ఆలోచనల ప్రభావం ఈ నవల ఇతివృత్తం ఎన్నుకోవడానికి ఉపకరించాయని చెప్పారు. 'యుగయుగాల దోపిడీకి ఉరితాడు వేయాలని ప్రయత్నించిన పాత్రలను సృజించిన మొదటి తెలుగు నవల మాలపల్లి' అని స్పష్టం చేసింది. ఉన్నవ సోషలిస్ట్ కాకపోయినా సంక్షేమ రాజ్యం రావాలని మనసారా కోరుకున్నాడని, అందుకోసం తాను ప్రయత్నిస్తూ తన ఆలోచనలను మాలపల్లిలోని వాక్యాల రూపంలో వివరించాడని తెలియ జేసింది. ఉన్నవ వారు నవలలో ఉపయోగించిన ధర్మకన్నాలు అనే పదం పైన లోతైన చర్చ చేసింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో సంతాలి గిరిజనులు చేసిన తిరుగుబాటును తెలుసుకున్న ఉన్నవ దానిని తన నవలలో సంతానులు పదప్రయోగం ద్వారా సార్థకం చేశాడని తెలియజేసింది.

'తెలుగు నవల – అస్పృశ్యత సమస్య' సిద్ధాంత గ్రంథంలో ననుస్వామి మాలపల్లి గురించి కొంత చర్చ చేశాడు. హేళావతి, మాతృమందిరం తర్వాత మాలపల్లి అస్పృశ్యతా సమస్యను లోతుగా చర్చించిందని తెలిపాడు. అయితే 'అంటరానితనంతో విసిగిపోయే పంచములను మతాంతరులని చేయాలని చూపిన క్రైస్తవ మిషనరీలను ప్రోత్సహించింది. అస్పృశ్యత సమస్య అంటూ వివాదాత్మకమైన వ్యాఖ్య చేశారు. మాలపల్లిలో రామదాసు వంటి బాధలు పడ్డ దళిత పాత్రను హిందూత్వ ప్రతినిధిగా ఉన్నవ చిత్రించడం ఇటీవల కాలంలో విమర్శకు గురైంది. క్రైస్తవ మిషనరీలను అస్పృశ్యత ప్రోత్సహించలేదు. అస్పృశ్యత అగ్నిగుండంలో మాడిపోతున్న అనేక మంది అభాగ్యులను ఆదరించి పట్టెడన్నం పెట్టి ఆత్మస్థైర్యాన్ని నింపిన క్రైస్తవ మిషనరీలు మాలపల్లి నవలలో కనిపించిన అస్పృశ్యత ను రకరకాల సంఘటనల ద్వారా ననుమాస స్వామి వివరించే ప్రయత్నం చేశాడు. ఉన్నత వర్గాల వారి పొలంగట్టుపై నడిచినందుకు దెబ్బలు తిని మరణించిన మాల రామదాసు చెల్లెలు సుబ్బలక్ష్మిని గుర్తుచేశాడు. మంగళాపురంలోని గుడిలోకి పంచములను రానివ్వరనే విషయాన్ని సంభాషణలను ఉదహరిస్తూ అస్పృశ్యత ఎలా ఉందో తెలియపరిచాడు.

రామానాయుడు సంగదాసుతో కలసి రైల్వేస్టేషన్‌లో భోజనం చేయడాన్ని ఊరి మునసబు విమర్శించడం వెనుక అస్పృశ్యత కోణాన్ని కళ్ళ ముందుంచాడు. తక్కళ్ళ జగ్గడి పాత్రను చిత్రించడంలో అల్లూరి సీతారామరాజు ప్రభావం ఉందని పరిశోధకుడు ఊహించాడు.

ఆర్.ఎస్.సుదర్శనం 'సాహిత్యంలో దృక్పథాలు' పదిమంది తెలుగు సాహితీకారుల అంచనా వేసిన గ్రంథాలు అల్లసాని పెద్దన నుంచి నోరి నరసింహ శాస్త్రి దాకా వారి రచనల ఆధారంగా వారి వారి దృక్పథం అంచనా వేయబడింది. మాలపల్లి కాల్పనికోద్యమ సమయంలో వచ్చిన దాని ప్రభావం నవలపై పడలేదని తెలియజేశాడు. 'మాలపల్లి నవలలో పీడిత వర్గం వారి చరిత్ర సమాజంలోని బాధ, ఆర్తి, దురన్యాయం చిత్రించబడిన దాని అభ్యుదయ రచనగా ఒక ముద్ర వేయడానికి వీళ్ళేదు' అని నిక్కచ్చిగా చెప్పాడు. 'వ్యక్తికి సమాజానికి గల సంబంధాన్ని అవగాహన చేసుకొని నిత్య నూతనమైన జీవన స్వరూపాన్ని ఆశించిన మానవ సమాజ పరిణామానికి తగినట్టుగా, తీర్చిదిద్దే దృక్పథం మాలపల్లి నవలలో కనిపిస్తుంది. గాంధీ గారి దృక్పథానికి దర్పణమే మాలపల్లి నవల' అని నవలలో అంత:స్సూత్రాన్ని వివరించాడు. అంతేకాదు; వేయిపడగలకు, మాలపల్లికి ఉన్న మౌలిక మైన తేడాను కూడా తెలియజేశాడు. మాలపల్లిది ముందు చూపని, వేయిపడగలది వెనక చూపని తేల్చాడు. 'స్వాతంత్ర్యం ఒకరు ఇచ్చేది, మరొకరు పుచ్చుకొనేది ఎలా కాదో, అలాగే మానవునికి ఆత్మ విశ్వాసము, ఆత్మోద్ధరణ ఒకరు ప్రసాదించగా లభించేవి కాదు. ఇది ఉన్నవ వారు ఆకలించుకొని మాలపల్లిలో చిత్రించిన గొప్ప రహస్యం' అని సుదర్శనం గారు లోతైన సాహిత్య చర్చ చేశారు.

తెలుగు నవలా సాహిత్యంపై సైద్ధాంతికమైన గ్రంథాలు రాసిన బొట్టుపాటి వారు, నాగభూషణశర్మ గారు, వల్లంపాటి వారు తెలుగు నవలా సాహిత్యపు సముద్రాన్ని మధించే ప్రయత్నంలో భాగంగా మాలపల్లిపై దృష్టి కేంద్రీకరించారు. 'నాగరిక ప్రపంచం గొడ్డుపోయినట్లుగా నిందు చిత్రించబడినవి జానపద జగత్తు. ధనవిద్యాకుల సంపదలతో తులతూగువారు ఎందరో ఉండగా ఇందు వర్ణింపబడిన ప్రధాన పాత్రలు సంఘజఘన్యజ వర్గముని చూసుకొని యింత తెగించిన నవల ప్రథమ ప్రయత్నమిదియే' అని మాలపల్లి నవలను గురించి బొడ్డుపాటి వ్యాఖ్యానించారు (ఆంధ్ర నవలా పరిణామం - పుట 279). మొదలి నాగభూషణశర్మ తన గ్రంథంలో ఈ నవల దిగువ కులాలవారు ఆధ్యాత్మికతపై రామదాసు, మేధాసంపత్తికి సంగదాసు చిత్రించబడ్డారు. రామదాసు భక్తితత్వం, సంగదాసు రామానాయుడుల ప్రేమతత్వం, వెంకటదాసు (జగ్గడు) వీరతత్వం కలిస్తేగాని విముక్తి లభించదని సూచించబడింది. (తెలుగు నవలా వికాసం - పుటలు 159-162) అని చెప్పడంలో మాలపల్లిలోని ప్రతి పాత్రతత్వం కనిపిస్తుంది. నవలాశిల్పాన్ని గురించి మాట్లాడిన వల్లంపాటి వారు ఉన్నవ వారిది నైతికదృష్టి మాత్రమే కాదని, సామాజిక, రాజకీయ దృష్టి కూడా ఉందని తెలిపారు. 'ఉన్నవలో ఎంత వాస్తవికత ఉందో అంత ఫాంటసీ కూడా ఉంది. 1920 నాటికి ఆంధ్రదేశంలో కార్మికోద్యమం, రైతుకూలీ ఉద్యమం లేకున్నా వాటిని ఊహించాడు. ఆ తరువాత దాదాపు 27 ఏండ్లకు వచ్చిన స్వాతంత్ర్యాన్ని కూడా లారెన్స్ చెప్పిన 'One bright book of life' అన్న అభివర్ణనకు మాలపల్లిలాగా సరిపోయే నవల మరొకటి లేదు' అని వివరించాడు.

పి.భవాని 'తెలుగు సాంఘిక నవలలు - వాస్తవికత' అనే పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథంలోని ఏడవ అధ్యాయంలో మాలపల్లిలో దాగిన వాస్తవికతను అంచనా వేశారు. ఈ నవల వచ్చేనాటికి ఆంధ్రప్రాంతంలో పరిశ్రమలు అంత ఎక్కువగా అభివృద్ధి చెందకపోయినప్పటికీ భూస్వాముల వల్ల రైతుకూలీలు దోపిడికి గురౌతున్నారనే సత్యాన్ని మాలపల్లి నవలలో ఉన్నవ చిత్రించారని అభిప్రాయపడ్డారు. సహవాసి రాసిన 'నూరేళ్ళ నవల' గ్రంథంలో 25 నవలల విశ్లేషణలున్నాయి. అందులో ఆయన ఎంచుకొన్న రెండవ నవల మాలపల్లి. నవలలోని అనేక కథా సన్నివేశాలను వ్యాఖ్యానిస్తూ మాలపల్లిలోని శిల్పానికి ఒక నిపాత సూత్రాన్ని ఆపాదించాడు. 'నవలగా మాలపల్లిలోని శిల్పానికి సంబంధించిన విమర్శలు వచ్చాయి. బరువైన వేదాంత చర్చలు, ఉపన్యాసాలు పాఠకులకు కొంత విసుగు కలిగించే మాట నిజం. కానీ 1922 నాటికి తెలుగు నవలా శిల్పం శైశవ దశలో తప్పటడుగులు వేస్తున్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి' అనడంలో ఉన్నవవారి శిల్పాన్ని పెద్ద మనసుతో అంగీకరించడమే!

కె.వి.ఎన్.ఎల్. సీతాకుమారి 'గాంధీ ప్రభావం - సమకాలీన తెలుగు నవలలు' అనే పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథంలోని ఆరు అధ్యాయాల్లో మాలపల్లి గురించి విస్తృత చర్చ జరిపారు. గాంధీజీ ప్రభావం వల్లనే వేలూరు శివరామశాస్త్రి 'ఓబయ్య' మొదటగా చర్చించి, రెండవ నవలగా 'మాలపల్లి' అని నిర్ధారించారు. మాలపల్లి నవలపై ప్రస్తావించిన సహాయ నిరాకరణోద్యమం, పుల్లరి సత్యాగ్రహం ఫలితంగా ఉద్యమకారులు జైళ్ళకు వెళ్ళిన పరిస్థితులు నవల్లో కన్పించడం గాంధీ ప్రభావమేనని అభిప్రాయపడ్డారు. రాజ్యాధికారం అనేది సమాజంలోని వివిధ భాగాల మధ్య సమన్వయం కుదర్చడానికి మాత్రమే పరిమిత మవుతుంది. తక్కెళ్ళ జగ్గడు చెప్పినట్లు 'నా ధర్మం జనులు

అవలంబిస్తే ప్రతివాళ్ళు యథాశక్తి పాటుపడి అవసరమైనంత తింటారు' దీన్ని మార్క్స్ పరిభాషలో From each According to his ebility and to each Accordaing to his needs అంటారు. ఈ విధంగా మార్క్స్ సిద్ధాంతంలోని హింసను తీసివేస్తే గాంధీ సిద్ధాంతం వస్తుంది. ఇదే మాలపల్లిలో ప్రతిబింబిస్తుంది అని సీతాకుమారి ప్రతిపాదించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన 'మన నవలలు – మన కథానికలు' గ్రంథంలో రాచపాళెం గారు ఆరవ అంశంగా మాలపల్లి నవలా వైశిష్ట్యాన్ని తెలియజేశారు. 'మాలపల్లిని మునిపల్లెగా చిత్రించడంలో గాంధీభావంలోని హిందూత్వ ప్రభావం చూపిన మాట వాస్తవమే. అనేక పరిమితులతో కూడిన గాంధీ ఉద్యమ ఫలితాలను ఇప్పుడు భారతదేశం అనుభవిస్తూనే ఉంది' అనడంలో లోతైన ఆవేదన దాగివుంది. రచయిత అయిన ఉన్నవకు విశ్వాసమున్న భావ జాలం ఒకటి ఉన్నా దానికి భిన్నమైన వర్తమాన భావజాలం కూడా నిజాయితీగా చిత్రించగలడం మాలపల్లి నవల విశిష్టత అని తెలియజేశారు. 'గాంధీయిజం, అంబేద్కరిజం, మార్క్సిజం అనే మూడు ప్రధాన ఆలోచన విధానాలు ఇవాళ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ మూడు వాదాల ప్రభావాలు, ఛాయలు, ప్రస్తావనలు మాలపల్లిలో కనిపిస్తున్నాయి' అంటూ మాలపల్లిలో అంతర్లీనంగా ఉన్న దృక్పథాలను అంచనా వేశారు. మాలపల్లి వ్యావహారిక భాషలో రాయబడిన తొలి నవల అని, రచన స్థలకాలాలకు, రచనలోని జీవితానికి, అందులో భాగమైన భాషకు చక్కని సమన్వయం కుదిరిందని రాచపాళెం నిర్ధారించారు. ప్రతి రచయితకు సామాజిక స్వప్నం ఉంటుందని, ఉన్నవ వారి స్పష్టమైన గాంధీజీ నాయకత్వంలో దేశానికి స్వాతంత్ర్యం రావాలనే ఆకాంక్ష తరువాత కాలంలో నెరవేరిందనీ, అయితే రచయిత కలగన్న ఆదర్శరాజ్యం మాత్రం రూపొందకపోవడం అర్థం చేసుకోవాలని విమర్శకుడు సూటిగా తెలియజేశాడు.

ఈ విధంగా నవలా సాహిత్యాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని సాగిన 'మాలపల్లి' ప్రధానమైన స్థానాన్ని పొంది విమర్శకు అవకాశం ఇచ్చింది. మాలపల్లిలో ఉన్న బహుముఖీన కోణాలు ఒక్కో గ్రంథంలో వివిధ అధ్యాయాల రూపంలో చర్చించి మాలపల్లి నవలపై విమర్శకు ఒక పరిపూర్ణరూపాన్ని అందించగలిగాయి.

**3. విమర్శ వ్యాసాలు :** మాలపల్లి నవలపై ఆనాడు భారతి పత్రిక నుండి నేటి సాహిత్య పత్రికల వరకు అనేక వ్యాసాలు వచ్చాయి. అనేక సదస్సుల్లో చర్చలు జరిగాయి. ఈ వ్యాసాలన్నింటిని క్రోడీకరించి చర్చించడం ఒక ప్రత్యేక పరిశోధన అవుతుంది. ఈ వ్యాసాల్లో ముఖ్యమైన ప్రతిపాదనలు చేసిన వాటి గురించి మాత్రం చర్చించాల్సిన అవసరం ఉంది.

1. మాలపల్లి నిర్మాత ఉన్నవ లక్ష్మీనారాయణ గారు
   : శ్రీనివాస శిరోమణి (1945–భారతి)
2. మాలపల్లి : గద్దె లింగయ్య (1939–భారతి)
3. మారుతున్న కాలం–మాలపల్లి : రామ్మోహన్ రాయ్ (1972–భారతి)
4. మాలపల్లి తెలుగు విప్లవ సాహిత్యంలో వచ్చిన ప్రథమ మహాకావ్యం
   : శేషేంద్ర శర్మ (1984–ఆంధ్రప్రభ)
5. సంఘ సంస్కర్త ఉన్నవ : జి. వెంకట సుబ్బయ్య (1977–ఆంధ్రపత్రిక)
6. నవ్యాంధ్ర సాహిత్య నిర్మాతఉన్నవ : కపిల వెంకటరావు
7. ఉన్నవ జీవిత చరిత్ర : చిరకాల మిత్రుడు (1922–ఆంధ్రపత్రిక)
8. ఉద్యమ మిత్రుడు ఉన్నవ : పి.వి సుబ్బారావు
9. ఉన్నవ మాలపల్లి : తుమ్మల రామకృష్ణ
10. మాలపల్లి అభ్యుదయ కావ్యమేనా?
    : అంపశయ్య నవీన్ (2016 సాహిత్య ప్రస్థానం)
11. నూరేళ్ళ మాలపల్లి : రాచపాళెం (2021 నవంబర్ ఆంధ్రజ్యోతి)
12. ఈ శతాబ్దం తెలుగు నవల
    : కాత్యాయనీ విద్మహే (2001 ఆగస్టు గ్రంథాలయ సర్వస్వం)
13. మాలపల్లె కాదు, మునిపల్లె : జయప్రభ
14. మాలపల్లిలో మాండలిక పదాలు : మద్దూరి సుబ్బారెడ్డి

మాలపల్లి పై వచ్చిన తొలి దశలో వ్యాసాలు అంటే గద్దె లింగయ్య, వెంకట సుబ్బయ్య లాంటి వారు రాసిన వ్యాసాలు మాలపల్లి నవలపై తక్కువ దృష్టిని చూపాయి. రచయితగా ఉన్నవ జీవితం, జాతీయోద్యమ పోరాటం వంటి విషయాలకు ప్రాధాన్యమిచ్చాయి. వెంకటసుబ్బయ్య అంతకుముందు పరిశోధకులు ఉన్నవ పుట్టిన తేదీని తప్పుగా నిర్ధారించారని, 1877 డిసెంబర్ 4న వారు జన్మించారని ఆధారాలతో 'సంఘ సంస్కర్త ఉన్నవ' అనే వ్యాసంలో నిరూపించారు. శ్రీనివాస శిరోమణి రాసిన వ్యాసంలో పంతులు గారి రూపం, సభా నిర్వహణ వంటి విషయాలను వివరించారు. రాయవేలూరు జైలు నుండి బయటపడ్డాక మీసాలు తీసివేయడం వంటి మార్పులు ఆయన ఆహార్యంలో కన్పించాయని చెప్పుకొచ్చారు. ఉన్నవ 45 ఏళ్ల వయసులో అద్భుతమైన నవల రాశాడని, అంతవరకు రాజకీయ నాయకుడిగానే గుర్తించిన సమాజం మాలపల్లి రాకతో ఆశ్చర్యపోయిందని చెప్పాడు.

రామ్మోహన్‌రాయ్ రాసిన వ్యాసంలో మన నవలల్లో పల్లెటూరును నేపథ్యంగా చేసుకొని రాసినవి చాలా తక్కువని, మాలపల్లి మాత్రం పరిపూర్ణ పల్లెటూరిని కేంద్రంగా చేసుకొని వచ్చిందని తెలిపారు. నవలల్లో ఉన్న కొన్ని లోపాలను కూడా నిర్మొహమాటంగా చెప్పారు. నవలకు బరువనిపించే వేదాంత చర్చలకూ, ఉపన్యాసాలకూ ఎక్కువ చోటిచ్చి కొన్నిచోట్ల

శిల్పానికి భంగం కలిగించారని, దీనివల్ల సామాజిక ప్రయోజనం వెనుకబడి రచయిత అంతర్ముఖులై మరో మంచి లోకాన్ని అన్వేషిస్తున్నట్లు కనిపిస్తుందని అన్నారు. నవలలో తక్కెళ్ళ జగ్గడు ఉరఫ్ వెంకటదాసైతే కృతయుగ ధర్మాన్ని కోరడు. ఉన్నవ వారిలోని గాంధీయవాది యీ మాటల్ని వ్రాసినట్లును కోవాలి గానీ వెంకటదాసు అనుచరుల మాటలను పలికినట్టునుకోలేం' (భారతి – 1972) అని తన అభిప్రాయాన్ని చెప్పారు. జగ్గడు కోర్టులో ఇచ్చిన వాంగ్మూలం మాక్సిమ్ గోర్కి 'అమ్మ' నవలలో పావెల్ వాంగ్మూలాన్ని గుర్తు చేస్తుందని వ్యాఖ్యానించారు. 'ఉన్నవ వారు అహింసా మార్గాన్ని అవలంబించినా నవలలో మాత్రం సంగదాసు, రామదాసు నడిచిన అహింసా మార్గమూ, వెంకటదాసు నడిచిన హింసామార్గమూ రెండూ కూడా మంచివేనని నిపుణంగా చిత్రించారు' అన్నారు.

శేషేంద్ర మాలపల్లి కావ్యం గురించి చెబుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం ప్రసక్తి తీసుకు వచ్చారు. సందర్భం కాకపోయినా కవిత్వంతో కూడిన మహాప్రస్థానాన్ని, నవల అయిన మాలపల్లిని తులనాత్మకంగా చర్చించాడు. విప్లవ చేతనలో కళాత్మక గుణంలో మాలపల్లి మహాప్రస్థానం కంటే ఎన్నో మరుగులు బరువైన రచన' అనడంలో, మహాప్రస్థానాన్ని గొప్ప కావ్యంగా సమర్థించే వారని మూకలు అనడంలో వారికి శ్రీశ్రీ అన్నా, ఆయన గ్రంథమన్నా ఎంత కోపమో అర్థమవుతుంది.

'రెండు ఉద్యమాల మిత్రుడు' వ్యాసంలో సుబ్బారావు కూడా 'మాలపల్లి' చదువు ఉద్యోగం గురించి చెప్పుకుంటూ వచ్చి గాంధీ నిమ్నవర్గాల గురించి మాట్లాడకముందే ఉన్నవ మాట్లాడారని తెలియజేశారు. అంపశయ్య నవీన్ రాసిన వ్యాసం అనుమాండ్ల భూమయ్య 'మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం' గ్రంథాన్ని తూర్పార పట్టింది. భూమయ్య చేసిన ప్రయత్నాన్ని ఉదాహరణలతో ఖండించారు. మాలపల్లి కావ్యం కాకపోయినప్పటికీ అందులో ఉన్న రెండు గీతల కారణంగా దాన్ని కావ్యంగా ధ్రువీకరించే ప్రయత్నం తేలిపోయిందని చెప్పుకొచ్చారు. 'నవలాకారుడి దృక్పథం ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి తప్ప కొన్ని పాత్రలు వెలిబుచ్చిన అభిప్రాయాలతోనే రచయిత దృష్టి ఇది అని నిర్ణయించకూడదు' అని ప్రతిపాదించారు.

'నూరేళ్ళ మాలపల్లి' వ్యాసం తాజాగా రాచపాళెం వారు రాసింది. గాంధేయ, మార్క్సియ మార్గాలను నిజాయితీగా చిత్రించిన నవల ఇదేనని, బహుశా భారతీయ భాషల్లో గాంధీని సాహిత్యంలో పాత్రగా చేసిన తొలి రచయిత ఉన్నవేనని అభిప్రాయపడ్డారు. 'బొల్షివిక్ విప్లవం ద్వారా రష్యాలో వచ్చిన సమ సమాజం భారతదేశంలో ఏర్పడాలని, అయితే అది విప్లవ మార్గంలో గాక గాంధేయ మార్గంలో రావాలని ఆయన కోరుకున్నారు. అందుకే రామదాసు పాత్రను నవల చివరిదాకా కొనసాగించాడు ఉన్నవ' అని సరైన అంచనా వేశారు. అయితే వంద సంవత్సరాలైన రామదాసు పాత్ర ద్వారా ఉన్నవ వారు కనిన కలలు నెరవేరలేదని కారంచేడు, చుండూరు, వ్యాపిలి, వేంపెంటలలో దళితుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

శేషేంద్రశర్మ గారి వ్యాసానికి ప్రతిగా జయప్రభ రాసిన వ్యాసంలో.. ఉన్నవ వర్ణించింది మాలపల్లిని కాదు, మునిపల్లెను అంటూ చేసిన వ్యాఖ్య సమంజసంగానే అనిపిస్తుంది. ఆకలి మీద, జీవితాల మీద, గుడిలో దేవుడి మీద, తాగే నీటి మీద అగ్రవర్ణాలు పెత్తనం సాగిస్తున్నప్పటికీ పద్యకావ్యాలు చదువుకుంటూ ఆధ్యాత్మిక వచనాలు మాట్లాడే రామదాసు కుటుంబం ముని ఆవాసంగానే కనిపిస్తుంది. మద్దూరి సుబ్బారెడ్డి రాసిన 'మాలపల్లిలో మాండలిక పదాలు' వ్యాసంలో ఆనాటి వాడుక భాషకు దగ్గరగా రాయబడ్డ మాలపల్లిలో గుంటూరు జిల్లాలో వాడబడే 116 మాండలిక పదాలను ఏరి వివరించారు. ప్రతి పదానికి విపులమైన అర్థాన్ని చెప్పారు. ఆ ప్రాంతపు పలుకబడులను కూడా శ్రద్ధగా ఏరి ఈ వ్యాసంలో విశ్లేషించారు.

**4. సాహిత్య చరిత్రలు, ఇతరాలు :**

తెలుగు సాహిత్య చరిత్రను తెలిపే అన్ని గ్రంథాల్లో మాలపల్లి ప్రస్తావన ఉంది. వీరేశలింగం ఆంధ్రకవుల చరిత్ర తప్ప 1920 తరువాత వచ్చిన సాహిత్య చరిత్రలన్నీ ఈ నవల గురించి మాట్లాడాయి. ముఖ్యంగా ఆరుద్ర వంటివారు మాలపల్లి గురించి లోతైన చర్చచేశారు. మాలపల్లి నవలను గోపీచంద్ 1962లోనే నాటకంగా మార్చాడు. మందలవర్తి ఉపేంద్రశర్మ ఉన్నవ జీవితచరిత్రను 'లక్ష్మీనారాయణీయం' అనే పేరుతో 1974లో రాశారు. 'గుంటూరు జిల్లా స్వరాజ్య చరిత్ర' గ్రంథాన్ని రాసిన మాదలి వీరభద్రరావు ఉన్నవ లక్ష్మీనారాయణరావు గారికి తగిన స్థానాన్ని కల్పించాడు.

ఈ విధంగా ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి'ని కేంద్రంగా చేసుకొని వచ్చిన విమర్శలన్నీ మాలపల్లి దృష్టి సారించిన అనేక కోణాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశాయి. మాలపల్లెను అర్థం చేసుకోవడంలో సఫలతలను, విఫలతలను చర్చించాయి. 'మాలపల్లి' నవల దృక్పథంపై వచ్చిన వాద వివాదాలు లోతైన చర్చకు అవకాశం ఇచ్చాయి. ఇవి విమర్శ కోవకు చెందిన వ్యాసాలు అయినప్పటికీ మాలపల్లిలో ప్రతి వాక్యాన్ని కూడా పాఠకులకు అర్థమయ్యేలా చెప్పగలిగాయి. ■

కవిత

# ఉగాది ముంగిట ...

- పాపినేని శివశంకర్

ప్లవమో విప్లవమో
శుభకృతో విరోధకృతో
దేన్నీ ఆహ్వానించలేని ఆస్వాదించలేని
అరుచికర పరిస్థితి
జ్వరపడ్డ రోగిలాగా ఏదీ సయించదు
అది తీపి గాని పులుపు గాని
షడ్రుచుల సమ్మేళనం గాని –
కాలం గడ్డ కట్టినట్టు
కాలి అడుగు నేలకి అతుక్కుపోయినట్టు
చలనం లేని చైతన్యం లేని దశ
ఈ రాత్రులు ఎంతకీ అంతం కావు
చంద్రుడు పొగచూరిపోయాడు
చైత్ర చైతన్య సమీరం వీచని చీకటి మునివాకిట్లో
గబ్బిలాల గంధర్వగానం
ఏది ఆస్వాదించాలి
ఎన్ని కన్నీటి చుక్కల్ని ఎన్ని యుద్ధ మృత దేహాల్ని
ఇలా ప్రతిరోజూ లెక్కించాలి
భూగోళం బుగ్గ మీద
ఈ వేడి తడిచారికలు ఎప్పటికి ఆరిపోతాయి
సింగారం లేదు
శృంగార వనవిహారం లేదు
'ఏకో రసః కరుణ ఏవ' అన్నాడు గానీ భవభూతి
ఇప్పుడంతటా ఏకైక భయానక రసమే!


పొంగి పొర్లుతూ –
ఏ స్నేహాన్నీ సమీపించని
ఏ ఆత్మీయతనీ ఆలింగనం చేసుకోలేని
నిస్సహాయత
సవ్వడి లేని పలకరింపులు
నవ్వులకు వీడ్కోలు చెప్పిన ముఖాలు
అంతా ఒక అనిశ్చితిలో అశాంతి



నిస్సహాయతలో నిరీక్షణ
లోకం ఇప్పుడొక 'వీపింగ్ విల్లో' ట్రీ
చుట్టూ అసంఖ్యాక శత్రువులు మోహరించిన
ఛద్మ పద్మవ్యూహం
ఛేదించే శస్త్రధారిణి కోసం
పడిగాపులు గాస్తూ –
దిగంతాల రెపరెపలాడే ప్రశాంత కేతనం కోసం
నేనీ పూట ఈ మామిడి చెట్టెక్కి
ఎదురు చూస్తూ
ఎదురు చూస్తూ ...

■

## నచ్చిన పుస్తకం






# సంయమనంతో సాగిపోయే అడిగోపుల కవిత్వం


- దాస్యం సేనాధిపతి

94405 25544


***"మంచి కవిత్వానిది/ ఒక పార్శ్వం కాదు***
***ముందు వెనుక/ కుడి, ఎడమ***
***వివిధ కోణాలు/ వజ్రంలా ఎటుచూసినా/***
***రంగులే .../ రంగుల అనుశాసనలే'*** అని భావించే సీనియర్ కవి అడిగోపుల వెంకటరత్నమ్ గత నాలుగు దశాబ్దాలకు పైగా కవిగా తమ సృజనను చాటుతూ బహు గ్రంథకర్తగా భాసిల్లుతున్నారు. 'సూర్యోదయం' నుండి 'జయభేరి' వరకు ఇరవై ఆరు గ్రంథాలను ప్రకటించి.. సాహితీ లోకంలో నిబద్ధత గల కవిగా, కథా రచయితగా తమకంటూ ఓ స్థానాన్ని పదిలపరచుకున్నారు. ఆయన కవిత్వంలో అభ్యుదయ భావాలు, ప్రగతిశీల ఆలోచనలు, సామాజిక చైతన్య చింతనలు, మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న తపనను అడుగడుగునా చూస్తాం. పరిణత కవిత్వాన్ని అందించడంలో అడిగోపుల అగ్రభాగాన ఉంటారు. సందిగ్ధతకు తావివ్వకుండా.. లోతైన భావాలతో.. గాఢమైన కవిత్వాన్ని రాయడంలో ఆయన దిట్ట. సామాజిక స్పృహయే పరమావధిగా సాగే ఆయన కవిత్వంలో.. సంయమనంతో నర్తించే పదబంధాలు ఆభరణాలై అందరినీ ఆలోచింపజేస్తాయి. ఇట్టే ఆకట్టుకుంటాయి! ప్రస్తుతం తమ ఇరవై ఆరో గ్రంథంగా అడిగోపుల మనకు అందించిన 'జయభేరి' కవితా సంపుటి నిండా ఆయన ఉత్తమ వ్యక్తిత్వాన్ని, సమకాలీన సామాజిక సంఘటనలపై ఆయన స్పందనలు, అవసరమైన చోట పాలకులపై ధిక్కార స్వరాన్ని ప్రకటించడాన్ని గమనిస్తాం. అభ్యంతరం, అసమ్మతి జోడించి ఆశావాహ దృక్పథంతో రాసే ఆయన కవిత్వంలో– ప్రాంతీయ సంఘటనల నుంచి అంతర్జాతీయ ఘటనల వరకు చోటు చేసుకోవడం విశేషం. అసమ్మతి అనివార్యమైన సందర్భాల్లోనూ కవి అడిగోపుల ఆవేశాన్ని అణచుకుని .. భావోద్వేగాలను నియంత్రించుకుని కవిత్వంలో ఓర్పుగా అక్షరాలను కూర్పు చేయగల నేర్పరి.

ఉద్యమం మరణించదని/ ఉద్యమ సిద్ధాంతమూ అంతమొందదని భావించే ఆయన ... అచ్చులు హల్లులు సానబెట్టి... అగ్నిగొంతుకుల అమరికగా అన్ని మనసుల ప్రతిగా గీతం ఎలుగెత్తింపజేసి ఉద్యమానికి... సిద్ధాంతానికి ఊపిరిలూదాలని పిలుపునిచ్చారు. గీతం మరణించదని, ఉద్యమం మరణించదని అభిప్రాయపడే అడిగోపుల ఈ కవితా సంపుటి ద్వారా ఉద్యమకారుడు.. సమూహ ప్రతిరూపమని.. సమస్య పరావర్తనమే ఉద్యమమని తేల్చి చెప్పారు..

'గాయాల్ని గత కాలానికి/ వదిలి పెడితే
మరపు చిట్టాల్లోకి మారిపోతాయని' భావించే ఆయన ... రాజ్యం ఎత్తుగడ ఫలించకుండా ఉండాలంటే.. మండుతున్న గొంతు కొలిమి నుంచి మాటను వేడి చేసి, సాగదీసి ఆయుధంగా మల్చుకోవాలని; కరిగించి అచ్చుపోయాలని ఈ గ్రంథంలోని ఓ కవిత ద్వారా హితవు పలికారు. మనిషి మొన్న భౌతికం... నిన్న నీడ.. నేడు ప్రతిమ... రేపు అడుగుజాడ.. కనుక పూలుపూలుగా వాడిపోకుండా ... పిడికిళ్ళుగా మారాలని సూచించారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో.. పల్లెల్లో మారుతున్న పరిస్థితులను అక్షరాల్లో నిక్షిప్తం చేస్తూ.. బాల్య జ్ఞాపకాలను ఏకరువు పెడుతూ.. 'కొత్త గ్రామ దేవతలు' కవితను తీర్చిదిద్దారు.

శుభాన్ని అశుభాన్ని/ అకృత్యాల్ని అరాచకాల్ని

నిక్షిప్తం చేసుకున్న /ఊరి సూరీడు వీధి దీపం లేదని వాపోయారు. బాల్యం వదిలిన బతుకు ఖాళీల్లో స్మృతులు నిండుతున్నాయని వ్యాఖ్యానించారు. కవి అడిగోపుల గారు 'పుస్తకం సంజీవని' కవితను ఆసక్తికరంగా మలిచారు. పుస్తకం క్రాంతదర్శి– పుస్తకం మార్గదర్శి అంటూ ఎత్తుకున్న తీరు బాగుంది. పుస్తకం ప్రాశస్త్యం చెబుతూనే అడిగోపుల దాంపత్య జీవితాన్ని జోడిస్తూ ప్రకటించిన భావాలు ఈ కవితలో చక్కగా ఒదిగి పోయాయి.

భార్యభర్తలం/ ఇంటినిండా సంపద
ఎడముఖం పెడముఖం
కారణాలుండవు /కథలు కోకొల్లలు
ఒకరు ప్రశ్న ఒకరు జవాబు
ప్రశ్నకు ముగింపు లేదు/ జవాబు సంతృప్తి కాదు
సంతోషం ఎండి దుఃఖం పండిన వేళ
దాంపత్య జీవితం/ గ్రంథాన్ని కంఠస్తం చేశాను!

'ఇల్లంతా పూలతోటైందంటూ' కొనసాగించిన తీరు బాగుంది. 'ఇద్దరం తోట మాలులం... ఎవరికి నచ్చిన పూలను ఆఘ్రాణించి ఆస్వాదిస్తుంటే ఇల్లు బృందావనమైంది' అని చెప్పడం బాగుంది. పుస్తకం యొక్క గొప్పదనాన్ని విభిన్నమైన శైలిలో ప్రకటించి అడిగోపుల తమ కవితా పటిమను చాటుకున్నారు.

మనిషి కోర్కె అశాశ్వతమని, మనిషి కీర్తి శాశ్వతమని భావించే ఆయన కోర్కె అలవిగానిదైతే ఫలితం గీటుదాటుకుందని ఇందలి ఓ కవిత ద్వారా తెలియజెప్పారు.

'నడుస్తున్న చరిత్ర' కవితలో మట్టిని నమ్ముకున్న పాదాల కింద... మట్టి నిర్వీర్యమై మట్టి ఏ మట్టికి ఫిర్యాదు చేసినా .. శూన్యంలో విన్యాసమై మట్టి హృదయం మండుతూందని వాపోయారు.

మతానికో పీఠం వేసి/ మధ్య ఇనుప తెరలు గట్టి
ఏ మతం ప్రతిష్ట దానిదే/ ఏ ప్రబోధసారం దానికేనంటూ
ఒకదానిపై ఒకటిని స్వారీ చేయిస్తే మారణ హోమం

మొదలైందని తెలిపిన తీరు బాగుంది. ఇప్పుడు నేలను దేశమంటే దేశం ఒప్పుకోదని... రాష్ట్రమన్నా రాష్ట్రం ఒప్పుకోదని .. అలాగని మట్టి అంటే అస్సలు మట్టి వొప్పుకోదని తేల్చి చెప్పారు. నడుస్తున్న వాస్తవిక చరిత్రకు ఆయన అద్దం పట్టారు.

'కోర్కెలన్నీ ఒకటి కాదు' కవితలో మానవ జీవన చక్రంలో కోర్కెలన్నీ ఒకటి కాదని తేల్చి చెప్పారు. ఒక కోర్కె భగ్నబాటగా .. ఒక కోర్కె పూలబాటగా .. మనిషి కోర్కె అశాశ్వతం. మనిషి కీర్తి శాశ్వతం అని విడమరచి వివరించారు. 'మనిషి మారిపోయాడు' కవితలో జీవన సత్యాలను ఆవిష్కరించారు. మానవ సంబంధాలన్నీ 'మనీ'బంధాలైన వైనాన్ని నర్మగర్భంగా వివరించారు. మనిషి రూపాయిగా మారాక... మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు, బంధాలు కృతకమయ్యాక .. సంబంధాలు క్షణికాలు! అని ముగించడం బాగుంది.

ఏ కవిత్వానికి ఏ అక్షరం యోగ్యమో చేయి తిరిగిన కవి మేదకు ఎరుక అనీ .. ఏ శిల్పానికి ఏ రాయి అర్హమో మేటి శిల్పికి తెలుసంటూ మరో కవితలో ఆవిష్కరించిన తీరు బాగుంది. కలలకు లక్ష్మణ రేఖలు లేవని ..కలలు కంటూనే ఉండాలని పేర్కొంటూ... 'కలలకు ప్రాణముంది' కవితను తీర్చిదిద్దారు. కలలకు ప్రాణం పోస్తే – కర్త క్రియగా మారుతుందని, క్రియ కర్తకు స్ఫూర్తి, కర్త క్రియకు మార్గదర్శి అని విశ్లేషించిన తీరుబాగుంది. వృద్ధాశ్రమం వృద్ధుడికి కంటిరెప్పఔతుందంటూ... 'అమ్మను మరపించిన అమ్మ' కవితను రూపుదిద్దారు. చీకటికి భయపడ్డ వెలుగు చిరునామా మార్చి దాగిందని .. చీకట్ని చీల్చి వెలుగును వెతుకు తున్నానంటూ మరో కవితకు ఈ గ్రంథంలో చోటు కల్పించారు.

నేనిప్పుడు తాత్కాలిక ఏకాకినైతేనేం?/ రేపు శాశ్వత సమూహాన్ని! అంటూ మంచి ముగింపునిచ్చారు.

'బాల్యం బానిసత్వమైంది' కవితలో బాల భాస్కరులు బాల కార్మికులై పోతున్న ఘటనలను ఏకరువు పెట్టారు. బాల్యం శ్రమ జీవనమై... జీవితం మరుగుజ్జు ఐందంటూ కవి తమ ఆవేదనను వ్యక్తపరిచారు. అమ్మలాంటి రాజ్యాంగం .. నిర్బంధ విద్య అంటూంది. అయ్యలాంటి ప్రభుత్వం.. అమలుపరచటం మరిచిందని వ్యాఖ్యానించారు.

'ప్రకృతి ఒడిలో' కవితలో కవి అడిగోపుల తమ భావుకతను ప్రదర్శించారు.

వాకిట ముగ్గులు పెడుతూ యువతి
చెలికాడు పలకరింపుకు
జారిన జడను మెడపై జార్చి
ఓరగా చూసిన చిరునవ్వుకు
అందంతో పోటీ పడలేని చంద్రుడు
సిగ్గుతో మబ్బుల చాటున
ముఖం దాచేయటం ...
ఎగ్గట్టిన ఎర్రచీర బిగించిన పైట
నెత్తిపై ఎండుకట్టెల మోపుతో
అసుర సంధ్యలో యువతి
కొండ దిగుతుంటే ...

మోపు వెనకాల సూర్యుడు వేలాడ్డం ప్రకృతి' అంటూ రాసిన పంక్తులు ఆయన భావుకతను చాటాయి.

## సాహిత్య ప్రస్థానం ఫిబ్రవరి - మార్చి 2022 పురస్కారాలు

**వాళ్లే లేకపోతే ...**
*కవితకు రూ.500*
కవి: **అనిల్ డ్యాని**

**చారలపిల్లి**
*కథకు రూ.500*
రచయిత: **వేంపల్లి షరీఫ్**

■■■

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

'శబ్దంతో నీదైన ఆకాశం నిర్మించు / అది సురక్షితం
నీదైన భూమిని నిర్మించు / అది సుక్షేత్రం' అంటూ
'ఇంకా తెల్లారలేదు' కవితను రాశారు.

మట్టిది క్షమాగుణమని .. దురుసుగా కాలు జాడించినా
చీత్కరించి మలినం చేసినా ..తవ్వి గాయపరిచినా..
ఓర్చుకుంటుందని.. ఓర్పును నేర్పిస్తుందంటూ 'జయభేరి' కవిత ద్వారా తెలియజెప్పారు.

మట్టిలో పుట్టిన మనిషి/ మట్టిని జయిస్తాడని ..
మనిషికి బలమౌవుతాడని ..
మట్టిని జయించిన మనిషి/ మట్టిలో కలుస్తాడు !

మట్టికి బలమౌవుతాడని వివరించిన తీరు కవితకు శోభను కూర్చింది.

నోట్లో మట్టిగొట్టే/ వ్యాపారుల్ని
రాజకీయ నాయకుల్ని / మట్టికరిపిస్తాడని ముగించడం
కవి అడిగోపుల గారి లోక పరిశీలనను సూచిస్తోంది.

ఇలా కవి అడిగోపుల గారు తమ అనుభవాల్ని రంగరించి రాసిన కవితల్లో జీవం ఉంది. జీవితం ఉంది. జీవన సత్యాలు అడుగడుగునా ఆణిముత్యాల్లా కొలువుదీరాయి! భావావేశంలో రాసిన కవితా వస్తువుల్లో సైతం కవి సంయమనాన్ని పాటించి .. తాను చెప్పదలచుకున్న విషయాలను అర్థవంతంగా, ఓపిగ్గా ఆవిష్కరించడంలో ఆయన సఫలీకృతులయ్యారు.

సామాజిక చైతన్యం కోసం ఆయన రాసిన ఇందలి కవిత్వాన్ని అందరం చదివి చక్కని అనుభూతిని పొందుదాం. 1984 నుంచి 2021 వరకు 25 కవితా సంపుటాల్లో మొత్తం 1357 కవితల్ని రాసి 'జయభేరి' మోగిస్తున్న అడిగోపుల వెంకటరత్నమ్ గారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం. ■



### జ్వలిస్తూ ...

నిశ్శబ్దం
బయట, లోపల అంతా
ఆకాశం మబ్బుపట్టి వుంది
బరువుగా చీకటి పరచుకుంటోంది
రాత్రి కాని పగలు కాని సమయం
కూర్చొని వున్నావు, అలాగే

అక్కడినుంచి లేవాలని లేదు
మెత్తగా మెల్లగా
ఆకులు రాలి ఒళ్ళో పడుతున్నాయి
కొంత నలిగిన ఆకుల నుసి కూడా
అంతలో ఈదురు గాలికి
దుమ్ము కంట్లో పడి ఉక్కిరిబిక్కిరవుతూ
దుఃఖంతో .. ఇక తప్పక
అక్కడినుంచి కదులుతావు
ఒక నీడ కూడా నీ వెంట జ్వలిస్తూ ..

**- లక్ష్మీ కందిమళ్ళ**
**89196 99815**



# సదువూ .. స్మార్ట్ ఫోనూ ...

- వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి
94400 44922

**మా** పెద్దోడు సుబ్బరాయుడు. వోడికి పద్నాలుగేండ్లు. వోడు ఇస్కూలుకు బోతావుంటే చూడల్ల, బులుగు రంగు పంట్లాము, పంట్లాములోకి తోసిన తెల్లంగీ, మెడకు ఎర్రంగా గుడ్డ పేలిక, కాళ్ళకు బూడ్సులు. వోడు బోతావుంటే కల్లెక్టేరు పోయినిట్లే ఉంటాడనుకోవల్ల. మా ఈధికి మైలంత దూరంలో ఉండే ఇంగిలీసు ఇస్కూలుకు బోతాడు. ఈసారికి వోడు తొమ్మిది పాసై పదో తరగతిలేకి బోతాండడు. వోడు ఈ పొద్దు తెల్లారిగట్ల మూలగూసోని మఠమేసినాడు. అన్నందినడు, నీళ్ళు దాగడు. వాల్లమ్మతో గుడక మాట్లాడడు. ఎందుకట్లని ఆలోచన జేస్తే ఇలేవరి మనసుకొచ్చిండాది. వోడు పోను కొనీమని అడగబట్టి మూన్నెళ్ళయిండాది. నేనే ఇదాయకం లేక కొన్లా. వోడు యీపొద్దు ఇట్టాజేస్తావుండాడు. వోనికి దోడుబయింది మాయాడది, మూన్నాళ్ళుగా రెయింబగుల్లు ఒగటేపోరు. "వోడేమన్న బంగారమడిగినాడా, వోని జతగాళ్ళంతా కొనుక్కున్నారంటా, సదువుగూడా అందులో వస్తాదంట, కొనీగూడదా, ఎర్ర దూడను అమ్మిన దుడ్డుంది గదా", అంటా నస పెట్టబట్టె. తట్టుకోలేక "యాడదెచ్చిగొనేది, ఆ దుడ్డు ఇబ్బుడయిపోతే రేపు చిన్నమ్మి కానుపెట్టజెయ్యల్ల", కసిరితే ఇంగేం మాట్లాడల. అంతేగదా, కొడుక్కు పోనా, కూతురి కానుపా అంటేబీ కూతురి రెండో జన్మ ముక్యమంటుంది గదా! గానీ పిలగోడు మాత్రం రాత్రయినా ఎంగిలి బడలా. మనుసు దిటువుజేసుకొని "కొనిస్తాలే అంటి". అబ్బుడంత దిన్నాడు.

మాయాడది బోగెట్టిది, ఆవుల పాలమ్మి కుటుంబం ఎగేస్తాది. ఇంట్లో తిండిజేసేది, బట్టలుతికేది, ఆవుదూడలకు గడ్డి నీళ్ళు పెట్టేది, చెత్తలు తోసేది ఆమె పని. ఆవులకు గెడ్డి తెచ్చేది, తెల్లారి, సాయంత్రం పాలమ్మేది నా పని. తింటామో, పస్తుంటామో గూడా ఎవురుకి తెలీకుండా గుట్టుగా నడపతాది.

ఒగాడ బిడ్డ, ఇద్దరు మొగ పిలగోళ్ళు మాకు. కూతురు వయసులో పెద్ద. అయినా ఆయమ్మికి చిన్నమ్మ అంటా పేరుబెట్టుకున్నాం. ఆయమ్మికి మాకు దోడుబోయినోనికిచ్చి పెండ్లి జేస్తిమి. వోళ్ళు బాగుండారు. ఆయమ్మి ఇబుడు కానుపుకోసం పుట్నింటికొచ్చింది.

ఆ పోను యాడ గొనాలో, ఎంతవుతుందో తెలీకపాయే. మా పిలగోనికి పాటం జెప్పే నారాయణ రావు సారు దగ్గిరికిబోతి. ఆయప్పకు యాడా పనిదొరక్కబోతే మావూళ్లోనే ఇంగిలీసు ఇస్కూలు బెట్నాడు. ఆయప్పతో పాటు సదివి ఉజ్జోగం జేసే వోళ్ళకంటే బాగా దుడ్లు సంపాయించినాడు. పెద్ద పెద్ద మాడీలు కట్టినాడు. నాలుగు బస్సులు చుట్టూ పల్లెలకు దిప్పి పిలగోళ్ళను ఇస్కూలుకు దోలతాడు. తిండికి కష్టమయినా మా ఇద్దరు పిలగోళ్ళను గూడా ఆయప్ప దగ్గిరే సదూకోనేకి ఇడిసి పెట్టిందేది. ఇంగిలీసు బదులు గవర్నమెంటోళ్ళు అబ్బుటికి పెట్లా కదా, దానికే ఆయప్ప దగ్గిర ఇడిసి పెట్టిందేది.

"మావోనికి పోను గొనాల, దానికే అడిగేకి వస్తి" అంటి. "ఇంకా కొనలేదా, వాడు మిగతా పిల్లోళ్ళకంటే చదువులో వెనక పడిపోడూ" అనే. "సరే రేపు సాయంత్రం ఏడు గంటలకు నేను టౌనుకు పోతున్నా, నువ్వెళ్లి ప్రకాశం వీధిలో జెండామాను దగ్గరుండు. నాతో షాపుకొస్తే కొనిపిస్తా" అనే.

టౌనులో ప్రకాశం యీధికి ఇంతకుముందు నాలుగైదు సార్లు బొయిన్నా. బట్టలు, ఇంటి సరుకులు, ఇనప సామగ్రి, సున్నము, సిమెంటి, కడాకు ఆకు వక్కా గొనాలన్నా ఆ యీధిలోనే. అది చానా పెద్దీధి. సారు వచ్చేతలికి నేనక్కడ లేకపోతే ఎట్లాని, నేను ముందే ఆ యీదిలోకి బయిన. యిచిత్రం, ఇబుడు ఆ పాత అంగళ్ళు లేవు. ఏమయినాయబ్బా? అనుకొంటా నిల్చుకోనుంటే నారాయణ రావు సారు కార్లో దిగే. నన్ను జూసి, చేత్తో సైగ జేస్తే బోతి. పక్కనుండే అంగిట్లోకి తోలకపాయ. అంగిట్లోకిబోతే వొళ్ళు వొనికించే సలి, మిట్టమద్దానం మాదిరి మా ఇదిగా ఎల్తురు. లోపలికి అడుగుబెడితిమో లేదో పదిమంది పిలకాయలు మా చుట్టూ మూగిరి. అయవోరు యేదో అనగానే

'ఇది యాభైవేలు, ఇది అరవై వేలు, ఇది యాభైరెండు వేలు' అంటూ పది రకాల డబ్బాలు మా ముందర బెట్రి. 'నా కోసం కాదు, ఇతగాడి కోసం' అనంగానే, ముందుబెట్టినవన్నీ పక్కకుబెట్రి. వేరే డబ్బాలు పైన బెట్టి 'ఇది పదివేలు, ఇది పన్నెండు, ఇది ఎనిమిది వేలు' అన్రి. ఇంకా తక్కువలో చూపండి అనంగానే, ఇంకో పది రకాలు ముందరేసిరి. ఒగపోను సరే అనుకుని, ఆరేల రూపాయలకు బేరం గుదిరిచ్చి నన్ను జూస్తే, నేను దీసకబయిన ఐదువేలు సారు చేతిలో బెడితి. యేమనుకున్నాడో ఆయప్ప జేబులోంచి యెయ్యి దీసిచ్చె. మేము బయటికి వచ్చినాంక, "వేయి రూపాయలు రేపు స్కూలు కాడికి తెచ్చియ్యి" అనంగానే, "సరే" అంటి.

పోను సంచిలో బెట్టుకోని ఇంటిదారి బడితి. దారెంబడి బోయే ఇంగొగ సారు రాజన్న నన్నుజూసి "వెంకటప్ప బాగున్నావా" పలకరించె. ఆ సారు పైదేసంలో ఇంజినీరుగా ఉజ్జోగం మానేసి యెగసాయం జేసేకి మావూరొచ్చినాడు. ఆయనజేసేది అదేదో పర్కుతి యెగసాయమంట. "బాగున్నా సారూ" అని, బాగులోనుంచి పోను తీసి ఆ సారు చేతిలోబెట్టి, "మంచిదేనా సారు" అంటి. "ఇదెందుకు నీకు" అనే. పిల్లోని కథ జెప్తి. ఆ సారు ఎదో చెప్పబోయి ఆగిపాయ. "దీనికి ఎంతియ్యొచ్చు సారు" అంటి. గొర్రైనో, ఆవునో కొన్నెబ్బుడు అట్లా అడిగేది మామూలే. ఆటి బేరం తెలిసినోళ్ళు ఉజ్జాయింపుగా జెపతారు. మనంబెట్టి కొన్న బేరం ఎక్కువా, అగ్గవా అనేది తెలుసుకునేకి అట్లా అడిగేది మా యిలాకాలో మామూలే.

సారు పోను అటు ఇటు దిప్పి, దానిపైనుండేది జదివి "మూడువేలు చేయొచ్చు" అనే.

నాకు నోట మాట రాలా. కాసేపాగి "ఆరు వేలకు కొంటిమి సారు" అంటి.

"మూడువేలు పోన్ విలువ, మిగతాదంతా వాళ్ళ లాభం, ఖర్చులు" అనే.

"వాళ్లకేం ఖర్చు సారు" అంటి.

"పోన్లు అమ్మే షాపుకు నెల బాడుగ లక్ష, కరెంట్ ఖర్చు యాభై వేలు, ఆ షాపులో పనిచేసే పదిమంది జీతం కలిపి లక్ష రూపాయలు, అంత పెట్టుబడికి వడ్డీ, కష్టపడిందానికి ఆ షాపు ఓనరుకు మరో లక్ష వేసుకో. ఇదంతా ఎక్కడినుంచి వస్తుంది. పోను కొన్నోళ్ళు ఇయ్యాల్సిందే కదా".

నేను నోరెళ్ళబెట్టి "అంత లాభముంటుందా సారు" అంటి.

"నువ్వు పోయిన వీధిలో అన్నీ ఈ షాపులే కదా? బట్టలు, సరకుల అంగళ్ళులాంటివి పోయి, అన్నీ ఈ షాపులే వచ్చినాయంటేనే నీకు తెలియలేదా? ఆ వీధిలోనే కాదు, టౌనులో ఏ సందులో చూసినా పోను షాపులే. ఎంతగా లాభముంటే ఇలా చేస్తారు'', అనంగానే ఇంగేమి మాట్లాడకపోతి. ఇంతలో ఆ సారోల్ల ఇళ్ళు రాగానే ఆ సారు లోపలికి పాయె.

కాళ్లీడుచుకుంటూ ఇంటికిబోతే, పెద్దోడు ఎదురొచ్చి పోను దీసుకొని ఇంట్లో అందరికీ జూపించె. ఇంట్లో అందరూ దాన్ని చిన్న బిడ్డకంటే అపురూపంగా జూసిరి. పెద్దోడు దాన్ని జతగాళ్ళకు జూపిచ్చేకి యీదిలోకి పరిగెత్తి పాయ.

గంట తరువాతొచ్చి, "మున్నూర్రూపాయలు యీ" అనే. "పోను కొనిమ్మంటే కొనిస్తి, మళ్ళా దుడ్డు దేనికిరా" అంటి. "పోనుకు కార్డేసుకోవాలా, నెట్టేసుకోవాలా" అనే. నేను తలబట్టుకొనేదాగటే తక్కువ. నేనేమి చెప్పకముందే, నా చిన్న కూతురు దగ్గిర వోడు ఆ దుడ్డు దీస్కోని పాయ. ఆయమ్మి కానుపుకు ఇంటికొచ్చింది. కానుపుకు పుట్నింటికి వస్తా రూంత దుడ్డు యెంట తెచ్చుకునింది. పెద్దోడు ఆయమ్మి దగ్గిర దుడ్డు దీసుకుంటే నాకు తలగొట్టేసినట్టాయే.

మధ్యాన్నం మళ్ళా వచ్చి, "పోనుకు కవరు వేసుకోవాలా, గీతలుబడకుండా కీనుగార్డు యేసుకునేకి మున్నూరు గావాల్ల" అనే.

''పోనంటే కొనిస్తి, ఇదేందిరా పూటగొగటి అడగతావుండావు" అంటే, "పోనుకు గీతలుబడతాయి" అనే. ఇసిపెడితే ఇంగా సతాయిస్తాడనుకుందేమో "లే ఇంగ తిని పడుకో, రేపు జూద్దాం" అని వాళ్ళమ్మ అంటే వోడు సరే అనే.

ఇంట్లో ఇరవైదాకా కోళ్ళుండే. వాటిల్లోనే ఎదోఒగటి కోసుకోని నెలకోసారి కోడికూర దినేటోళ్ళం. వాటిల్లోనే పుంజులమ్మి ఇంటికి సరుకులు కొనేది మాయాడది. ఇంట్లో ఎవురికయినా బాగలేకపోతే ఆ దుడ్డే యెత్తుకుని ఆసపత్రికి కూడా బోతావుంటిమి. యేమనుకుందో మాయాడది మూడు పెట్టకోళ్ళను బేరానికిబెట్టె. ఆ కోళ్ళు గుడ్లుబెడతావుండే. ఇద్దురు పిల్లోళ్ళకు, కానుపు కోసమొచ్చిన సన్నపాపకు గుడ్లు ఉడకేసి పెడతావుండే వాళ్ళమ్మ. ముగ్గురికీ సగం ఆకలి ఆ గుడ్లే దీరస్తావుండే. కోళ్ళమ్మితే వచ్చిన ఆర్నూల్లు వోనికిచ్చే.

నారాయణ రావు సారుకు యెయ్యి ఇయ్యాల, సన్నపాపకి మున్నూరు ఇయ్యాల. యేరే మార్గం లేక అప్పు అడిగేకి రాజన్న సారు దగ్గిరికి పోతి. "పోను అవసరానికి కొనాలి తప్పా, పిల్లాడు అడిగాడని కొనరాదు. పోనులో పిల్లలు ఏమేం చూడగలరో తండ్రిగా నీకు తెలీదు. గొర్రెలు మేపడంనుంచి గోరీలు కట్టడందాకా, అల్లం పెంచడం నుంచి ఆడామగ చేసే చీకటి సంసారం వరకు అన్నీ చూడొచ్చు. పిల్లలు పోన్లో

నేర్చుకునేది గొప్ప విషయాలని నీలాంటి తండ్రి అనుకుంటాడు, కాని పాడు విషయాలు తెలుసుకోవడానికే పిల్లలకు ఎక్కువ అవకాశం ఉంటుంది. మంచేదో, చెడేదో తెలుసుకోలేని వయసువాళ్ళది. నీ కొడుకు చదువుకోసం నీ చేత పోను కొనిచ్చిన నారాయణ రావు, తన కొడుకును డెహ్రాడూనులో పబ్లిక్ స్కూళ్ళో, కూతురిని కోయంబత్తూరు ప్రైవేటు స్కూళ్లో చదివిస్తున్నాడు. ఆ స్కూళ్ళలో పోన్లు అనుమతించరని నీలాంటి వాళ్లకు తెలియదు" అనే రాజన్న సారు. ఇదేమీ తెలీకుండానే పోను కోనేసినానే అని ఆ సారు ముందు తల కొట్టేసినట్టాయ్. అప్పు అడగకుండానే ఇంటికి వచ్చేస్తి.

చనిపోయిన మాయమ్మ యెండి కడియాలుండే. ఇంట్లో పిలగోళ్ళందరూ సందేళ అయిందంటే మాయమ్మ వొడిలోకి చేరి, ఆయమ్మ జెప్పే దెయ్యం కథలు, రాజుల కథలు యింటా ఆ కడియాలతో ఆడుకునేటోళ్ళు. అయ్యమ్మి అయవారు, కూతురి అప్పు దీర్చినాక నాకు కొంచెం తిండి దిగే.

ఒగ నెలకే వోడు "పోను రీచార్జి చేసుకోవాలా ఇన్నూరు యీ" అనే. "అదేందిరా నెలప్పుడు జేసుకుంటివిగదా సరిపోదా" అంటే, "నెలగొగసారి చేసుకోవాల్ల" అనే. "దుడ్డంతా దాని మొగానబెడితే ఇంట్లో యేమిదిని బతకేదిరా'' అంటే, "నెలగొగసారి చేసుకోవాల్సిందే" అనే. ఇంగజేసేకి ఏముంది, ఇంగొగ పెట్టనమ్మి వాళ్ళమ్మ దుడ్డిచ్చే.

నెలలోపలే ఇంటికాడ అందురూ పోనులో సినిమాలు జూడబట్రి, పొటోలు తీసుకుండ్రి. వోడు రీచార్జి చేసుకోవాలన్నపుడల్లా పుంజునో, పెట్టనో అమ్మబట్టే వాళ్ళమ్మ.

సంవత్సరం తిరిగేసరికి చిన్నోడు పోనుగావాలనే. "పెద్దోడి పోనుందిగా వాడుకో" అంటి. "వోడు ఒగపూట యిస్తాడు, ఇంగో పూట యీడు" అనే. పెద్దోడు నిద్రబోయేతబుడు "చూసుకోరా" అని పెద్దోడి దగ్గిర పోనుదీసి చిన్నోడికిస్తి. పెద్దోడు యేలుబెడితే తప్పా ఆ పోను జూసేకి రాదంట. సతాయిస్తే నిద్రమత్తులోనే పెద్దోడు ఆ పూట యేలుబెట్టి ఇచ్చినాడు. చిన్నోనికి అట్లే రెన్నెళ్ళు పోను కోనీకపోతి.

ఇంట్లో మట్టావు వట్టిపోయిండే. దాన్ని బేరంబెడితే పదేలచ్చె. చిన్నోనికండ్లు ఆ దుడ్డుపైన బడినాయి. వోడు ఆ దుడ్లు మనసులోబెట్టుకోని వాళ్ళమ్మను ఒగటే సతాయింపు. ఇబుడు చిన్నోడు అన్నం తినడు, నీళ్ళు తాగడు, దినమంతా దిక్కులు చూస్తానే ఉంటాడు, అదే పోను గొడవ. "దుడ్డు లేదురా" అంటే చిన్నోడు యినేతట్లుగా లేడు. యింగెంజేయాల, వోనికి ఆవునమ్మిన దుడ్డునుంచి ఆరువేలుబెట్టి కొనిస్తి.

ఆరునెళ్ళకు పెద్దోడు "నా పోను పోయింది" అనే.

"యాడికిబోయిందిరా" అంటే, "పోనులో ఏమీ వినపడదు, కనపడదు" అనే, "అయితే, రిపేరీ చెయిస్తాలే" అంటి. మరుసటి దినం నేనే పోనుగొన్న అంగిడికి బోతి. రిపేరీ షాపు లోపలే ఉంది. పోను దీసుకోని అటుదిప్పి, ఇటుదిప్పి "రేపురా" అన్రి. మరుసటి దినం పోతే, "రిపేరికి మూడువేలు అవుతుంది" అనే. నాకు కాళ్ళుజేతులు ఆడల. "దీన్ని రిపేరీ చేసుకోవడం కంటే, ఇంగో రెండువేలు పెడితే కొత్త పోను వస్తుంది" అన్రి. కాళ్లీడుచుకుంటూ ఇంటికొస్తి. పెద్దోడు నాకోసం జూస్తావుండే. "అది రిపేరీ కాదంట", అంటే వోడు కన్నీళ్లు బెట్టుకుండే. కోపం పట్టుకోలేకపోతి. వోని చెంప చెళ్ళుమంటే యిని వాళ్ళమ్మ బయటికొచ్చే. "పోను కోనీకపోతే యేడిస్తివి, కొన్నాక చెడిపోయిందని యేడస్తావుండావు, మూడేలు అవుతుందంట, నేనేడదెచ్చేదిరా" అంటి.

"యీయావు వుండేం లాభం, వట్టిబయింది, దాన్నీ అమ్మేస్తేబోలా? వోడికి పోను వస్తుంది. ఆవు యెనక మేపెకి పోయే బాధ నాకు తప్పుతుంది." నా మనుసులో మాట యెవ్వరికీ జెప్పకుండా మరుసటి రోజు ఆవును అమ్మేస్తి. పోను కొనే చోటుకి యీ సారి నేనేబోతి. పెద్దోడి పాత పోను, ఐదు వేలు దుడ్డు దీసుకోని కొత్త పోనిచ్చిరి అంగిడోళ్ళు.

నెలనెల ఇద్దిరికి పోను రీచార్జి జేసేకి దుడ్డు యీబడితి. ఇంగో సంవత్సరానికి పెద్దోడు రోజూ తలనొప్పి అంటావుండే. మావూర్లోవుండే డాక్టరు దగ్గరికి దోలకపోతి. "ఈ అబ్బాయికి తలనొప్పి కాదు, కళ్ళ సమస్య" అనే. కండ్ల డాక్టరు కాడికి దోలకపోతి. "ఈ అబ్బాయి పోను రేయిబగులు చూస్తున్నాడు. అందుకే కళ్ళ సమస్య. అసలు పోను చూడకపోవడం మంచిది, లేకపోతే చూపు తగ్గుతుంది. ఇలాగే చేస్తే, కంటి ఆపరేషన్ కూడా అవసరం అవుతుంది" అనే.

ఇబుడు యీళ్ళను పోన్లు చూడగూడదని చెప్పేదెట్ల, చెప్పినా ఇనేదెవుడు. ముందు యీ పోన్ల కతేందో నేను కలదెలుసుకోవల్ల. నాకు యీ పోన్ల గురించి యెవురు ఇలేవురిగా జెపతారాని రాజన్న సారు దగ్గిరికిబోతి.

నన్నుజూడంగానే, "ఏం వెంకటప్ప పోను ముచ్చట తీరిందా?" అనే.

"నాకేమీ తెలీడం లేదు సారు. పిల్లోళ్ళు పోనుకోసం నా పాణం తీయబట్రి. అందుకే మీ దగ్గిరికొస్తి" అంటి.

"ప్రతి కంపనీ వాడు వారానికో కొత్త పోను అంగడిలోకి తెస్తాడు. కనీసం వంద కంపెనీలున్నాయి. ఒకడు కొత్త కెమెరా అంటాడు, రెండువైపులా కెమెరా అంటాడు, ఒకడు నాలుగు కెమెరాలంటాడు, ఒకడు రెండు సిమ్ములు అంటాడు, ఒకడు 4జి అంటాడు, 5జి అంటాడు. ఇంకొకడు పెద్ద మెమరీ అంటాడు. మరొకడు వెడల్పు స్క్రీను అంటాడు. ఇంకా మా పోను మడిచి

పెట్టుకోవచ్చంటాడు. మనం ఏ ఫోను కొన్నా సంవత్సరానికో, రెండేళ్ళకో సరిగా పనిచేయదు. రిపేరీ చెయ్యమంటే, మీ ఫోనులో వైరస్ వచ్చిందంటాడు. కొత్తగా సాఫ్ట్ వేర్ వెయ్యాలంటాడు. మెమరీ చాల్లేదంటాడు. మదర్ బోర్డు పోయిందంటాడు. స్క్రీన్ పోయిందంటాడు. ఎదో ఒకటి మార్చినా, మరుసటి నెలలో ఇంకోటి పోతుంది. అందరిదీ ఇదే సమస్య. ఎవరి దగ్గిర ఫోను పదేళ్ల కాలం పని చేసిన సందర్భం ఉండదు."

"పదివేల ధర పెట్టి ఆవును కొంటే, రెండేళ్ళ తర్వాత అదే ధరకు అమ్ముకోవచ్చు. అదే పదివేలు పెట్టి కొన్న ఫోను తిరిగి అమ్ముదామంటే వెయ్యి కూడా ఇవ్వరు. ఆ వెయ్యికూడా ఎప్పుడిస్తాడో తెలుసా, ఫోను బాగా పని చేస్తేనే. అంటే ఫోను సరైన ధర వెయ్యి రూపాయలే అన్నమాట."

"ఎదో మాయ చేసి కనీసం రెండేళ్లకు ఒకసారయినా కొత్త ఫోను కోనేటట్లుగా చూస్తాడు. రీచార్జి అంటాడు, నెట్ వేసుకో మంటాడు. మీరు సినిమాలు చూసుకోవచ్చంటాడు, పాటలు వినొచ్చంటాడు, మా కంపనీది నెలకొకసారి రీచార్జి చాలంటాడు. వారానికొక సారి రీచార్జి చేసుకునే అవకాశం మా దగ్గిరుందంటాడు. వెయ్యి రూపాయలకు వేసుకుంటే నూరు రూపాయల ఉచితం అంటాడు. మరొకడు పది రూపాయలకే రీచార్జి అంటాడు. ఎలాగయినా పేదోళ్ళు దగ్గిరుండే చివరి పది రూపాయలు కూడా లాక్కోవడానికి చూస్తాడు. పేదోళ్ళ కొంపలు నాశనం చేయగల మాయా దయ్యం పేరే మొబైలు ఫోను.", అంటూ ముగించే. యీసారి తల్దీసి మోకాళ్ళ మద్యనబెట్టుకోని కూకుండిపోతి.

"పేదోడి దగ్గరి చివరి రూపాయి వరకు దోచుకునేకి సినిమా, సారాయి, ఫోను లాంటివి పెద్దోళ్ళు నడిపే మతలబులు తక్కువ క్లాసు రేటుకు సినిమా టికెట్ అమ్మేది, చిన్న పాకెట్లో సారాయి అమ్మేది, పది రూపాయలకు కూడా ఫోను రీఛార్జి చేసేది. నువ్వు ఆకలికి, బట్టకు, వైద్యానికి అప్పుగా అడిగితే తప్పక సాయం చేసేవాన్ని. ఫోను కొనేదానికి అప్పిచ్చి ఆ పాపం నాకూ, నా బిడ్డలకు తగిలేటట్లుగా చూడకు. నువ్వు వెళ్ళు" అనే. నేను అప్పు అడగకనే, నా మనుసులో మాట ఆ సారుకు తెలిసినట్లుంది. పైగుడ్డ మొగానికి గప్పుకొని ఇంటి కొచ్చేస్తి.


ఇంట్లో ఆవులు లేవు, పాలు లేవు, దూడలు లేవు, కడియాలు లేవు, కోళ్ళు లేవు. అన్నీ ఫోన్లు గొనేకి అయిపాయె. అందుకే యేరేవోళ్ళ దగ్గిర గొర్రెలు మేపెకి జేరుకుంటి. నాతో పాటు గొర్రెలు మేపుకునే మల్లికార్జున, ఎనుములు మేపే చుక్కమ్మ, పందులు మేపే రామాంజి గూడా ఫోన్లుగొన్నారు. ఫోన్లతో వోళ్ళబడే ముచ్చట్లు జూసినాక, ఫోన్లు కొనే పేదోడు కూడుగుడ్డకు మొగమాసి పోవాల్సిందేగా అనిపించే. ■



## నా ఆశల సముద్రానికి అవతల ...

**ఒ**క్కోసారి కీర్తి తోరణాలు
ఎంత దారుణంగా వుంటాయో
గుది బండల్ని మోస్తూ
గులక రాళ్లని నములుతూ!
కొన్నిటిని నిశ్శబ్దంగా చూసి ఊరుకోలేం!
ఏదో ఒకరోజు
ఈ చీకటి తొలగిపోతుందన్న నా ఆశ
ఏ స్వప్నంలోనో తల విరబోసుకుంటుంది
కిటికీనుండి సముద్రాన్ని చూస్తున్నాను
నిర్జీవ ప్రపంచంతో ఆటలాడుకొంటున్నాను
సముద్రం నన్ను దగ్గరకు లాక్కుంటోంది
రత్నాలు వెతుక్కోమని!
నేను చూస్తున్న దిక్కులో
ఎవరూ నాకు అవతల కనిపించడం లేదు
తెరిచిన సముద్రం నోరు
రంగుల్లేని రంగుతో నవ్వుతోంది

**- ఏటూరి నాగేంద్రరావు**
**74166 65323**



# అన్నదాతకు మద్దతుగా అక్షర సేద్యం

- కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి
99487 74243

**అ**న్నదాతలకు ఆత్మహత్యల రాత, కపట కార్పొరేట్ వ్యవస్థలకు కలిమి రాత రాస్తున్న మన పాలక నేతల్ని రైతులు సంఘటితమై ప్రశ్నించటం, ప్రతిఘటించటం ఇటీవల దేశంలో మనం చూశాం. పాలకులు తెచ్చిన మూడు చట్టాలను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని నడిబొడ్డున రైతులు ఉద్యమించారు. రైతు వ్యతిరేక చట్టాల స్వభావాన్ని రైతులు లోతుగా అవగాహన చేసుకున్నారు కాబట్టే ప్రాణాలు ఒడ్డి ఉద్యమ జ్యోతి ఆరిపోకుండా కాపాడగలిగారు. న్యాయమైన ఉద్యమాల్ని అణచి వేయడమే ప్రజాస్వామ్య అత్యుత్తమ నీతిగా పాలకులు భావిస్తూ, ఉద్యమాల మీద ఉక్కుపాదం పెట్టడం, న్యాయాన్యాయాల్ని పరిశీలించి పరిగణనలోకి తీసుకుని సవరణ చేయాల్సిన ధర్మానికి స్వస్తి పలుకుతూ, వందల మంది రైతు ఉద్యమ కార్యకర్తలను అహంకారంతో తుపాకీ తూటాలకు ఎరచేయడం మనం చూశాం. ఆఖరికి రైతు ఉద్యమానికి పాలకులు తలొగ్గాల్సి వచ్చింది.

రైతు ఉద్యమ లక్ష్యం, రైతిరికాన్ని సర్వనాశనం చేయ పూనుకున్న ప్రభుత్వం కళ్ళు తెరిపించి, వారు వెలువరించిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను వెనుకకు తీసుకోవడం కొరకే. రైతు వ్యతిరేక నూతన చట్టాల సారాంశం మొదట గ్రహించిన వారు ఉత్తర భారతావని రైతాంగం. అందుకే ఉద్యమంలోకి ఉరికారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, నష్టాలు కలిగినా చివరకు ప్రాణాలు పోతున్నా వెనుకంజ వేయని విధంగా, ఉద్యమం ఊపందుకొనే విధంగా రైతు పోరాటం మొదలైంది. ఈ పోరాటం కాలగతిలో కలిసిపోకుండా, రైతులకు మద్దతుగా కవులు, రచయితలు కవితా సేద్యం చేశారు. చైతన్యయుతమైన కవితాగోష్ఠులు, కవిసమ్మేళనాలు నిర్వహించారు. ఇటువంటి ఉన్నతమైన ఆశయంతో పశ్చిమ గోదావరి జిల్లా, అరసం శాఖ వారు 'హలంతో కలం' శీర్షికతో ఒక కవితా సంకలనాన్ని విడుదల చేశారు.

ఈ కవితా సంకలనంలో 106 మంది కవులు తమ కవితల్ని రైతు ఉద్యమాన్ని బలపరుస్తూ, ఊపందుకునే విధంగా రాశారు. రైతు వ్యతిరేక రైతు చట్టాలను వెనుక్కు తీసుకోవాలనే డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని ఖండిస్తూ కవితలు నడిచాయి. 106 మంది కవులు, 106 కోణాల్లో ప్రభుత్వ విధ్వంసక చర్యల్ని దుయ్యబట్టారు. రైతుకు అండగా కలం బలాన్ని అందించారు. కర్షకుల కోసం కలాలు కవాతు చేసిన విధం పరిశీలిద్దాం.

ప్రభుత్వం విడుదల చేసిన 'నల్లచట్టాలు నల్లతాచులై బుసలు కొడుతున్నా.. / అతనక్కడే.. ఒక్కడూ.. ఒంటరిగా అక్కడెక్కడినుంచో / పిట్టె ఎగురుకుంటూ.. ఓ గీతం అతనివైపు / గుంపై కదిలిన కవుల గొంతు అతనికిప్పుడు ఊతకర్ర' అంటూ కవులు రైతును సమర్థించిన వైనాన్ని వ్యక్తీకరించారు చెళ్ళపిళ్ళ శ్యామల. 'కృషియేవ జయతే' కవితలో ఉదయ సూర్యుల్లా ఉద్యమిస్తూన్న అన్నదాతలకు / చేయూతనిద్దాం కలం బలంతో" అంటూ డా॥ రాపోట వారు రైతు ఉద్యమాన్ని బలపరిచారు.

'సమాజహితం కోసం కరుగుతారు కొవ్వొత్తుల్లా జోహార్లు' అంటూ 'ఉప్పెన' ఉప్పెనై పాట అందించారు. నందిని సిధారెడ్డి

‘అన్నం తినేవాడెవడైనా / అన్నం పెట్టే వాళ్ళకు తలొంచాల్సిందే’ అంటూ నిత్య సత్యాన్ని వ్యక్తపరచారు. ‘కరుడు గట్టిన నేతల కంచాలలో / కబేళాలను సైతం కన్నవాడతడే / లాఠీలెత్తిన కరకు చేతులకు / రోటీలందించిన కరుణామయుడతడే’ అంటూ మూలాల్ని ఎత్తిచూపారు బొల్లినేని నాగార్జున సాగర్. ‘పాడికోసం.. పంట కోసం../ ఈ దేశపు పచ్చని భవిష్యత్ కోసం / కట్టలు తెంచుకున్న రైతు ప్రవాహం’ అంటూ రైతు ఉద్యమ ఆంతర్యాన్ని బయటపెట్టారు డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి. కవి ఎప్పుడూ కర్షకుని పక్షాన నిలబడతాడనే భావంతో ‘నీ కలం గళం హలానికే అర్పితం / కార్మిక కర్షక శ్రామిక జనానికే అంకితం’ అంటూ డా॥ పూసల రజనీ గంగాధర్ కవిత రాశారు. ‘పేరుకు రైతుగా రెండక్షరాలే కానీ / నిలబడితే నేల ఆకాశం కలిసిపోతాయి’ అంటూ రైతుల బలాన్ని ఎత్తిచూపారు డా॥ కె.జి. వేణు.

‘దేశంలో కాషాయ పాలనది కొంగ జపమేనని తేలిపోయింది/ పాలకుల కార్పొరేట్ శక్తులు / చేతుల్లో కీలుబొమ్మ లేనని తేటతెల్లమౌతుంది’ అంటూ ఏ కారణంగా అన్నదాత ఆయువుపట్టు మీద దుష్టచట్టాల సమ్మెట దెబ్బలు పాలకులు వేస్తున్నారో వివరించారు కొండ్రెడ్డి తన కవితలో. ‘కుబేరుల లాభార్జన కొరకు / రైతుల బలిదానం తగదు / కూర్చున్న కొమ్మను తెగనరికే / అజ్ఞానపు చేష్టలు ఈ చట్టాలు’ అంటూ విమర్శించాడు గోలి సీతారామయ్య. ‘కడుపు కాలిన రైతుకి బతుకుమీద కొడితే/ ఊరు ఊరు ఉద్యమిస్తాయి’ అంటూ హెచ్చరించాడు కె. ఈశ్వరరావు.

‘పొలాల్లో పంటల్లేవు / ఇళ్ళల్లో వంటల్లేవు / రైతు గుండెల్లో మంటలు తప్ప’ అంటూ మూడు చట్టాల మూలంగా రైతుకు వచ్చిన కష్టం వల్ల కలిగే మంటల్ని దృశ్యమానం చేశాడు ఎంఎస్.రాజు. ‘తలపాగాలు తల్వారులై / తలుపులు బద్దలు గొట్టక మునుపే / నాగళ్ళ ఘోషను చట్టబద్ధం చేయాల్సి ఉంది’ అంటూ ఎమ్వీ రామిరెడ్డి తన నిర్ణయాన్ని వ్యక్తీకరించాడు. ‘కవులెల్లరూ కూడా గాయకుల తోడా / కదలాలి ముందుకు / నూతనోత్సాహంబుతో / కదలాలి ముందుకు కడవరకు సాగుతూ’ అంటూ రైతు ఉద్యమానికి అండదండలు చివరివరకు ఇవ్వాలనే ఆకాంక్షను వ్యక్తీకరించాడు బంగారు వి.బి.ఆచార్యులు.

ఈ విధంగా రైతు ఉద్యమానికి ఊపందించే విధంగా కవులు కలాలు కదిపారు. అరసం పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఈ సంకలనాన్ని ప్రచురించింది. ■

## ఈ ప్రయాణం గురించి ...

**నాడు :**

**కు**రుస్తున్న ఎర్రని ఎండలో
కిచకిచల పల్లవులతో
గింజలను ఏరుకోవడం
కిటికీ అవతల ప్రపంచంలోని
సీతాకోకల రంగులను
చూపుల చేతులు చాచి హత్తుకోవడం

పెదవి పలుకుల  చినుకులలో తడుస్తూ
యుగాలను క్షణాలుగా తర్జుమా చెయ్యడం
పచ్చడి మెతుకులతోనే
ప్రతి క్షణాన్ని పండుగ దినంగా నిర్మించడం
ఇరుకు గదుల నిండా
నవ్వుల నక్షత్రాలను పోగేసుకోవడం


తిరగేస్తే చాలు
గతపు అనుభూతుల ఆల్బం పూల నదై
మనసును పరిమళాలలో
ముంచి తీస్తూ ఉంటుంది!

**ఈనాడు :**

**ము**ఖాలను రహస్యంగా కప్పెట్టి
అపరిచిత విశాల మైదానాల్లో
స్వేచ్ఛగా సంచరిస్తూ ఒంటరిగా ఉక్కిపోవడం
నాలుకపై వేవేల రుచులను నానబెట్టినా
హృదయమంత చేదు పురి విప్పడం
లోపల తడిని ఎండబెట్టి
పొడిపొడి మాటలను రాల్చడం
వైఫై తీగలను పట్టుకుని
ప్రేమశబ్దపు వెతుకులాటలో
వర్చువల్ పురుగుల్లా పాకడం
పులకరింతలు రేపని
పలకరింపుల మేఘాలతో
నల్లని ఆకాశాలను భుజాలపై మోస్తూ
నిత్యం గాజునదితో ఈ ప్రయాణం

ఇప్పుడు అనుమానమొస్తోంది
ఇంతకీ నేను మనిషినా యంత్రాన్నా ..?

**- పద్మావతి రాంభక్త**
**99663 07777**



# కవి ఆశయం, ఆచరణ ఒకటవ్వాలి

## కేంద్ర సాహిత్య అకాడెమీ కన్వీనర్, ప్రముఖ కవి కె.శివారెడ్డి

**నమస్కారం శివారెడ్డి గారూ.. నా పేరు టేకుమళ్ళ వెంకటప్పయ్య, విజయవాడ. మిమ్మల్ని కలుసుకోవడం, సాహిత్య ప్రస్థానం తరఫున ఇంటర్వ్యూ తీసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది.**

**శివారెడ్డి :** సంతోషం. చెప్పండి.

**మొదటగా.. మీ బాల్యం గురించి... అప్పట్లో మీ ఆసక్తుల గురించి నాలుగు మాటలతో ఈ ముఖాముఖి ప్రారంభిద్దాం.**

**శివారెడ్డి :** (నవ్వుతూ) అలాగే! మాక్సింగోర్కీ అన్నట్టు– నాది బాల్యం లేని బాల్యం. నేను గుంటూరు జిల్లా కార్మూరు వారి పాలెంలో జన్మించాను. నా ఏడేళ్ల వయసులో మా తల్లి గారు క్షయవ్యాధితో మరణించారు. మా తండ్రి ఆస్తులను అమ్మి చాలా మంచి వైద్యం చేయించినప్పటికి మా అమ్మ దక్కకపోవడం నా దురదృష్టం. 'చులకన జలరుహ తంతువు.. చులకన మరి తల్లి లేని సుతుడు కుమారా!' అని అని అనంతామాత్యుడు భోజరాజీయంలో ఆవు దూడకు బోధించిన నీతి నాకూ వర్తిస్తుందనుకుంటాను. మా నాన్న పునర్వివాహం చేసుకోకుండా తానే తల్లి పాత్ర కూడా పోషించి నన్ను పెద్దవాణ్ణి చేశారు. మా నాయనమ్మ, బాబాయి కూడా నా ఎదుగుదలకు ఎంతో సహాయం చేశారన్నది వాస్తవం. కూచిపూడిలో హైస్కూలు విద్య, తెనాలితో పియుసి చదివాను. ఉన్నత విద్య ఆంధ్రా విశ్వవిద్యాలయంలో సాగింది.

**మీ ఇంట్లో సాహిత్య నేపథ్యం ఉండేదా? మీకు కవిత్వం ఎలా అబ్బింది?**

లేదు. సంగీతం మాత్రం ఉండేది. మా నాన్నగారు వ్యవసాయం చేసేవారు. ఆయన కఱ్ఱసాములో గొప్ప నేర్పరే కాకుండా, ఆయనకు వంశపారంపర్యంగా వచ్చిన సంగీత నేపథ్యం వల్ల వారు సత్య హరిశ్చంద్ర, రామదాసు వంటి నాటకాలు ఆడడం, పద్యాలు రాగయుక్తంగా అద్భుతంగా పాడడం ఉండేది. నేను కూడా పియుసిలో రెండు వేల మంది ఉన్న కాలేజీ వార్షికోత్సవంలో సత్య హరిశ్చంద్రలో కాటిసీను వేసి ప్రశంసలు పొందాను. మంచి కంఠం ఉందని నాటకాలు కొనసాగించమని పెద్దలు, గురువులు చెప్పారు. నేను అసలు గాయకుణ్ణి అవాల్సింది. నా అనాథ జీవితానికి ఆదిగా సంగీతం ఆసరాగాను, ఉపశమనంగాను అయింది. నేను ఎక్కడో ఒక పుస్తకంలో ముందుమాటల్లో చెప్పుకున్నట్లు 'సంగీతం నా తల్లయింది.. నా తండ్రయింది'. నాటకం రసాత్మక కావ్యం కదా! అలా సంగీతంతో ప్రారంభమైన నా ప్రస్థానం సాహిత్యంతో సమ్మిశ్రితమై, ఉత్తరోత్తరా కవిగా కావడానికి, స్వంత గొంతుతో, మంచి అభివ్యక్తితో, సాగడానికి సాహిత్యం దోహదమయిందనుకుంటున్నాను.

**మీ తొలి కవిత గురించి ...**

నా తొలి రచన పద్యాలే. నా 23 పద్యాలు మా కాలేజీ

వార్షికోత్సవ పత్రిక (మ్యాగజైను)లో అచ్చయ్యాయి. నేను ఆంధ్రాంగ్ల భాషల్ని చాలా పట్టుగా నేర్చుకున్నాను. మాకు ప్రబంధాలు, బాల ప్రౌఢ వ్యాకరణాలు, అలంకార శాస్త్రం, అప్పకవీయం వంటి పుస్తకాలు సిలబస్‌లో ఉండేవి. అవన్నీ పరీక్ష కోసం కాకుండా ఇష్టంగా అభ్యసించాను. తొలి రచన అచ్చులో చూసుకోవడం ఆ వయసులో ఎవరికైనా ఆనందమే కదా! అలాంటి అనుభూతే నాకూ కలిగింది.

**కవిత్వం ఇలా ఉండాలి అనే దానిపై మీ అభిప్రాయం?**

కవిత్వంపై అభిప్రాయాలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. కాలానుగుణంగా మారుతూ ఉంటాయి. మొదట్లో పల్లెలో ఉన్నప్పటి వాతావరణం, ఆ అభిప్రాయాలు వేరు. పెద్దయ్యాక హైదరాబాదు వచ్చి ప్రపంచాన్ని దగ్గరగా చూసి, మార్క్సిస్టు సిద్ధాంతాలను, గతితార్కిక సిద్ధాంతాలను అధ్యయనం చేశాక ఏర్పడిన అభిప్రాయం వేరు. ముందు మధ్యతరగతి తత్త్వం ఉండేది. నా ముందు ఎందరో మహాకవులు అద్భుత కవిత్వాన్ని వెలయించారు. ప్రజల కోసం, మట్టికోసం, సమాజం కోసం ఆలోచించి ప్రాపంచిక దృక్పథం మారాక 'రక్తం సూర్యుడు' రాశాను. అన్ని దేశాల రచనలను చదివాక, ప్రాపంచిక దృక్పథం మారింతర్వాత 'కంపోజిషన్ ఆఫ్ సొసైటీ' అర్థం అయ్యాక నా అభిప్రాయాలు మారినై. ఈ అభిప్రాయాలు అనేవి ఎప్పుడూ గడ్డ కట్టుకుని ఉండడం జరగదు. కాలానుగుణంగా విస్తృతి మారుతుంది. ఒకప్పటి మెకాలే విద్యావిధానం గుమాస్తాలను తయారు చేయడం అనుకుంటే ఇప్పటి విద్యను 'కార్పొరేట్ దాస్యం'గా భావించ వచ్చు. నువ్వు గమనిస్తే నా 'రక్తం సూర్యుడు' కాలంనాటికి ఈ మధ్య వచ్చిన 'కొంచెం స్వేచ్ఛ కావాలి' కాలంనాటికి కవిత్వంపై ఉన్న అభిప్రాయానికి తేడా స్పష్టంగా గమనించవచ్చు. కాలానుగుణంగా కవిత్వం ఎప్పుడూ మారుతూనే ఉంటున్నది. ఆయా కాలమాన పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఉంటుంది నా కవిత్వం.

**కవి వైయక్తిక జీవితానికి, ఆ కవి రాసే కవిత్వానికి సంబంధం తప్పనిసరిగా ఉండాలంటారా?**

ఉండి తీరాలి. కవిత్వం మొదట కవిని శుద్ధి చేయాలి. కవి ఆశయం, ఆచరణ ఒకటవ్వాలి. కవిత్వం, కవి జీవితం వేరు వేరు అంటే కుదరదు. అది శుష్కమైన కవిత్వం అవుతుంది. జీవం ఉట్టిపడదు. కనుక తప్పక కవి జీవితానికి కవిత్వానికి సంబంధం ఉండాలి.

**మీరు 1973లో వచ్చిన 'రక్తం సూర్యుడు' మొదలుకొని ఇప్పటివరకు దాదాపు అనువాదాలతో సహా 30 గ్రంథాలు పైన వెలువరించారు. వీటిలో మీకు నచ్చినదీ.. సదా గుర్తొచ్చే గ్రంథం ఏమిటి?**

అలా చెప్పడం కష్టం. నా కవిత్వం పరిణామశీలమైనది. నా పరిణామ క్రమం పరిశీలిస్తే, ఆయా పుస్తకాలు ఆయా కాలాల్లో వచ్చిన సామాజిక, ఆర్థిక సంక్షోభాలను ప్రతిబింబించినై. నా కవిత్వానికి 'భారమితి' ఒక మలుపు. భారమితి నుంచీ సంక్షిప్తీకరణ మొదలైంది. చెప్పదలుచుకున్నది క్లుప్తంగా హత్తుకునేట్టు చెప్పడం అనే విధానం మొదలైంది. నా కవిత్వ పరిణామంలో వస్తురూపంలో మార్పు వచ్చింది. పఠితకు, శ్రోతకు ఉన్న సంబంధం మారుతూ వచ్చింది. కవిత్వంలో వస్తువు మారుతుంది. శైలి మారదు. కానీ భాష మారాలి. వ్యక్తీకరణ, భాషలు మారాలి. 'కంటెంట్ ఈజ్ రివొల్యూషన్ బట్ ఫార్మ్ ఈజ్ కన్సర్వేటివ్' అన్నట్టు 'రక్తం సూర్యుడు' నుంచి 'కొంచెం స్వేచ్ఛకావాలి' వరకూ అన్నీ మంచివే! ఆయా కాలాల్లో రాదగ్గ రచనలు.

**2019లో వచ్చిన మీ 'కొంచెం స్వేచ్ఛకావాలి'లో కొంతమంది రాజకీయ నాయకులను పేరుతో సహా ఉటంకించారు గదా! ఆ విషయమై మీరు ఎప్పుడైనా అలా రాయకుండా వుండాల్సింది అని ఫీలయ్యారా?**

లేదు. ఎప్పుడూ లేదు. నేను కావాలనే అలా రాశాను. కనుక ఆ చింతే నాలో లేదు.

**'కొంచెం స్వేచ్ఛ కావాలి' పుస్తకంలో 'అతనలానే' అనే కవితలో 'సర్వం జీర్ణించుకునే వాతాపి జీర్ణం విదురుడు' అన్నారు. వాస్తవానికి అక్కడ అగస్త్యుడి ప్రస్తావన రావాలి కదా.. విదురుడు అనడంలో ఏమైనా ప్రత్యేకత ఉందా?**

ఉంది కనుకనే అలా రాయడం జరిగింది. దాన్నే 'మ్యాజిక్ – కవిత్వం' అంటారు. అగస్త్యుడు పురాణ పురుషుడు 'వాతాపి జీర్ణం' అన్నవాడైనా, విదురుడు నీతి కోవిదుడు. మంచీ చెడూ చెప్పేవాడు. మనం ఒరిజినల్ కోణంలో కాకుండా మరో కొత్త కోణంలో, విదురుని ద్వారా ఆ విషయాన్ని చూడాలని విదురుని ప్రస్తావన తేవడం జరిగింది. అదో కొత్త కోణంగా చూడాలి తప్ప అగస్త్యుడి ప్రస్తావన మళ్ళీ ప్రత్యేకంగా అవసరం లేదు.

**మీ కవిత్వం విముక్త శైలి అని, వక్తృత్వ శైలి అని విమర్శకులు అనడం విన్నాను. ఇంతకీ మీ శైలి, పథం ఏమిటనేది మీ ద్వారా వినాలని ఉంది.**

మొదటగా విముక్త శైలి అంటే ఏమిటంటే 'విముక్తః పరిత్యక్తః స్వతంత్రః' అని సంస్కృతంలో అంటారు. విముక్త అంటే వదిలిపెట్టబడినది అనే కాకుండా స్వతంత్రత అనే అర్థం కూడా ఉంది. ఈ కవిత్వానికి సూత్రాలు, నిబద్ధత, చట్రాలు ఏమీ ఉండవు. అంటే లిబరేట్ అవడం. ఇలా కవిత్వం

రాయడం చాలా కష్టం. దీని నిర్మాణం కష్టతరమైనది. నా కవిత్వంలో ఏ కవితల్లోనో ఇలాంటి నిర్మాణం చూసిన విమర్శకులు అన్న మాట అది. ఇక వక్తృత్వ శైలి అంటే నా 'మోహనా..మోహనా' లాంటి శైలి అన్నమాట. వక్తృత్వం అంటే బాగా మాట్లాడడం, ప్రాగల్భ్యము, ప్రసంగ చాతుర్యము లాంటి కవిత్వం అన్నమాట. ఇక్కడ కవికి, శ్రోతకు దూరం ఉండదు. బాగా దగ్గరై హృదయంలోకి సరాసరి చొచ్చుకుపోయే కవిత్వం అన్నమాట. నా కవిత్వంలో అన్ని పార్శ్వాలు సూక్ష్మ పరిశీలన చేసిన విమర్శకులు అన్న విశేషణాలు ఇవన్నీ.

**మీ కవిత్వం రూపపరంగా విట్మన్ ప్రజాస్వామిక మార్గమని, వస్తురూపంగా రాజకీయ భావజాలంతో ఉన్న పాబ్లో నెరుదా మార్గమని, ఒక విమర్శకుడన్న దానితో మీరు ఏకీభవిస్తారా?**

విమర్శకుడూ పాఠకుడే కదా! వారి అభిప్రాయం అది. నా మటుకు నాకు విట్మన్ కంటే నెరుదా మార్గం కొంత ఉందని నేననుకుంటాను. సముద్రం నెరుదా కవిత్వంలో అంతర్భాగం. అందుకే ఆయన్ను సముద్ర కవి అని కూడా అంటారు. అంటే ఆ ప్రకృతి అవన్నీ నాకు బాల్యం నుంచి తోడుగా వెంట ఉన్నాయి కదా. నా కవిత్వంలో కూడా ఈ విధానం కొంత సహజంగా ఉంటుంది.

**రక్తం సూర్యుడు దగ్గర నుండి అంతర్జనం వరకూ చూస్తే శివారెడ్డి పరిణామక్రమం కొన్ని దశలుగా సాగింది. మీరు విమర్శలను మౌనంగా పరిశీలిస్తూ.. మీ బాటలను మార్చుకుంటూ వచ్చారనిపిస్తుంది. వయసుతో పాటు అప్పుడున్న విప్లవ కవిత్వ ధోరణి సన్నగిల్లి సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను ఎత్తిచూపే దిశగా ప్రస్తుతం సాగుతోందని అనుకుంటున్నాను. మీరేమంటారు?**

నా పరిణామక్రమం రక్తం సూర్యుడు నుంచి కొంచెం స్వేచ్ఛకావాలి వరకూ అధ్యయనం చేస్తే ఎన్నో పరిణామ దశలు. నేను ఇందాక చెప్పినట్లు భారమితి ఒక టర్నింగు పాయింటు. కొత్త వస్తువు వస్తే కొత్త భాష. శైలీగత మార్పులు సహజంగా జరుగుతూ వచ్చాయి. చాలా మంది కవులు కొత్త భాషను వాడడంలో విఫలమవుతూ ఉంటారు. వస్తువు మారినప్పుడల్లా కొత్త భాష, కొత్త కొత్త ఉపమానాలు అన్నీ రావాలి. పాత తరం కవులు చాలామంది కనుమరుగైంది ఇందుకే! వేగాన్ని అందిపుచ్చుకుని దౌడు తీయాలి. మారుతున్న కాలంతో పాటు వస్తురూపాల పరిధులను విస్తరించుకుంటూ పోవడమే కవి చేయాల్సిన పని. వ్యక్తీకరణ పద్ధతుల్లో నూతనత్వాన్ని సాధించగలగాలి. కవిత్వంలో మారిన పదాల్ని, పదబంధాలను వదిలేసి కవి ఎప్పటికప్పుడు ఒక కొత్త భాషను కవిత్వంలో ప్రవేశపెట్టడమే పరిణామం. కాలానుగుణ కవిత్వాన్ని రాశానని చెప్పగలను. ఇవన్నీ నా సహజ పరిణామంలో నేను సాధించానని భావిస్తున్నాను.

**పూర్వం కవులుగా గుర్తించాలంటే భారతి లాంటి పత్రికల్లో కవితలు అచ్చయి ఉండాలనే వారు. నేటి ప్రమాణం ఏమిటి?**

పాత కాలానికి ఇప్పటి కాలానికి చాలా తేడా ఉంది. ఈనాడు ప్రపంచం చాలా విశాలమయింది. విస్తృతమై పోయింది. విశ్వ కుగ్రామం కదా! పూర్వం కవులు పదులు లేక వందల సంఖ్యలో మాత్రమే ఉండేవారు. ఇప్పుడు మనుషులతో పాటు కవులూ పెరిగారు. అప్పట్లో లాగా కవిత్వం ప్రచురణకు నెలలూ, సంవత్సరాలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఇప్పుడు లేదు. కవిత్వం రాసే ప్రతి కవి రాయగానే వాట్సాప్‌లోనో, ఫేసుబుక్‌లోనో, కవిసంగమం లాంటి చోటో, వారి సొంత బ్లాగుల్లోనో పెడుతున్నాడు. వాటి నాణ్యత వగైరా పక్కన పెట్టి చూస్తే, రాసిన వెంటనే కవిగా చెలామణి అయిపోతున్నారు. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే.. కవికి ఆత్మ విమర్శ చాలా ముఖ్యం. తాను గతం కంటే మెరుగైన కవిత్వం రాస్తున్నాడా? అవిచ్ఛిన్నత, నిర్మాణం, శైలి, భావచిత్రాలు, ప్రతీకలు అన్నీ రూపుదిద్దుకున్న కవిత్వమా? కేవలం వచనమేనా? అనే విషయాలన్నీ కవి స్వయంగా అధ్యయనం చేసుకోవాలి. నేను అనేక సభల్లో చెప్పినట్లు ఇతరుల కవిత్వం చదవాలి. నిరంతరం తన్ను తాను పునర్నిర్మాణం చేసుకొనే దిశగా సాగాలి. అందుచేత మారిన కాలం దృష్ట్యా ఆ కాలాన్ని ఈ కాలంతో పోల్చడం కుదరదని నా అభిప్రాయం.

**కేంద్ర సాహిత్య అకాడెమీ కన్వీనర్‌గా మీ పాత్ర చాలా ప్రశంసనీయమైనది. బయటి దేశాల్లో ఉన్న సాహిత్య అకాడెమీల కంటే మనదేశంలో ఉన్న అకాడెమీకి బాధ్యత ఎక్కువని నా భావన. అన్ని దేశాల్లో 2, 3 భాషలుంటే మనదేశంలో ఉన్న 24 భాషల్లో ఈ అవార్డులు ఇవ్వడం కష్టసాధ్యం కదా?**

నిజమే! అయినప్పటికి, ఇతర దేశాలతో మన దేశాన్ని పోల్చడం సరికాదు. మన దేశంలో ఎన్ని మతాలు, ఎన్ని కులాలు, ఎన్ని భాషలున్నాయి? 'యూనిటీ ఇన్ డైవర్సిటీ' సాధిస్తున్న దేశాల్లో మనకు ప్రథమస్థానం ఉంది. రాజ్యాంగం గుర్తించిన అన్ని భాషలను గౌరవించి పురస్కారాలు ప్రదానం చెయ్యాల్సిన బాధ్యత అకాడెమీకి ఉంది. 60, 70 ఏళ్ల నుంచి ఈ ప్రక్రియ సాగుతూ ఉంది. మొదట్లో కొన్ని భాషలే ఉన్నా తర్వాత మరికొన్ని కలిశాయి. కమిటీలు, ఎన్నో వడపోతలు, జ్యూరీ మెంబర్లు ఎంతో కష్టమైన కార్యాన్ని మోస్తున్నది సాహిత్య అకాడెమీ.

**సాహిత్య అకాడెమీ ఎన్ని కమిటీలు వేసినా ఎప్పుడూ ఏదో ఒక వర్గం వారు పురస్కారాలు పారదర్శకంగా లేవని, సిఫారసుల ద్వారానే పురస్కారాలు దక్కుతాయని చేస్తున్న ప్రచారంలో వాస్తవం ఉందంటారా?**

చూడండి. అకాడమీలో జ్యూరీ మెంబర్లు ఉంటారు. ఓటింగ్ పద్ధతి నడుస్తుంది. ప్రభుత్వం దీనికి ధన సహాయం చేస్తున్నప్పటికి వాళ్ళ ప్రమేయం ఏ మాత్రం ఉండదు. జ్యూరీ కమిటీ సిఫారసుల మేరకు అవార్డు నిర్ణయం జరుగుతుంది. ఇక వివాదాలంటారా.. ఎప్పుడూ వారికిచ్చారని వీరు.. వీరికిచ్చారని వారూ అనడం సహజం. ఈ వ్యతిరేక అభిప్రాయాలు ఎప్పుడూ ఉండేవే! నూటికి నూరుపాళ్ళు అర్హమైనవాటికి మాత్రమే పురస్కారాలు వస్తున్నాయని నా దృఢ అభిప్రాయం.

**ఒక కవిని గొప్పకవిగా గుర్తించడానికి అకాడెమీ పురస్కారమే కొలబద్దగా భావించడం సమంజసమంటారా?**

అకాడెమీ అవార్డు కొలబద్దగా తీసుకోవడం సరికాదు. అవార్డు రాని ఎంతోమంది గొప్ప కవులు ఉన్నారు. ఉదాహరణకు వాసిరెడ్డి సీతాదేవి గురించి చెప్పుకోవచ్చు. అవార్డు వస్తేనే గొప్పని, రాకపోతే మంచి కవి కాదని ఉండే అభిప్రాయమే తప్పు.

**ప్రపంచ స్థాయిలో వస్తున్న కవిత్వం ముందు మన తెలుగు సాహిత్యం స్థానం ఏమిటి?**

కచ్చితంగా ముందు వరసలోనే ఉంటుందని అనుకుంటున్నాను. నేను అనేక ప్రపంచ దేశాల సాహిత్యాలను అధ్యయనం చేశాను. బ్రెజిల్ మొదలైన దేశాల్లో పర్యటించి నప్పుడు, అనేక దేశాల్లో నేను మన కవిత్వం చదివినప్పుడు హర్షామోదాలు, అద్భుత స్పందన చూశాను. అందుకనే తెలుగు కవి ఎక్కడైనా తలెత్తుకుని తిరగొచ్చని చెప్తున్నాను. మనకు గొప్ప స్థానమే ఉంది.

**రవీంద్రుని తర్వాత నిజంగానే నోబెల్ బహుమతి పొందే అర్హత మన తెలుగుకు గానీ, మరి ఇతర భారతీయ భాషలకు గానీ లేదంటారా?**

ఉన్నారు. నా ఉద్దేశంలో అన్ని భాషల్లో కలిపి కనీసం ఏభై మంది అర్హులన్నా ఉంటారు. నోబెల్ బహుమతికి చాలా పెద్ద ప్రాసెస్ ఉంది. అవన్నీ దాటుకుని రావడం అంత సులభం కాదు. రానంత మాత్రన పోయిందేమీ లేదు.

**కబీర్ సమ్మాన్, సరస్వతి సమ్మాన్ వంటి ఎన్నో అరుదైన పురస్కారాలను పొందిన మీకు ఇంకా ఏదైనా సాధించాలన్న ఆశయం ఉందా?**

ఇంకా ఏవో అవార్డులు సాధించాలని కాదు నా ఆశయం. మంచిగా, కవిగా బతికుండాలని ఉంది. కవిత్వం ఇంకా రాయాలని ఉంది. మనుషులను ప్రేమించాలని, క్షమాగుణంతో ఉండాలని ఉంది. తుది వరకూ రాస్తూనే ఉండాలన్నదే నా ఆశయం.

**చివరిగా ఒక ప్రశ్న. కొత్తగా కలం పట్టే వారికి, వర్ధమాన కవులకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

మంచి సాహిత్యం చదవాలి. నన్నయ నుండి కాకపోయినా గురజాడ నుండైనా కవిత్వం అధ్యయనం చెయ్యాలి. కవిత్వ ఎలా పరిణామం చెందుతుందో గుర్తెరిగి రాయాలి. మీ కవిత్వమే కాకుండా సమకాలీన సాహిత్యం చదవండి. ఎప్పటికప్పుడు మీ భాషా పనిముట్లను పదును పెట్టుకుంటూ ఉండండి. ఎప్పుడూ మూసకవిత్వం రాసుకుంటూ ఒక ఛట్రంలో మిగిలిపోకుండా పరిణామం చెందండి. రాత్రికి రాత్రే కవి అయిపోవాలని, గుర్తింపు పొందాలన్న తపనతో కాకుండా కవితాతృష్ణతో కవిత్వం రాయండి. అవిచ్ఛిన్నంగా కృషి చెయ్యాలి. అవార్డుల కోసం పాట్లు పడకుండా మీ కర్తవ్యం మీరు చేసినట్లైతే.. మంచి కవులను కాలం ఎన్నడూ విస్మరించదని తెలుసుకోవాలని చెప్తాను.

**వెంకటప్పయ్య :** చాలా సంతోషం సార్. ధన్యవాదాలు

**(డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య మొబైల్ నెం.94904 00858)** ■



## పొలికేక

చీకటి గర్భంలోంచి
ఒక వేకువ రేఖ!
మండే అడవి ..
మైదానానికి వినిపించిన పొలికేక!
వస్తారా, ఎవరైనా ..
నాతో పాటే గిరిజన తండాల్లోకి ..
కొండల మీద నెగళ్లను
జనం గుండెల్లో రగిలించటానికి ..!

**- సిరికి స్వామినాయుడు**

**94940 10330**

కవిత

## మార్గ మధ్యంలో ...



ఆంగ్ల మూలం :

**మహమ్మద్ షానజర్,** పాకిస్థాన్

అనువాదం :

**డాక్టర్ పెరుగు రామకృష్ణ,** ఇండియా

**అ**మ్మా..! దయచేసి నన్ను అందుకోండి
నేను ఇక నడవలేను
నా బూట్లు నన్ను బాధిస్తున్నాయ్!
అమ్మా! ఏడవ్వద్దు
నేనూ ఏడవడం లేదు
నా చెంపల మీద కన్నీళ్లు మాత్రమే వస్తున్నాయ్

అమ్మా! మనం ఎక్కడికి వెళ్తున్నాము?
నాకు తెలిసే వయసు వచ్చింది
నువ్వు తిరిగి రాలేదు
అమ్మా! మీరు ఇంటి తలుపులు మూయలేదు
అవును .. మీరు మంచి పని చేసారు
మూయాల్సిన అవసరం లేదు
గోడలన్నీ కూలిపోయాయ్ కదా!

అమ్మా! మీకు గుర్తు ఉందా?
నువ్వు వెంట తీసుకోలేదు
నా టెడ్డి – బేర్ మరియు నా బొమ్మ
వాళ్ళు సోఫాలో పడుకునే ఉన్నారు
అమ్మా! ఎంత బాధగా ఉంది!
మనం చిలుకల పంజరం విప్పలేదు
అవి ఇప్పటికీ అక్కడే ఉన్నాయి
వాటికి ధాన్యం, నీరు ఎవరు ఇస్తారు?

అమ్మా! మా నాన్న ఎక్కడ?
అతను మన వెనకాలే వస్తున్నాడన్నావ్
జానపదులు గుసగుసలాడుకున్నారు
అతను వీధిలో పడుకున్నాడు,ట్యాంక్ పక్కన
మరికొందరు కూడ పక్కనే పడుకున్నారని
వారు పడకలపై ఎందుకు నిద్రపోరు, విశ్రాంతి తీసుకోరు?

అమ్మా! ఇప్పుడు ఎందుకు ఏడుస్తున్నావు?
కన్నీళ్లు మీ చెంపల మీదుగా ప్రవహిస్తున్నాయ్
నన్ను చూడు, నా ఒళ్ళు జలదరిస్తుంది
వారి ఇష్టానుసారం చేయనీయ్
కానీ నేను ఏడవను
మీరు నాకు గుడ్ బై చెప్పమని చెప్పినా ..
నేను ఆడిన నా ఇల్లు, వీధులు పొగబారినా
మనం అందులో మళ్ళీ వెలుగు చూస్తామనే ఆశిస్తున్నాను!

## వాసా ప్రభావతి స్మారక కథల పోటీ

**వా**సా ఫౌండేషన్, సాహితీ కిరణం సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీ నిర్వహిస్తోంది. కథ ప్రస్తుత సమాజ స్థితిగతులను ప్రతిబింబించేలా ఉండాలి. ఈ పోటీలో ప్రథమ బహుమతి రూ. 5000, ద్వితీయ బహుమతి రూ. 2500, ఐదు కథలకు ప్రత్యేక బహుమతులు రూ. 1000 చొప్పున ఉంటాయి. కథ రాతప్రతిలో ఎ4 సైజులో (తెల్ల కాగితం) నాలుగు పేజీలకు, డిటిపి అయితే మూడు పేజీలకు మించరాదు. కథలు పోస్టు/ కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. కథలు చేరవలసిన ఆఖరు తేది : 30.4.2022. చిరునామా : సాహితీకిరణం, ఇం.నెం. 11-13-154, అలకాపురి, రోడ్డు నెం. 3. హైదరాబాద్-500102 సెల్: 94907 51681

**– పొత్తూరి సుబ్బారావు,**
**సాహితీ కిరణం సంపాదకులు.**

కథ



# లచ్చి

- రాజాబాబు కంచర్ల
94900 99231

**ఉ**దయం 9 గంటలు అవుతోంది. తెల్లవారు జామునుంచే పడుతోన్న సన్నని వర్షంతో రోడ్డంతా చిత్తడి చిత్తడిగా వుంది. అయినా రద్దీగానే వుంది. నగరంలో అదో పేరుమోసిన స్లమ్ ఏరియా. అక్కడ నివసించే మహిళల్లో అనేక రకాల వృత్తుల వాళ్లున్నారు. వాళ్లందరిలో కాస్తో కూస్తో చైతన్యం నింపి... 'ఈ సమాజంలో మీరూ భాగమే, ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలనూ మీరు వాడుకోండి, అభివృద్ధి చెందండి' అంటూ వాళ్ల అస్తిత్వాన్ని వాళ్లకు గుర్తు చేస్తుంటుంది దేవి. ఇక్కడి అంగన్వాడీ స్కూల్లో ఏర్పాటు చేసిన మీటింగ్‌కు రమ్మని, ఇంకో ఇద్దరు మహిళా కార్యకర్తలతో కలిసి ఆ పేటలోని గడపగడపను తట్టి, మహిళలందరికీ కరపత్రాలు పంచుతూ ముందుకు సాగిపోతోంది. రోడ్డు పక్కన టీ బంకుల్లో చేరిన పోకిరీ రాయుళ్ల వెకిలి మాటలను, చేస్తున్న కామెంట్లను విననట్టుగా తన పని తాను చేసుకుపోతోంది. ఈ క్రమంలో వెకిలిగా కామెంట్ చేసిన ఒకడికి గట్టి వార్నింగ్ ఇచ్చింది. అక్కడి మహిళలంతా ఆమె ధైర్యానికి ఆశ్చర్యపోయారు. దేవితో పాటు వచ్చిన కార్యకర్తలయితే ఒకింత భయపడ్డారు. ఎలాంటి బెదిరింపులకు అదిలింపులకు జడవకుండా మహిళలందరినీ మీటింగ్‌కి రమ్మని ఆహ్వానిస్తూ... అంగన్వాడీ స్కూలుకు చేరుకుంది దేవి బృందం.

ఇక్కడ మీటింగ్ ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగం లేదని అంటున్న స్థానిక సేవాసంస్థ నాయకుల అంచనాలను తల్లకిందులు చేస్తూ... చాలామందే హాజరయ్యారు. 'మన సామాజిక నిర్మాణం, సాంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆంక్షలు మహిళల ఆత్మగౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని దారుణంగా దెబ్బతీస్తున్నాయి. సామాజిక దురాచారాలు, కట్టుబాట్లు, మూఢనమ్మకాలు మహిళల్ని అణగదొక్కుతున్నాయి. ఏ వృత్తిలో వున్నా, ఇష్టమున్నా లేకపోయినా కొన్ని పనులు ఎంచుకుంటాము. ఎల్లకాలం అవే పనులు, అదే వృత్తి చేయాలని లేదు. మోసపోయిన, దగాపడిన మహిళలను ఆదుకునేందుకు, వారికి సరైన తోవ చూపేందుకు మా సేవా సంస్థ తోడ్పాటు నిస్తుంది. మీకు తోడుగా వుంటుంది. తాగుడు, వ్యభిచారం, జూదం వంటి వ్యసనాల నుండి బయటపడి, మీ పిల్లలను చక్కగా చదివించుకోండి. మీ సమస్యల గురించి మీరే ఈ వేదికపైకి వచ్చి మాట్లాడొచ్చు. ఇక్కడ చెప్పలేని వాళు మా ఆఫీసుకొచ్చి కూడా చెప్పొచ్చు. కొత్త జీవితం ప్రారంభించాలనుకునే ఎవరికైనా మేము తోడుగా వుంటాము' అంటూ అక్కడికొచ్చిన మహిళలందరినీ ఉత్తేజపరిచేలా మాట్లాడింది దేవి.

మీటింగ్ అనంతరం తిరిగి వెళుతోన్న దేవి బృందం వున్న ఆటో పేట చివరికి చేరుకోగానే, అప్పటివరకూ రోడ్డుపక్క చెట్టు కింద నిల్చున్న ఓ యువతి 'దేవక్కా... అని పిలుస్తూ... ఆటోకు అడ్డుగా వచ్చింది. వయస్సు 18 ఏళ్లు వుంటాయి. నలుపు రంగు. చక్కని ముఖ వర్చస్సు. పెద్దపెద్ద కళ్లు.

'చెప్పమ్మా... నీ పేరేంటి? ఏంటి నీ సమస్య?' అడిగింది దేవి.

'అక్కా... మరీ... నా కొడుకుని నాకు ఇప్పించండి. మీ కాళ్లు మొక్కుతా...' అంటూ దేవి కాళ్లను చుట్టేసింది.

అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకు దేవి బృందం కాస్త కంగారుపడినా, వెంటనే తేరుకుని, ఆ అమ్మాయిని పైకి లేపుతూ... 'ఎవురు నువ్వు? నీ కొడుక్కేమైంది? చెప్పమ్మా... మాకు చేతనైనంత సాయం చేస్తాం' అని ఆమె భుజం తడుతూ ధైర్యం చెప్పింది దేవి.

పొంగుకొస్తున్న దు:ఖాన్ని పంటిబిగువున నొక్కిపడుతూ... 'అక్కా అదంతా ఓ పెద్ద కథ. నా కొడుకుని నాకు ఇప్పించండి. మీ మేలు జన్మలో మర్చిపోను' అంటూ బావురుమంది.

'నీకేం ఫర్వాలేదు. మేమంతా అండగా వుంటాం. ఏం జరిగిందో చెప్పు...' అంటూ పక్కనే వున్న చెట్టుకిందకు వెళ్లారు.

ఆ యువతి కన్నీరు... ఉదయం నుండి ఆగకుండా పడుతోన్న వర్షపు జల్లులా కురుస్తూనే వుంది. ఆమె మనసు గత జ్ఞాపకాల జడిలో కొట్టుకుపోతోంది.

♦ ♦ ♦

మాది చిన్న పల్లెటూరు. నా పేరు లక్ష్మి. అందరూ లచ్చి అని పిలుస్తారు. అమ్మా, నాన్న చిన్నప్పుడే పోయారు. నేను అన్నా వదినల దగ్గర వుండేదాన్ని వాళ్ల పిల్లల్ని ఎత్తుకోవడం, ఇంట్లో పనులన్నీ చేయడం నా వంతే. ఒక్కపూట పనిచేయకపోయినా వదిన సాధింపులు, తిట్లు, ఒక్కోసారి కొట్టేది కూడా. ఇంట్లో ఒక్క మంచి మాట కూడా లేదు. అన్నని బలవంతం మీద ఒప్పించి స్కూల్లో జాయిన్ అయినా.

'లచ్చిని చక్కగా చదివించాల్రా అయ్యా..' అనేది మాయమ్మ.

ఏ గుణం మీద వున్నాడోగానీ స్కూల్లో చేర్చేందుకు వదినను కూడా ఒప్పించాడు.

నేనప్పుడు 9వ తరగతి చదవుతున్నా. పొద్దున్నే లేచి మా ఊరి క్వారీ గుంటల్లో ఉండే నీళ్లతో బట్టలు ఉతుక్కురావడం నా పని. ఊర్లో పంపులుగాని, చెరువులుగాని లేవు. క్వారీ గుంటల్లోని ఎర్రనీళ్లలోనే బట్టలు జాడించి, చద్ది తిని స్కూలుకు వెళ్లేదాన్ని. రోజూ క్వారీకి వెళ్లేటప్పుడు శీను కనబడేవాడు. 'నల్లబంగారం' అని పిలిచేవోడు. అలా పిలుస్తుంటే భలే వుండేది. మా చిన్నమ్మ అనేది... 'నువ్వు నల్లగా వుంటే ఏమే... చక్కని బొమ్మలా వుంటావు' అని. అందుకే శీను 'నల్ల బంగారం' అని పిలిస్తే ఎంతో ప్రేమగా పిలుస్తున్నట్టుండేది.

'నీ కళ్లు తెల్లగా భలే వుంటాయే' అనేవోడు. 'నువ్వు నడుస్తుంటే సినిమా ఈరోయిన్ నడిచినట్టు వుంటదే' అని ప్రేమగా చూసేవోడు. ఇంట్లో ఒక్కరు కూడా అంత ప్రేమగా మాట్లాడింది లేదు. ఎప్పుడూ తిట్లు, చివాట్లే... శీను ప్రేమగా మాట్లాడుతుంటే చానా బాగుండేది. పొద్దున్నే క్వారీకి వెళ్లేటప్పుడు రోజూ పూలు తెచ్చేవోడు. రోడ్డుపక్కనే ఉన్న గుడిని చూపిస్తూ... 'చూడు.. ఆళ్లంతా ప్రాణంలేని రాతిబొమ్మకి పూలు పెడుతున్నారు. నేను ప్రాణమున్న అందాల బొమ్మకి ఇస్తున్నా... వాళ్లు గొప్పా, నేను గొప్పా...' అని నవ్వేవోడు. సాయంత్రం స్కూలు నుండి వచ్చేటప్పుడు బజ్జీలు తెచ్చేవాడు నాకు ఇష్టమని. ఆడితో మాట్లాడుతున్నంత సేపు హాయిగా వుండేది. ఆడి మాటల మైకంలో పడిపోయా. ఒకరోజున 'నువ్వంటే నాకు చానా ఇష్టమే' అన్నాడు. ఆ తరువాతి రోజు క్వారీలో బట్టలు ఉతికేకాడికి వచ్చాడు. 'రాత్రి మా ఫేవరెట్ హీరో సినిమా చూసా. అందులో లిప్‌లాక్ సీన్ అదిరిపోయిందిలే' అన్నాడు.

'లిప్‌లాక్ అంటే ఏంటి' అనడిగా.

'ఎలా చెప్పాలి....' అని ఓ క్షణం ఆలోచించి, 'చెప్పడం కాదుకాని, చేసి చూపించనా' అన్నాడు.

'సరే చూపించు...' అన్నా.

చుట్టూ చూశాడు. అప్పటికింకా క్వారీకి ఎవరూ రాలేదు. దగ్గరకొచ్చి నన్ను పట్టుకొని నా పెదాలను ఆడి పెదాలతో మూసేశాడు. ఊపిరాడనంత పనైంది. ఆడ్ని గట్టిగా తోసేసా...

'ఏంటిది శీను... కాసేపలానే వుంటే చచ్చేదాన్ని ఊపిరాడక' అన్నానే కాని, అందులో ఏదో మత్తు వుందనిపించింది.

9వ తరగతి పరీక్షలు అయిపోయాయి, సెలవులిచ్చారు.

ఒకరోజున 'లచ్చీ... నీకో మంచి సంబంధం తెచ్చానే. ఆడు కూడా మాతోపాటు క్వారీ పని చేత్తాడు. మంచోడు. కట్నం కూడా వద్దన్నాడు' చెప్పాడు అన్న.

'అన్నా.. నేను చదువుకుంటా'...

'ఆ... దొరసాని గారు చదువుకొని ఊళ్లేలాలి గావోసు' వదిన అందుకుంది. దీంతో 'చదువులేదు గిదువు లేదు... రేపు ఆళ్లత్తన్నారు. ఆ తర్వాత ఎంటనే పెళ్లి చేసెయ్యడమే' అన్నాడన్న.

ఏం మాట్లాడలేకపొయ్యా... శీను మనసులో మెదిలాడు. కళ్లలొంచి నీళ్లు ఆగకుండా వచ్చాయి. రాత్రంతా ఏడుస్తూనే వున్నా. పొద్దున్నే బట్టలు ఉతకనీకి పోనియ్యలా... పెళ్లికొడుకు నాకంటే చానా పెద్దోడు. రంగే, కానీ నాకు నచ్చలేదు.

'నాకిష్టం లేదు. ఆడ్ని నేను చేసుకోనన్నా' అని చెప్పా. నా మాట పట్టించుకోలేదు.

ఆ తర్వాత రోజు క్వారీకి వెళ్లాను. శీను కోసం చూశాను. తను కనపడలేదు. ఆ తర్వాత వారం రోజుల్లో పెళ్లయిపోయింది. ఆళ్ల సొంతూరికి తీసుకుపోయారు. అతను రోజూ తాగి వచ్చేవోడు. రాత్రయ్యేసరికి బలవంతంగా మీద పడేవాడు. ఒక అచ్చటా ముచ్చటా లేదు. శీను గుర్తొచ్చేవోడు. బాగా ఏడుపొచ్చేది.

పెళ్లయి ఏడాది అయినా ఒక్కసారి కూడా అన్నా వదిన తీసుకెళ్లలేదు. మధ్యలో ఒకసారి మాత్రం అన్నవొచ్చాడు. 'నువ్వు అదృష్టవంతు రాలివే. క్వారీ పనులకు ఎల్లక్కరలేదు' అన్నాడు.

కాసేపుండి ఎల్లిపోయాడు. ఆ తర్వాత నెల తప్పాను. మూడోనెలలో పుట్టింటికి తీసుకొచ్చారు.

వచ్చిన రెండోరోజున క్వారీకి వెళుతుంటే... శీను కనిపించాడు. నన్ను చూసి నాతోపాటే క్వారీకి వచ్చాడు.

'ఏమే నల్లబంగారం... ఎట్టున్నావే. ఎన్నాళ్లయిందే నిన్ను చూసి. మా అక్కకి ఒంట్లో బాగోలేదంటే ఊరెళ్లా, వచ్చేసరికి నీ పెళ్లయిపోయిందని తెలిసింది. ముందే తెలిసుంటే మీ అన్నతో మాట్టాడి పెళ్లాడేటోన్ని' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

నా గుండె చెరువైపోయింది. 'బంగారం... నిన్నొదిలి వుండలేనే' అంటూ కౌగిలించుకున్నాడు. ఏమీ మాట్లాడలేక స్థాణువులా వుండిపోయా.

ఆ తరువాత రోజూ క్వారీ దగ్గర కలిసేవోడు. పక్క ఊరులో వున్న ఆసుపత్రికి తన ఆటోలో తీసుకెళ్లేవోడు. తొలిసారిగా సినిమా కూడా శీనుతోనే చూసా. బోల్డంత నవ్వించేవోడు. నా దిగులంతా పోయింది. ఒకరోజు మా ఆయన వచ్చాడు తీసుకెళ్లడానికి. అన్నా వదిన వెళ్లమని బలవంతం చేశారు.

నాకిష్టంలేని పెళ్లి చేశారు. నేను వెళ్లనంటే వెళ్లనని మొండికేసా... శీనుతోనే వుంటానని తెగేసి చెప్పా.

'మీరైనా నచ్చచెప్పి తీసుకరరండి' అని చెప్పి అతను వెళ్లిపోయాడు.

శీను ఆటోలో తిరగడం, సినిమాలకు వెళ్లడం, క్వారీలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడం దినచర్యగా మారింది. తొమ్మిదో నెల్లో బాబు పుట్టాడు. అంతా నా పోలికే. రంగు మాత్రం ఆడి నాన్నది.

పిల్లాడ్ని ఎత్తుకునే శీను ఆటోలో తిరిగేవాళ్లం.

ఒకరోజున... 'బంగారం.. మనం పెళ్లి చేసుకుందాం' అన్నాడు శీను.

నేనెంతో ఉప్పొంగిపోయా. నా సంతోషం క్షణమైనా నిలవకుండానే... 'కానీ... బాబుని ఎవరికైనా అమ్మేద్దాం. వాడి జ్ఞాపకాలు కూడా మన జీవితం మీద పడొద్దు. మనం కొత్త జీవితం ప్రారంభిద్దాం' అన్నాడు.

శీను మైకంలో వున్న నేను... సరే అనేశాను. ఆ తర్వాత బిడ్డని వదిలి వుండలేనని అర్థమైంది. శీనుకి అదే చెప్పా. 'అయితే మనం పెళ్లి చేసుకోడం కుదరదు' అన్నాడు.

ఒకవైపు బిడ్డపై మమకారం... మరోవైపు శీనుపై అనురాగం.. ఎవరిని వదులుకోవాలో తేల్చుకోలేకపోయా.

శీను అడిగినప్పుడల్లా ఏడ్వడం తప్ప ఏమీ చెప్పలేకపోయా.

ఒక వారం గడిచింది. బిడ్డ నలతగా వున్నాడని ఆస్పత్రికి తీసుకెళ్ళాం. అక్కడే నాకు తెలీకుండా బాబుని పది వేలకు ఎవరికో ఇచ్చేశాడు. నేను ఎంత ఏడ్చినా ఫలితం లేకపోయింది. ఆ డబ్బుతోనే ఈ పేటలో గుడిసె అద్దెకు తీసుకుని కొత్త కాపురం మొదలెట్టాం. అన్నయ్య వదినా నన్ను చచ్చినదాని కింద జమకట్టారు. చేతిలో వున్న డబ్బు అయిపోయే వరకూ జల్సాగా తిరిగాం. శీను ఆటో వేయడం మానేశాడు. చేతిలో డబ్బు అయిపోయింది. చిన్నచిన్న అప్పులు కూడా మొదలయ్యాయి. సాయంత్రం అయ్యేసరికి తాగడం, అది కావాలి ఇది కావాలని గొడవ చేయడం, ఏ మాటబడితే ఆ మాట అనడం మొదలు పెట్టాడు.

'ఆటో తోలొచ్చుగా శీను. ఇలా పస్తులతో పడుండేకంటే' అన్నాను ఓరోజు. గయ్‌మని లేచాడు. 'నా కర్మ... నీతో వచ్చిన తర్వాత నాకు దరిద్రం పట్టుకుంది' అంటూ బయటికెళ్లి పోయాడు. ఆ రోజే వేరే అమ్మాయితో చూశాను.

ఒకరోజు ఇంటికొచ్చి, 'నాకొక ఆంటీ తెలుసు. తన దగ్గరకి తీసుకెళ్తా. ఆమె ఏ పని చెబితే అది చెయ్యి. మనకు డబ్బు ఇబ్బంది వుండదు' అన్నాడు.

ఆంటీది చాలా పెద్దిల్లు. చాలా గదులున్నాయి. అక్కడ నన్నొదిలి వెళ్లిపోయాడు. జంటలు జంటలుగా ఆ గదుల్లోకి వెళుతున్నారు. మొదట అర్థం కాకపోయినా, తర్వాత అర్థమైంది అక్కడ ఏం జరుగుతుందో... వచ్చేద్దాం అనుకున్నా.

'అతనితో ఆ గదిలోకి వెళ్లు' అంది ఆంటీ.

నేను అలా చేయలేను అన్నాను.

'ఇక్కడికి వచ్చే ముందే అన్నీ ఆలోచించుకోవాలి. ఏ ప్రోబ్లెం వుండదు, నా కోసం ఏమైనా చేస్తుందని చెప్పాడు శీను. వెళు ్ల... వెళ్లు...' అంది ఆంటీ.

వచ్చినతను... నన్ను చెయ్యి పట్టుకొని లాక్కెళ్లాడు. అలా నా జీవితం మరో మలుపు తిరిగింది. తెచ్చిన డబ్బు తీసుకొని వెళ్లిపోయేవాడు శీను. ఒక్కోరోజు ఇంటికి వచ్చేవాడు కాదు. పిచ్చిగా ఎదురుచూసేదాన్ని. చూసి చూసి ఒకరోజు నిలదీశాను.

'నీకు చెప్పేదేంటే... నువ్వేమన్నా నా పెళ్లానివా? నీ మూలంగా లక్షలు కట్నం వచ్చే సంబంధాలు చెడిపోయినాయ్. నీ చావు నువ్వు చావు' అంటూ వెళ్లిపోయాడు. మళ్లీ రాలేదు.

వాడి కోసం... వాడిమీదున్న ప్రేమ కోసం సంసారం వదిలేసుకున్నా, నా బిడ్డని పోగొట్టుకున్నా, చివరకు నా ఒళ్లమ్ముకున్నా... ఒంటరిగా మిగిలిపోయా. నాకెవ్వరూ లేరు. జీవితమంటే ఏమిటో తెలియని వయసులో ప్రేమలో పడ్డాను. వాడ్ని పిచ్చిగా ప్రేమించాను. వాడికోసం ఏం చేయడానికైనా వెనకడాలేదు. అయినా ఓడిపోయాను. చచ్చిపోవాలనిపించింది.

కానీ, పదే పదే గుర్తొస్తున్న నా బిడ్డను ఒక్కసారన్నా కళ్లారా చూడాలన్న ఆశ నన్ను బతికిస్తోంది. కడుపు నింపుకోవాలి. ఇంటికి అద్దె కట్టాలి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆంటీ దగ్గరకు వెళుతున్నా. వాళ్లిచ్చే డబ్బుతోనే రోజులు గడుపుతున్నా..'

'దేవక్కా... నా బిడ్డను నాకు ఇప్పించండి. వాడ్ని గుండెలకు హత్తుకోవాలని, తనివితీరా ముద్దాడాలని ఉంది అంది ఏడుస్తూ.

'లక్ష్మీ... నీ సమస్య అర్థమైంది. నీ బిడ్డను కలవడానికంటే ముందు.. నీ కాళ్లపై నువ్వు నిలబడు. నేను నీ అమ్మనురా అని సగర్వంగా వాడి ముందుకి వెళ్లవుగాని. మా కౌన్సిలింగ్ సెంటర్‌కి వస్తే... మిగతా విషయాలు మాట్లాడదాం. ఏమంటావ్' అంది దేవి.

లక్ష్మి కన్నీరు తుడుచుకుంటూ మౌనంగా వుండడంతో...

'లక్ష్మి.. నువ్వు గొప్ప ప్రేమికురాలివి. ఇంట్లో పొందలేని ప్రేమను శీను దగ్గర పొందాలనుకున్నావు. పొందలేకపోయావు. అంతమాత్రాన నువ్వు ఓడిపోయినట్లు కాదు. ఇకనుంచి నీ బిడ్డ కోసం బతుకు. నీ బిడ్డను నువ్వు పొందాలంటే, ముందు ఈ ఊబి నుంచి బయటపడాలి. నీ కాళ్లపై నువ్వు నిలబడాలి. నిన్ను నీవు నిరూపించుకోవాలి. ఆలోచించుకో... నువ్వెప్పుడొచ్చినా సహాయం చేసేందుకు మేం సిద్ధం.' అంటూ లక్ష్మి భుజం తడుతూ.. తన బృందంతో ముందుకు కదిలింది దేవి.

ఒక్క క్షణం... గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

గుండెను దిటవుపర్చుకుంది.

'అక్కా... నేనూ వస్తున్నా' అంటూ ఆ బృందంతో పాటే బయల్దేరింది లచ్చి... కాదు కాదు – లక్ష్మి. ■



## గది

గదంటే నలువైపులా ఉండే గోడలు కాదు
నాకు నాతో ఉన్న జ్ఞాపకాలు
అదో అద్భుత ప్రపంచం
నాతో నేనున్న ప్రపంచం
అలజడుల్ని అదిమి పెట్టి
లోలోపల కురుస్తున్న
దు:ఖాన్ని దాచిపెట్టే
ఆత్మీయ భాండాగారం!



విరిగిపడ్డ శకలాల ముందు కూర్చుని
రేపటి అడుగు కోసం నన్ను నేను పుటం పెట్టేచోటది
మనసు నిండా కమ్ముకున్న అనంత వేదనని
నిశ్శబ్ద శూన్యంలోకి విసిరేసి
నవ్వుల నడకలు నేర్పే మహా నేర్పరి

ఆలోచనలన్నీ ఆవిరయ్యాక
అణువణువునీ సమీకరించి
నన్ను నేను తొడుక్కునే కాలమది
ఘనీభవించిన హృదయాన్ని సాంత్వన పరచి
స్థిరచిత్తాన్ని మదికి మరోమారు వెల్లవేసి
వైచిత్ర్యాన్ని వైరుధ్యాల అలికిడుల మధ్య
అనేకసార్లు ఓడి జారిపడుతూ
విరిగి ఎగసిపడే అలనవుతాను

పారాడుతాను.. మనసుతో తారాడుతాను
బుడిబుడి అడుగులు నేర్చుకుంటాను
లక్ష్యం వైపు పయనమౌతాను

స్నానాల గదిలో మేనుపై జారే నీటి తుంపర్లతో కలపి
అనన్య సందిగ్ధాలనీ విసిరేసి
ఆత్మవిశ్వాసపు వస్త్రాలు ధరించి
దీర్ఘశ్వాస హృదయం నిండా నింపుకుని
నాలోపల నేను ఆనందాన్ని నింపుకుని
నవ్వుల పెదవులతో..
మదినిండా ఆశలతో గది బయటకొస్తాను

**- కోడే యామినీదేవి**

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : పిల్లా కుమార స్వామి

**1. నన్నెచోడుడు రచించిన కావ్యం**
ఎ. వినాయక విజయం బి. కుమార సంభవం సి. కథా సరిత్సాగరం డి. స్వారోచిషమనుసంభవం

**2. 'అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ' అని రాసిందెవరు?**
ఎ. తెనాలి రామకృష్ణ బి. రామరాజ భూషణుడు సి. అల్లసాని పెద్దన డి. శ్రీకృష్ణదేవరాయలు

**3. రామరాజ భూషణుడు ఏ ప్రాంతం వాడు?**
ఎ. భీమవరం బి. తెనాలి సి. పులివెందుల డి. ఆదోని

**4. భేతాళ కథలను ప్రచురించిన పత్రిక ఏది?**
ఎ. బాలమిత్ర బి. చెకుముకి సి. చందమామ డి. బాలజ్యోతి

**5. ఆంధ్రుల సాంఘిక చరిత్ర రాసిన రచయిత**
ఎ. సురవరం ప్రతాపరెడ్డి బి. సురవరం సుధాకరరెడ్డి సి. మల్లంపల్లి సోమశేఖరశర్మ డి. బి.ఎన్. శాస్త్రి

**6. రంగనాథ రామాయణం రచయిత**
ఎ. రంగనాథుడు బి. గోన బుద్దారెడ్డి సి. ఆతుకూరి మొల్ల డి. విశ్వనాథ సత్యనారాయణ

**7. వీరేశలింగం రచించిన రాజశేఖర చరిత్రకు ఆధారమైన ఆంగ్ల నవల**
ఎ. ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ బి. ది కామెడీ ఆఫ్ ఎర్రర్స్ సి. ఒథెల్లో డి. వింటర్స్ టేల్స్

**8. ఇప్పటి వరకు లభించిన ఆధారాలను బట్టి మొట్టమొదటి నవల ఏది?**
ఎ. రాజశేఖర చరిత్ర బి. శ్రీరంగరాజ చరిత్ర సి. రేనాటి వీరుడు డి. ప్రజల మనిషి

**9. గురజాడ రాసిన మతము - విమతము కథకున్న మరోపేరు**
ఎ. దిద్దువాటు బి. పెద్ద మసీదు సి. మీ పేరేమిటి? డి. మతసామరస్యం

**10. 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును' అన్న కవి ఎవరు?**
ఎ. జాషువా బి. గురజాడ సి. శ్రీశ్రీ డి. దాశరథి

**11. 'మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్టంగాను చూస్తావేల బేలా?' అన్నదెవరు?**
ఎ. నార్ల వెంకటేశ్వరరావు బి. వేమన సి. గురజాడ డి. జాషువా

**12. ఏ రచయిత జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము?**
ఎ. గురజాడ బి. జాషువా సి. గిడుగు రామమూర్తి డి. కందుకూరి వీరేశలింగం

**13. అంతర్జాతీయంగా కథల పోటీల్లో బహుమతి పొందిన మొట్టమొదటి తెలుగు కథ**
ఎ. గాలివాన బి. పిపీలికం సి. ఇల్లరికం డి. తులసిదళం

**14. ఆంగ్లంలోని 'నావెల్' పదాన్ని తెలుగులో 'నవల'గా పేరు పెట్టిన రచయిత ఎవరు?**
ఎ. గురజాడ బి. వీరేశలింగం సి. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి డి. కె.వి. రమణారెడ్డి

**15. పద కవితా పితామహుడని ఎవరిని పిలుస్తారు?**
ఎ. అల్లసాని పెద్దన బి. త్యాగయ్య సి. అన్నమయ్య డి. తెనాలి రామకృష్ణ

**16. భట్టుమూర్తి అని మరోపేరుతో పిలువబడిన కవి ఎవరు?**
ఎ. రామభద్రకవి బి. రామరాజ భూషణుడు సి. నాచన సోమన డి. నన్నెచోడుడు

**17. బసవపురాణం రాసిన కవి**
ఎ. పాల్కురికి సోమన బి. నాచన సోముడు సి. బసవన్న డి. అక్కమహాదేవి

**18. రామరాజభూషణుడు రాసిన ప్రబంధ కావ్యం**
ఎ. మనుచరిత్ర బి. వసుచరిత్ర సి. సత్యవంతుని చరిత్ర డి. పారిజాతాపహరణం

జవాబులు : **1. బి 2. సి 3. సి 4. సి 5. ఎ 6. బి 7. ఎ 8. బి 9. బి 10. బి 11. సి 12. సి 13. ఎ 14. సి 15. సి 16. బి 17. ఎ 18. బి**




# పొత్తి నవల తెలంగాణా జీవన చిత్రణం

- డాక్టర్ మహ్మద్ హసేనా
99080 59234

'వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకొని సామాజిక జీవితాన్ని స్ఫురింపచేసే సాహిత్య ప్రక్రియే నవల' అన్నారు ఆర్.ఎస్.సుదర్శనం. కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన 'రాజశేఖర చరిత్ర' మొదలుకొని ప్రస్తుతం వస్తున్న నవలలు సమాజంలోని వ్యక్తుల యథార్థ జీవన విధానాన్ని కళాత్మకంగా చిత్రించడాన్ని, సంఘంలోని సర్దుబాట్లను, సామాజిక సమస్య లను ఆనాటి దేశకాలమాన పరిస్థితులనూ కళ్ళకు కట్టినట్లుగా వర్ణించడానికి నవలా ప్రక్రియ మంచి దోహదకారి అనే చెప్పాలి. 'మాలపల్లి' అందుకు గొప్ప ఉదాహరణ. మాలపల్లి నవలకు వందేళ్లు పూర్తయ్యాయి. ఇప్పుడు నర్రా ప్రవీణ్ 'పొత్తి' నవల విడుదల కావడం ఒక చారిత్రక, యాదృచ్ఛిక సందర్భం.

ఉస్మానియా పరిశోధక విద్యార్థి ప్రవీణ్ రెడ్డి రచించిన నవల 'పొత్తి'. ఈ నవలలో చిత్రించిన అంశాలు నన్ను గతంలోకి తీసుకెళ్లాయి. నేను కూడా గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరగటం, మలి దశ తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు నేను కూడా ఉస్మానియాలో పరిశోధక విద్యార్థిగా ఆ ఉ ద్యమంలో పాలు పంచుకోవటంతో.. ఆ సందర్భాలు, సంఘటనలు, తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేసిన గేయాలు... అన్నీ నా కళ్ళముందు కదిలాయి. ఈ నవలలో ప్రవీణ్ నాలుగు అంశా లను ప్రధానంగా ప్రస్తావించాడు. మొదటిది గ్రామీణ జీవన విధానం. రెండోది మనుషుల మధ్య మానవతా విలువలను కాలరాస్తున్న ఆస్తుల గొడవలు, మూడోది ఉస్మానియాలో జరిగిన మలిదశ తెలంగాణ ఉద్యమం. నాల్గవది శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా కులాల మధ్య అంతరం తగ్గకపోవడం.

ఈ నవలను గ్రామంలో జరిగే ఒక సంఘటనతోనే ప్రారంభమవుతుంది. గ్రామంలో ప్రజల జీవన విధానాన్ని, ఆచార సాంప్రదాయాలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. రచయిత కళ్ళారా చూస్తేనో, అనుభవిస్తేనో తప్ప ఇలా వర్ణించటం సాధ్యం కాదు. ఇందులో నాయిక తల్లి యాదమ్మ తన సాధు జంతువు ఐన బర్రెను 'బంగారం' అని పిలవటం, అల్లారు ముద్దుగా చూసుకోవటం, అది 'తొలి చూలు' సమయంలో బాధపడుతునప్పుడు స్వయంగా యాదమ్మ ఆ బాధను అనుభవిస్తున్నట్లుగా వర్ణించి..గ్రామీణులకు పశువుల పట్ల ఉండే అనురాగాన్ని దృశ్యమానం చేసాడు రచయిత. ఊర్లో బొడ్రాయి పండగ వచ్చినప్పుడు 'పొత్తి' పోసే కార్యక్రమంలో ఊర్లో వారందరిని భాగస్వాములు చేయటం, బైండ్ల పాపయ్య బలిగంపను నెత్తిన పెట్టు కోవటం, గౌండ్ల మారన్న మొదలుకొని 'దేశగురువు' ఊరంత తిరిగి 'పొత్తి' పోయటం మొదలైన అంశాలు ప్రస్తావించి పల్లె జీవన విధానాన్ని చిత్రించారు. కాలం కరుణించక గ్రామాల నుంచి బొంబాయికి వలసవెళ్ళటం, కథానాయకుడైన 'శంకర్' తల్లిదండ్రులు మల్లారెడ్డి యశోదమ్మ, మల్లారెడ్డి తమ్ముడు సోమిరెడ్డి, అతని భార్య సుశీలమ్మ, గ్రామ సర్పంచైన పుల్లారెడ్డి కపట వ్యక్తిత్వం, మల్లారెడ్డి దగ్గర జీతగాడు వీరయ్య , అతనితో పాటు తన భార్య యాదమ్మ పటేలు పొలం పనులు చూసు కోవటం, కథానాయికైన 'గంగ' ఇంటి పనుల్లో సహాయ పడటం, డిగ్రీ పూర్తిచేసి పోస్టు గ్రాడ్యుయేషన్ చదువులకు ప్రిపేర్ అవ్వటం మొదలైన సన్నివేశాల్లో గ్రామీణ వాతావరణం ప్రస్ఫుటించింది. ఈ సన్నివేశాల్లో రచయిత వాడిన 'ఆకిలి, సాంపిసల్లుడు, పొయ్యి మీద బువ్వ ఉమ్మగిల్లుతుంది, శెంగడ బింగడ దుమకటం' వంటి తెలంగాణ మాండలిక పదాలు

కథకు పూర్తిగా పల్లియ సొగసును అద్దాయి.

మల్లారెడ్డి తమ్ముడికి (సోమిరెడ్డికి) భూముల పంపకం విషయంలో తలెత్తిన ఆస్తి తగాదా విషయంలో సర్పంచ్ పుల్లారెడ్డి జోక్యం చేసుకోవటం, తనకొచ్చే కమీషన్ కోసం కక్కుర్తిపడి సోమిరెడ్డి భూమిని వ్యాపారస్థులకు అమ్మించడం, తద్వారా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడం .. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడతాయి. సోమిరెడ్డి తన వాటా ఐన ఐదెకరాలు అన్న మల్లారెడ్డి పంచుకోనివ్వకపోవడం, అది ఎట్లాగైనా అమ్ముకొని అప్పులు తీర్చి పట్నం పోయి బతకాలనేది సోమిరెడ్డి ఆలోచన. ఆస్తి పంచివ్వమని ఒకసారి అన్నపై చేయి చేసుకోవటం మొదలుకొని తన ఐదెకరాల వాటా అమ్ము కోవటానికి అనుమతి ఇవ్వమని పొలంలోనే రక్తం కారేటట్లుగా కొట్టడం కొసమెరుపు. ఈ సన్నివేశాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల, లోకల్ ప్రజా ప్రతినిధుల నాటకీయ పరిణామాలు బాగా రక్తికట్టించాడు ప్రవీణ్. ఈ రకమైన ఆస్తుల వివాదాలు ఇటీవల ఎక్కువగా మనం చూస్తూనే ఉన్నాం. భూముల ధరలకు రెక్కలొచ్చిన తర్వాత వ్యవసాయ భూములు కాస్తా వాణిజ్య భూములుగా మారటం, పట్నం వ్యాపారస్తులు, మధ్య దళారీలు భూములపై కన్నేసి తక్కువ ధరకు కొనటం వెంచర్లుగా మార్చి ఎక్కువ ధరకు అమ్మటం, ఊర్లోని పెద్ద మనుషులను బ్రోకర్లుగా, ఏజెంట్లుగా మార్చుకోవటం మనం చూస్తున్న తంతే. ఈ అంశాలను రచయిత చాలా నేర్పుగా సున్నితంగా రాశాడీ నవలలో. మల్లారెడ్డి, సోమిరెడ్డిల మధ్య సర్పంచ్ పుల్లారెడ్డి తల దూర్చడం, పట్నం వ్యాపారవేత్త రంగారావుకు సోమిరెడ్డికి మధ్య ఐదెకరాల వాటా అమ్మకానికి రాజీ కుదర్చటం, ధర నిర్ణయించడం వంటివి రసవత్తరంగా చెప్పి కథను నడిపించాడు. రచయిత సామాజిక, రాజకీయ దృష్టికి, అవగాహనకు ఈ సన్నివేశం ఒక మచ్చుతునక. తెలంగాణలో ఒక సామెత ప్రచారంలో ఉంది. "అడ్డికి పావు శేరు చొప్పున కొన్నడు" అని. వినియోగదారుడి బలహీనతను ఆసరాగా చేసుకొని వ్యాపారస్థుడు తక్కువ ధరకుకొని ఎక్కువ ధర ఇస్తున్నట్లుగా నమ్మబలకడం, మోసపోవడం వంటి సమయాల్లో ఈ సామెత వాడతారు. ఈ కథలో కూడా అదే జరిగింది. అమ్మిన తర్వాత వచ్చిన డబ్బులను ఫైనాన్స్‌లో పెట్టుబడి పెట్టి ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మించి ఫైనాన్స్ వాడు మోసం చేసినట్లుగా చెప్పటం వెరసి సోమిరెడ్డి దిక్కుతోచని స్థితిలో ఎల్‌బీ నగర్ దగ్గర అడ్డ మీది కూలిగా మారటం, కొన్ని రోజులకే తన అన్న కొడుకైన శంకర్ కంటబడటం, ఆవేదనకు లోనై ఏడుస్తున్న బాబాయిని (సోమిరెడ్డి) ఓదార్చి ఊరికి తీసుకొని రావటం లాంటి అంశాలు గ్రామీణ ప్రాంతంలో ఉండే అమాయక జనుల ప్రవర్తనను కళ్లకు కట్టిస్తాయి.


ఈ నవలలో ప్రస్తావించిన మూడో అంశం కులం. ఇందులో కథానాయకుడు శంకర్ అగ్రవర్ణానికి చెందినవాడు. శంకర్ పేరుతో కథనం నడిచినా అతని తండ్రి పేరు మల్లారెడ్డిగా పేర్కొనడంతో అతను అగ్ర వర్ణానికి చెందిన వాడన్న విషయం అర్థమవుతుంది. పల్లె ఒడి నుండి ఎదిగిన శంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి దాకా ఎదిగిన అభ్యుదయ భావాల వారథి. మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న విద్యార్థి నాయకుడు. యాదృచ్ఛికంగా తన కుటుంబానికి, జీతగానివలే సేవ చేస్తున్న వీరయ్య కూతురైన గంగ పరిచయం కావటం, పై చదువుల కోసం శంకర్ సలహాలు తీసుకుని తను కూడా ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్ళటం, ఉద్యమంలో తను కూడా శంకర్ కు తోడుగా సాగి ఉద్యమంలో పాల్గొంటూ తన తోటి స్నేహితురాళ్ళను ఉద్యమంలో భాగస్వామ్యం చేసి నాయకత్వం వహించడం, ఒకరోజు ఉద్యమంలో భాగంగా ర్యాలిగా వెళ్ళిన విద్యార్థులకు పోలీసులకు గొడవ జరగటం, అందులో శంకర్ గాయపడటం గంగ స్వయంగా శంకర్‌ను హాస్పిటల్‌కి చేర్చి సపర్యలు చేయటం, క్రమంగా వారిలో ప్రేమ చిగురించడం, గంగ మనసులో తక్కువ కులమనే అభద్రత కలగడం, శంకర్ గంగను ఒప్పించటం, అనంతరం ఇద్దరు రెండు కుటుంబాలను ఒప్పించే క్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంటికి వెళ్ళడం... ఈ సంఘటనలన్నీ నది ప్రవహించినట్లు సజావుగా సాగుతాయి. ఒక వైపు ఉద్యమం, మరో వైపు గంగా శంకర్ల ప్రేమను సమపాళ్లలో నడిపిన విధానం అద్భుతం. రచయిత రెండు వర్ణాలను ఏకం చేసే సమయంలో మంచి కథనాన్ని నడిపాడు. ఒకరోజు మల్లారెడ్డి పొలం గట్టు మీది నుండి జారిపడి తలకు గాయం కావటంతో తీవ్రంగా రక్తస్రావం జరుగుతుంది. అక్కడే పొలం పనులు చేస్తున్న వీరయ్య మల్లారెడ్డిని ఆసుపత్రికి తరలించి రక్తదానం చేసి బతికిస్తాడు. ఇదే అదునుగా శంకర్ మనసులో మాట బయటపెట్టడం, అక్కడ తల్లిదండ్రులు వ్యతిరేకించడం, శంకర్ భావోద్వేగపు మాటలు కులాల అంతరాలను చెరిగేలా చేయటం చూస్తామీ నవలలో. ఈ అంకంలో నాకు ఉన్నవ లక్ష్మి నారాయణ గారి 'మాలపల్లి' నవలలోని 'సంగదాసు, చౌదరయ్య' పాత్రలు గుర్తుకు వచ్చాయి. సమాజంలో వున్న కులాల ప్రస్తావన, కట్టుబాట్లు, నేటికి వేళ్లూనుకొని వున్న ఆర్థిక అసమానతలు నేటి ఆధునిక యువత అభ్యుదయపు ఆలోచనలతో ఎలా చెరిపేస్తుందన్నది ఈ నవలలో చూడవచ్చు. మనిషి మనిషికి మధ్య వుండాల్సింది మానవత్వం

కాని 'కులం, మతం' కాదని, ఈ అంతరాల కంచెలు తొలగిననాడె మనం మనుషుల్లా బతుకగలుగుతం అని శంకర్ చెప్పిన ప్రగతిశీల భావాలు, 'ఇసపు కంచెలను ఇయ్యాలటి నుండే తొలగిద్దాంరా' అని మల్లారెడ్డి పలికిన మాటలు అందరిని ఆలోచింపజేస్తాయి.

ఇక నాల్గవ అంశం ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమం. అందునా ఉద్యమం ఉధృతంగా మారటానికి విద్యార్థులు చేసిన పోరాటం. విద్యార్థులు పోరాటం నెగ్గే దాకా ఉద్యమాన్ని సజీవంగా ఉంచుతూ ప్రజల్లోకి తీసుకు పోవడం. తదనుగుణంగా స్వరాష్ట్ర కలను వ్యాప్తి చేయటం. ఫలితంగా ఉద్యమం వాడవాడల ఊరు ఊరునా ప్రభంజనంవలె ఎగిసిపడేట్లు చేయడం. దానికి ఈ నవలలోనూ, వాస్తవంలోనూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రధాన పాత్ర పోషించింది. శంకర్ పీజీ రెండో సంవత్సరం విద్యార్థి కావటం, ఓయూలోనే చదువుతూ ఉండటం కావేరి హాస్టల్ (సి-హాస్టల్) రూం నెంబర్ 54లో ఉద్యమ కార్యాచరణ రూపొందించటంతో నవల ఉన్నతస్థాయికి చేరింది. కథా క్రమంలో నాయకుడికి 'గంగ' క్యాంపస్‌లో క్లాసుల బహిష్కరణ సందర్భంగా పరిచయం కావటం, ఇద్దరు ఉద్యమంలో భాగం కావటంతో కథనం ఆసక్తిని కలిగిస్తుంది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి మరణం తర్వాత ఉద్యమం వేగం పుంజుకోవడం, శంకర్ మిత్రుడు 'రవి' తెలంగాణ ఉద్యమం పట్ల జరుగుతున్న ఆలస్యానికి, స్వార్థ రాజకీయ నాయకుల ద్రోహానికి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవటం, సూరి నక్సలిజంలో కలవడం వంటివి శంకర్‌ను బాగా కలిచివేస్తాయి. ఈ క్రమంలో నవలాకారుడు చేసిన వర్ణనలు, విద్యార్థుల త్యాగాలు కన్నీళ్లను రప్పిస్తాయి. అందుకే 'పొత్తి' విద్యార్థుల ఆత్మలను నింపుకున్న పొత్తం, ఉద్యమ ప్రాణదీపం అనొచ్చు. ఇంకా ఉద్యమంలో భాగంగా జరిగిన 'ధూంధాం' కార్యక్రమాలు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన 'ఉస్మానియా క్యాంపస్లో ఉదయించిన కిరణమా...వీర తెలంగాణమా...' , 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ... నా తెలంగాణా..' లాంటి పాటలు ఉద్యమంలో విద్యార్థుల చైతన్యానికి దోహదపడ్డాయి. ఈ నవలలో సందర్భానుసారంగా అవి రికార్డయ్యాయి. నర్రా ప్రవీణ్ 'పొత్తి' నవలలో పాటలు చేర్చడం నవలా రంగంలో చేరిన అదనపు సొగసని చెప్పాలి. అలానే క్యాంపస్ ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమానికి సంఘీభావంగా ఒక రోజు విద్యార్థులు ర్యాలీ చేయటం, అది కాస్తా హింసాత్మకంగా మారటం, రబ్బర్ బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించటం నవలలో అత్యంత ఉత్కంఠభరితంగా సాగాయి. నవలలో రాసిన ఈ సంఘటనలు నాకు జాతీయ ఉద్యమంలో నాటి 'జలియన్ వాలా బాగ్" ఉద్యమ సన్నివేశాన్ని (1919 ఏప్రిల్ 13), నాటి సమైక్య రాష్ట్రంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని (2001 ఆగస్టు) గుర్తుకు తెచ్చింది. అప్పటి అమరవీరులు, వాళ్ళ త్యాగాలు కళ్ళ నిండా స్ఫురించాయి. తెలంగాణ ఉద్యమం హింసాత్మకంగా మారడం వల్ల ఎంతోమంది విద్యార్థులు లాఠీ దెబ్బలకు, రబ్బరు బుల్లెట్లకు చెట్టుకొకరు పుట్టకొకరు పడటం నేను కళ్ళారా చూశాను. ఆ సమయంలో నేను అక్కడ వున్న వాడిని. నాకు మళ్ళీ ఆ సంఘటనలు గుర్తుకు రావటం ఉద్వేగానికి లోనయ్యాయి. ఈ నవలలో చాలా బాధ కల్గించే, గుండెను బరువెక్కించే విషయమొకటి ప్రస్తావించాలని ఉంది. అదేంటంటే, విద్యార్థుల పైకి కాల్పులు జరపమనిపై అధికారి ఒక కానిస్టేబుల్‌ని ఆదేశించటం. అందుకు ఆ కానిస్టేబుల్ ససేమిరా అనటం, 'ఆ ఉద్యమంలో మా వాడు కూడా వున్నాడు సార్... అని చెప్పటం ఒక హృద్యమైన నాటకీయ శిల్పానికి చక్కని ఉదాహరణ. అలానే ఎంసీఏ విద్యార్థి వేణుగోపాల్ రెడ్డి, కానిస్టేబుల్ క్రిష్ణయ్య మరణం వెరసి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రకటించడం, రాష్ట్రపతి ఆమోదం తెల్పటం, ఇక్కడ గంగ శంకర్‌ల ఉద్యమ ప్రేమకు పెద్దలు అంగీకరించటం మొదలైన అంశాలు నాటకాన్ని తలపించేలా నవలను రాసి ముందుకు నడిపించిన విధానం బతుకమ్మ పువ్వులను పేర్చినట్లుగా సాగింది.

ఈ నవల ద్వారా కుల వ్యవస్థ, జోగిని వ్యవస్థ, ఆనాటి పోలీసు చర్య (1948), మలినం లేని పల్లె ప్రజల జీవన విధానం, తెలంగాణ ఉద్యమానికి సమాంతరంగా సాగిన సమైక్యాంధ్ర ఉద్యమం, తెలంగాణలో ఫ్లోరైడ్ సమస్య, అన్నదమ్ముల ఆస్తుల తగాదా మొదలైన అంశాలను నవలా కాన్వాస్ పైకి తీసుకురావడం అంత సులభం కాదు. సన్నివేశాల చుట్టూ అవసరమైన పాత్రల అల్లికతో నర్రా ప్రవీణ్ తన చేతులతో తెలంగాణకు 'పొత్తి' పోశాడు. ఇది మలిదశ తెలంగాణ ఉద్యమ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య చైతన్య నవలగా నిలిచిపోతుంది. తెలంగాణ సామాజిక జీవన విధానాన్ని, గ్రామీణ ప్రాంతపు నేపథ్యాన్ని, మాండలిక భాషా పదాలను ఉపయోగిస్తూ అటు తెలంగాణ ఉద్యమం, ఇటు గంగా శంకర్ ల ప్రేమకథను సమాంతరంగా నడిపి నాటకీయమైన శైలితో నవలను రాసి ప్రతి సన్నివేశం అద్దంలో చూపినట్లుగా, తెరపై కదలాడుతున్నట్లుగా పాత్రలు చిత్రించి సఫలం అయ్యాడు యువ రచయిత నర్రా ప్రవీణ్.

■




# మాకినీడి బాల సాహిత్యం

**డా. జోశ్యుల కృష్ణబాబు**
98664 54340

**పి**ల్లల కోసం గేయాలు రాయడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కవి తాను ముందుగా బాల్యంలోకి వెళ్ళి పోగలగాలి. చుట్టూ ఉన్న బాల్యాన్ని పరిశీలించాలి. సరళమైన మృదువైన భావనలూ పదాలూ సృష్టించగలగాలి. అప్పుడే బాలల సాహిత్యం అల్లటం సాధ్యమవుతుంది. మాకినీడి సూర్య భాస్కర్ ఈ విషయంలో అద్భుతమైన కృషి చేశారు. బాలల కోసం ఎన్నో గేయాలు రాశారు. వాళ్లతో పాడించారు. తనూ మమేకమైన ఆడించారు. మాకినీడి ఉపాధ్యాయుడు. చిన్న పిల్లల్లాంటి స్వభావం ఉన్నవాడు. నిర్మలంగా, మృదువుగా సంభాషించటం, ఎవ్వరినైనా నవ్వుతూ పలకరించడం, ద్వేషకోపాలు ప్రదర్శించకపోవడం ఇవన్నీ ఆయనలో కనిపించే నిర్మలమైన బాల్యానికి చిహ్నాలు. ఇవే ఆయన బాలసాహిత్యం రాయడానికి దోహదం చేశాయి.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో అమ్మలూ, అమ్మమ్మలూ, నాయనమ్మలూ, తాతయ్యలూ వారు విన్నవీ కన్నవీ కథలు కథలుగా చెప్పి పిల్లల్ని అలరిస్తూ విజ్ఞానవంతులుగా, వివేక వంతులుగా తీర్చిదిద్దేవారు. 20వ శతాబ్దిలో పిల్లల కోసం ప్రత్యేక రచనలు రావడం మొదలైంది. వావిలకొలను సుబ్బారావు 'ఆర్య కథానిధి'లో మన పురాణ కథలను చక్కగా పిల్లలకు అర్థమయ్యే భాషలో మలచి, పిల్లలకు అందించారు. బాల వాఙ్మయ బ్రహ్మగా కీర్తిపొందిన చింతా దీక్షితులు ఆధునిక బాలసాహిత్య ప్రక్రియకు ఒరవడి పెట్టారు. దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ వారు బాలసాహిత్యాన్ని స్పృశించారు. తరువాత ఏడిద కామేశ్వరరావు, ముళ్ళపూడి వెంకట రమణ, తురగా జానకీరాణి, వెలగా వెంకటప్పయ్య వంటివారు ఆధునిక బాల సాహిత్యంలో వివిధ రచనలు చేశారు. తరువాత ఒకవైపు బాల పత్రిక, మరొకవైపు ఆటవిడుపు, రారండోయ్ అంటూ రేడియో కార్యక్రమాలు, చందమామ, బాలమిత్ర వంటి పిల్లల పత్రికలు వెలుగులోకి వచ్చాయి.

మాకినీడి రాసి ముద్రించిన తొట్ట తొలుత గ్రంథం 'జ్యోతిబాల'. దీన్ని 1996లో రాశారు. అది కూడా అప్పటి మున్సిపల్ ఛైర్మన్ జ్యోతుల సీతారామ్మూర్తి గారి కోరికపై రచించారు. అదెలా జరిగిందంటే మాకినీడి పనిచేస్తున్న స్కూలు తనిఖీకి వచ్చిన జ్యోతుల.. పిల్లలు మాకినీడి రాసిన పద్యాలను పాడడం గమనించి, ఆయన మాకినీడిని పిల్లల కోసం ప్రత్యే కించి బాల గేయాలు రాయమని కోరారు. వాటిని తాను ముద్రి స్తానని అన్నారు. ఆ ప్రేరణతోనే మాకినీడి తొలి బాల సాహిత్య గ్రంథానికి శ్రీకారం చుట్టారు. ఆ గ్రంథాన్ని జ్యోతుల సీతా రామ్మూర్తి గారికే అంకితమిచ్చారు. అన్నమాట ప్రకారం జ్యోతుల వారు ఆ గ్రంథాన్ని ముద్రణ చేయించారు. ఇలా 'జ్యోతిబాల' అనే బాల గేయాల సంపుటే 1996లో మాకినీడి తొలి గ్రంథంగా వెలువడింది. ఈ శీర్షిక జ్యోతుల వారిపై గల గౌరవంతోనే ఉ ంచడం జరిగింది.

ఆ తరువాత మాకినీడి పిల్లల కోసం చాలా గ్రంథాలే రాశారు. స్వర్ణభారతి (దేశభక్తి గేయాలు), పెద్దలు చెప్పిన చిన్నకథలు, బాల్యం ఒకపాట, ఇస్కూలు హైకూలు, చదువుల పండుగ, సైంటిఫిక్ టెంపర్, వెన్నెల, శాస్త్రీయ అవగాహన మొదలైనవి ఇరవై వరకూ ఉన్నాయి. ఇవికాక ఆరోజుల్లో సర్కార్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో ప్రతి శనివారం బాల శీర్షికతో పొదుపు – *విడుపు, సామెతకో పద్యం, బాలగేయ హేల, బాల విజ్ఞానం, బాల గ్రంథాలయం, మామయ్య కబుర్లు, ఈవారం పద్యం, పెద్దలు చెప్పిన చిన్న కథలు, పేరులోనే పెన్నిధి, నీతిసుధ, సూక్తిసుధ, సైన్సు గీతాలు, ఆర్టు స్కూలు* మొదలైన ఎన్నో శీర్షికలు సంపాదకులు గొడవర్తి సత్యమూర్తి గారి కోరికపై

నిర్వహించారు. ఇప్పుడు జ్యోతిబాల, స్వర్ణభారతి, బాల్యం ఒకపాట, వెన్నెల, సామెతకో పద్యం, సౌమ్య మోహనారామం అనే ఆరు సంపుటాలు లభిస్తున్నాయి. తక్కినవి పునర్ముద్రణ కోసం ఎదురు చూస్తున్నాయి. లభ్యమవుతున్న ఆరు సంపుటాలనూ స్థాలీపులాకంగా పరిచయం చేస్తాను.

**1. జ్యోతిబాల :** ఈ సంపుటిలో మొత్తం 19 బాల గేయాలున్నాయి. మాకినీడి బాలసాహిత్యంలో విజ్ఞాన శాస్త్ర సంబంధి గేయాలు, విద్యా విషయక గేయాలు, ప్రకృతి సంబంధి గేయాలు, క్రీడలకు, పండుగలకు, మానవ సంబంధాలకు, ఇంకా అనేకానేక ఇతర అంశాలకు సంబంధించిన గేయాలు కనిపిస్తాయి. పిల్లల వయసును బట్టి వారి భావనా ప్రపంచపు స్థాయి ఉంటుంది. ఆ గ్రహింపుతో రాశారు మాకినీడి. జ్యోతిబాలలోని గేయాలు బాగా చిన్న పిల్లలకు సంబంధించినవి.

'నా బొజ్జ నిండు' అనే గేయం ఉంది. అందులో ప్రకృతి మానవుని కడుపు ఎలా నింపుతుందో ఒక క్రమ పరిణామ పద్ధతిలో ఇలా వివరిస్తారు.

చిన్న చిన్న చినుకు – సూదివంటి చినుకు
చినుకు చినుకు చినుకు వాన చినుకు చినుకు
చినుకు చినుకు కలిసి చిన్న బిందువగును
బిందు బిందు కలిసి పెద్ద సింధువగును

ఎండవేడిసోక సింధువావిరగును
ఆవిరైన జలము మేఘమాలికౌను
చల్లగాలి సోక మేఘము వర్షించు
వర్షజలము గ్రోలి పంటలన్ని పండు

పంటనేమొ నాన్న తెచ్చునింటికంట
అమ్మవండిపెట్టు నాబొజ్జ నిండునంత

ఈ గేయంవల్ల ప్రకృతిపై ప్రేమ కలగటమే కాదు, కురిసే చినుకు సింధువునెలా చేరుతుందో, నీరు మళ్ళీ ఎండవేడిమికి ఆవిరై ఎలా మేఘంగా మారుతుందో.., ఆ మేఘం చల్లగాలి సోకగానే ఎలా వర్షిస్తుందో, ఆ వర్షజలాన్ని గోలి పంటలెలా పండుతాయో, వాటిని ఎంతో కష్టపడి పండించి నాన్న ఇంటికెలా చేరుస్తాడో, అమ్మ వాటిని ఎలా వండిపెడుతుందో ఒక క్రమ పరిణామ పద్ధతిలో వివరిస్తారు మాకినీడి.

అమ్మానాన్నల మధ్య పిల్లలు తొలి పలుకులు నేర్చుకొనే వేళల్లో ఈ బాలగేయం ఆవిర్భవిస్తుంది. నర్సరీ పిల్లలకు అక్షరాలు పరిచయం చెయ్యడానికి ఒక చక్కని గేయాన్ని ఇలా కూర్చారు కవి.

"అ – అమ్మ ఎంతో మంచిది
ఆ – ఆమె దగ్గరి బొమ్మలు
ఇ – ఇచ్చునన్నీ నాకు
ఈ – ఈయనెవరికి నేనూ!' అంటూ ఇలా 'అ' మొదలు 'అం అః' దాకా బుల్లి బుల్లి గేయ వాక్యాలలో కూరుస్తారు. ఇంతకంటే మెరుగైన పద్ధతి ఏముంటుంది, పిల్లలకు అక్షరాలు నేర్పడానికి.

అలాగే పిల్లల బుద్ధికి, ఆలోచనకు పదునుపెట్టే పొడుపు కథల్ని గేయాల్లో ఎంతో ఆసక్తికరంగా కూరుస్తారు.

'మామకాని మామ – పిల్లలందరి మామ
మామకాని మామ – మనము మెచ్చే మామ
మామకాని మామ – వన్నెచిన్నెల మామ
మామకాని మామ – కురిసె వెన్నెల మామ..
పాపా చెప్పవమ్మా.. గుట్టూ విప్పవమ్మా..?'

అంటూ చందమామను గూర్చిన పొడుపు కథను చక్కని గేయంలో చెపుతారు. అలాగే

'కదలని రంగుల పువ్వుల
కదిలే రంగుల అతిథులు
వాలును పూపొదలందున
గ్రోలును నవ మకరందం..' అంటూ సీతాకోకచిలుకపై పొడుపు కథ వదులుతారు. మనకు చాలా చిన్నవి అనిపించే అంశాలు, పిల్లలకు చాలా పెద్ద సమస్యగా అనిపించవచ్చు. ఒక టీచర్‌గా మాకినీడి అలాంటి పిల్లల్ని చూసి ఉండవచ్చు. తాను నల్లగా ఉన్నానని బాధపడే పిల్లల్ని, వాళ్ళని గేలిచేసే పిల్లల్ని ఉద్దేశిస్తూ రాసిన 'నలుపు' అనే గేయంలో

'కంటికి పెట్టే కాటుక నలుపు
షోకుగ పాడే కోకిల నలుపు
నిద్రను బుచ్చే చీకటి నలుపు
నీళ్ళను కురిసే మేఘము నలుపు
అందాలిచ్చే కురులూ నలుపు
అందరు మెచ్చే కృష్ణుడు నలుపు' అంటూ ప్రకృతిలో నల్లనివి ఎంతో అందంగా ఉండి, అందరూ ఇష్టపడే అంశాలు ఎలా అయ్యాయో వివరిస్తారు. అలాగే 'దోమలు బాబోయ్ దోమలు' అనే గేయంలో క్యూలెక్స్, అనాఫిలిస్ దోమలను గుర్తించే విధానాన్ని, ఆ దోమకాటు వల్ల కలిగే అనర్థాల్ని, తీసుకోవల్సిన జాగ్రత్తల్ని వివరిస్తారు.

**2. స్వర్ణభారతి :** స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా 1997లో 'స్వర్ణభారతి' శీర్షికతో బాలల దేశభక్తి గేయాల సంపుటిని వేశారు మాకినీడి. ఈ స్వర్ణోత్సవ పండుగను..

"తల్లి సంకెలలు తొలగజేసిన
బల్లిదుల స్మరించు బ్రహ్మోత్సవం' అంటారు రచయిత. ఇందులో పిల్లలకు సంబంధించిన మోనో యాక్షన్లు, వివిధ

ఫ్యాన్సీ డ్రెస్సులకు సంబంధించిన గేయాల్ని కూడా అందించారు. శాంతిదూత చాచా నెహ్రూపై మోనో యాక్షన్ ఒకటి రాశారు. అందులో ఆటంబాంబుల వల్ల కలిగే అనర్థాల్ని, పర్యవసానాల్నీ ఒక గేయంలో వర్ణిస్తూ..

'మానవ తలపై ఆటంబాంబూ
మానవతకదే చేటుర పాపా
మానక బాంబులనారాధిస్తే
మానవ మనుగడ చెల్లుర బాబూ..!' అంటారు.

రాణాప్రతాప్, వీర శివాజీ, ఝాన్సీరాణి, గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రిల ఫ్యాన్సీ డ్రెస్సులు వేయించి, ఆ డ్రెస్సులకు అనుగుణంగా ఉండేటట్లు గేయాల్ని రాశారు. ఉదాహరణకు ఝాన్సీరాణి గురించి చెపుతూ..

ఇదిగో ఇదిగో ఝాన్సీరాణీ
ప్రచండ ఝుంఝూ సమర కఅపాణీ
ఆంగ్లేయులనే తుదముట్టింపగ
గుర్రమునెక్కీ వచ్చిందండీ..! అంటారు.

భూగోళ విజ్ఞాన శాస్త్ర విషయాలను కూడా నేరుగా బోధించటం కంటే ...

'ఉత్తరాన ఉన్న హిమాలయమట్లు
ఉత్తమమై ఉన్నతమై చెలగు భూమి
దక్షిణాన ఉన్న హిందు సముద్రమట్లు
పక్షి పావురమై శాంతికోరు భూమి..' అంటూ నాలుగు దిక్కులా ఉన్న ఎల్లల్ని చక్కని గేయంలో వివరిస్తారు.

'మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును..' అంటారు గురజాడ. మాకినీడి ఇదే విషయాన్ని 'మానవతే మన సిద్ధాంతం' అనే గేయంలో ఇలా చెబుతారు.

'హిందూ ముస్లిం క్రైస్తవమూ
మతమేదైనా చెప్పేదొకటే
ప్రేమడితోడను మెలగుమనుచు
నీమముగానూ నిలువుమనుచు!'

అలాగే 'జనుల కొందరనంటరాదని
అనుట అమ్మో ఎంత పాపము?' అంటూ అంటరానితనం ఎంత హేయమో ఒక గేయంలో చెబుతారు.

**3. బాల్యం ఒక పాట :** ఈ గేయాలు ఎనిమిదేళ్ళ పిల్లల కోసం రాసినవి. రామలక్ష్మణులు అనే గేయంలో అన్నదమ్ములు పరస్పర ప్రేమాభిమానాలతో ఎలా మెలగాలో చెపుతూ ..

'తమ్ముడంటె రామునికి
తగనంత అభిమానము
అన్నగారంటె లక్ష్మణుని
కన్నిటికంటె ప్రేమము..!"




అంటూ భాతృప్రేమను గురించి చెపుతారు. 'వాదం–మోదం' అనే గేయంలో ఇద్దరు పిల్లలు.. చందమామ, చల్లగాలి, సముద్రము, మొక్కలు, పిట్టలు అన్నీ నావంటే నావని వాదించుకుంటారు. చివరకు.. 'అవును, అవును, అవును, మనవె మనవె, అన్నీ' అనడంలో నాది అనే భావన నుండి పిల్లల్ని మనది అనే భావనకు తీసుకువెళ్ళాలనేనిది ముఖ్యోద్దేశం.

బడిగంట పిల్లలకు చాలా ఇష్టం. అందులోనూ ఇంక సాయంత్రం ఇంటికి వెళ్ళిపోవడానికి కొట్టే బడిగంట అంటే మరీ ఇష్టం. వర్షం వస్తే లాంగ్ బెల్ కొట్టి మధ్యాహ్నం పాఠశాలకు సెలవు ప్రకటిస్తూ ఉంటారు. అదైతే మహా ఇష్టం. ఇవన్నీ 'బడిగంట' అనే గేయంలో ఇముడుస్తారు కవి. 'అల్లరి బాబు' గేయంలో తూనీగల్ని పట్టుకొని హింసించటం ఎంత అనాగరికమో చెపుతూ ..

'స్వేచ్ఛ ఉండదని బంధనమందూ
స్వచ్ఛందంగా తెలిసీకొనియె..
తూనీగనపుడు వదలీ వేసే..
వదలిన తూనీగా తూలిసోలి
తుర్..తుర్.. తుర్రున ఎగిరీపోయె..!" అని పిల్లల్లో హింసా ప్రవృత్తిని తొలగించే ప్రయత్నం చేశారు.

పిల్లలకు పక్షుల్ని చూస్తే ఆనందం. ఆ పక్షుల్లా తామూ ఎగరగలిగితే ఎంత బాగుండునని అనుకుంటారు. ఆ విషయాన్నే 'పిట్టనైతేనా' అనే గేయంలో మాకినీడి చాలా చక్కగా ఊహిస్తారు. పిట్టనైతే చెట్టు చెట్టుకూ ఎగిరిపోయేవాణ్ణని, గాలిలో తేలిపోయే వాణ్ణని, మబ్బుతేరులో సాగిపోయేవాణ్ణని, చందమామతో ఆడుకోగలిగేవాణ్ణని ఊహిస్తారు. అలాగే లెక్కలకు సంబంధించిన అంశాలనూ కొన్ని గేయాల్లో చెబుతారు.

'పది నుంచీ ఒకటి తీస్తే తొమ్మిది
ఆకాశంలో గ్రహాలు తొమ్మిది
తొమ్మిది నుంచి ఒకటి తీస్తే ఎనిమిది
దిక్కులు ఉన్నవి ఎనిమిది' అంటూ ఇలా ఒక ఆటలా తీసివేతల్ని కూడా గేయాల్లో చెప్తారు కవి. అలాగే ఎన్నో పొడుపు కథలూ ఉన్నాయ్ ఇందులో..

**4. వెన్నెల :** 'వెన్నెల'లోని బాల గేయాలు పద్నాలుగేళ్ళ ప్రాయంలోని పిల్లలను ఉద్దేశించి రాసినవి. ఆ వయసు పిల్లల్లోని ఉత్సాహాన్నీ, ఊహాశాలితనూ పెంచే విధంగా ఈ గేయాలు ఉ

న్నాయి. టీనేజి పిల్లలకు ఈ గేయాలు నైతిక బోధన చేస్తాయి. పొదుపు, కరుణను చూపండమ్మా, పరిశుభ్రత, పుస్తకాలు వంటి గేయాలు బాలల్ని తీర్చిదిద్దుతాయి. పొదుపు గేయంలో ..

'పొదుపంటే లేమికి కుదుపు
పొదుపంటే బాధల చిదుపు
పొదుపుంటే లేదే అలుపు
పొదుపుంటే నీదే గెలుపు..' అని చెప్పి మాటల్లో కూడా పొదుపు పాటిస్తే నోరుజారడం జరగదని, ఆచితూచి మాట్లాడ డమే గెలుపునకు బాట అని చెపుతారు. అనాథల విషయంలో జాలి, దయ కలిగి ఉండాలని 'కరుణను చూపండమ్మా' అనే గేయంలో చెప్పారు. చదువు ఎంత అవసరమో, దాని వల్ల లభించే ప్రయోజనాలెటువంటివో.. 'చదువుకో' అనే గేయంలో చెబుతారు.

'చదువుకొని వినయమును పెంచుకో
వినయమున నడవడిని దిద్దుకో
చదువుకొని మమతలను పంచుకో
మమతల మానవత నందుకో' అంటారు.

అలాగే 'పరిశుభ్రత' గేయంలో
'పరిశుభ్రత ఉన్న యింట
పెరుగునులే సౌఖ్యాల పంట
పరిశుభ్రత లేని ఇంట/ మురుగునులే రోగాల తంట' అని పరిశుభ్రత అవసరాన్ని చెపుతారు.

పుస్తకాలను గూర్చి చెపుతూ .. 'మంచి చెప్పు నేస్తాలు
జ్ఞానజ్యోతి రాస్తాలు/ శాస్త్రాంబుధి కోస్తాలు
మేధావుల నాస్తాలు' అంటారు. ఇలా ఈ గేయాలు బాలల్ని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది వారి మనోవికాసానికి దోహదం చేసేందుకు రాశారు.

**5. సామెతకో పద్యం :** విద్యార్థులకు సామెతలు సులభంగా గుర్తుండటానికి ఈ పద్యాలు రాశారు మాకినీడి.

"సామెతలవి బతుకు సార సంగ్రహములే
జీవితానుభవము జేర్చి కూర్చి
పెద్దలిచ్చినట్టి ముద్దుల సుద్దులు
అర్థమెరిగి మసలుమాంధ్రబాల' అంటూ సామెతకో పద్యం అనే గ్రంథంగా రూపొందించారు. మచ్చుకొకటి..

'చంకనెక్కు పిల్ల చచ్చినా దిగిరాదు
ఎత్తుమరగ దిగదు మొత్తుకున్న
అధివసింప దిగునె అధికార పీఠమ్ము
అర్థమెరిగి మసలుమాంధ్ర బాల..!'

బాల్యంలో ఎత్తు అలవాటైన పిల్లలు చంక దిగక పోవడాన్ని ఎప్పుడూ పదవిని అంటిపెట్టుకొని ఉండే నేటి రాజకీయ నాయకులకు అన్వయించి చెప్పారు. ఇలా ఈ పద్యాలు బాలల్ని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది వారి మనోవికాసానికి దోహదం చేసేందుకు రాసినవి.

**6. సౌమ్య మోహనారామం :** మనవరాలి కోసం తాతయ్య రాసిన ఒక అపురూప ప్రేమ కావ్యమే ఈ సౌమ్య మోహనా రామం. ఏ మగవాడికైనా మొదటిసారి తండ్రి అవుతున్నప్పుడే కాదు, తాత అవుతున్నప్పుడూ అపరిమితమైన ఆనందం కలుగుతుంది. కూతురు సౌమ్య తల్లి కాబోతుందని తెలిసిన క్షణం నుంచి మనవరాలు మోహన పుట్టాక ఆ మనవరాలితో ఏ సమయంలో ఎలాంటి అనుభూతికి, ఆనందానికి లోనయ్యారో తేదీలు, సమయాలతో సహా మాకినీడి ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు.

పాప నిద్రపోతే ఆ తాత అమ్మమ్మలకు అసలు తోచేది కాదట. ఆ విషయాన్ని ముక్తపదగ్రస్తంలో ఇలాచెబుతారు.

'అసలు కంటెను వడ్డీ ముద్దు అనగమేలు
మేలుకోని క్షణమగును పలు యుగాలు
కాలు నిలువదిరువురికి క్షణమదేని
దేనికోసమో కండ్లగు దివ్వెటీలు..'

పాప నిద్రపోతే తిరిగి మేల్కొనే దాకా ఆ తాత అమ్మమ్మలకు క్షణం కొన్ని యుగాల్లా గడుస్తుందట.

మాకినీడిది ఎంతో పెద్దదైన ప్రపంచం. అది సాహిత్య ప్రపంచం కావచ్చు లేదా చిత్రకళా ప్రపంచం కావచ్చు. ఈ రెండూ కాక పాఠశాల ప్రపంచం ఉండనే ఉంది. అయితే ఇవన్నీ మోహన పుట్టేవరకే. 'ఇప్పుడు మా ప్రపంచమంతా/ ఎంతో చిన్నది, బుల్లిది, చిట్టిది అయిపోయింది' అంటారు. 'ప్రపంచం నుంచి తెంపేసి ఓ బుల్లి ప్రపంచాన్ని సృష్టించింది' అని కూడా అంటారు. అలాగే పాప జోలల్నీ, లాలల్నీ, అమ్మ ముద్దుల్నీ, పాప నవ్వుల్నీ, పాప వన్నెచిన్నెల్నీ ఏ ఒక్కటీ వదలకుండా ఒడిసి పట్టుకొని ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు మాకినీడి.

బాలగేయానికి లక్ష్యమే కానీ లక్షణం లేదు. కాలంతోపాటు బాలగేయం మారుతూ ఎదుగుతూ మారాకులు వేస్తోంది. బాలసాహిత్యాన్ని కుటుంబ సాహిత్యమని కూడా పిలుచు కుంటారు. మొత్తానికి మాకినీడి బాలసాహిత్యంలో పిల్లల్ని విజ్ఞాన వంతులుగా, వివేకవంతులుగా తీర్చిదిద్దటంతోపాటు పిల్లల చిన్నప్పటి జ్ఞాపకాలను భద్రపరచుకోవటం అనే కోణం కూడా కనిపిస్తుంది. ఈ రెండు కోణాలూ మనల్నే కాదు, పిల్లల్నీ అలరిస్తాయి.

■

కథ



# తోట అమ్మకానికి లేదు

- డా. కె.సుభాషిణి
94402 54730

**ఎం**డిపోయిన కాఫీ గ్లాసును కిందకు తోసి నాకింది పిల్లి. అందులో ఏం దొరకదని అర్థమయ్యింది దానికి.  నెమ్మదిగా వచ్చి, కాళ్ళు చాపి వసారాలో కూచున్న ప్రతాప్ పక్కనే ముడుచుకొని పడుకుంది. లోపల నుండి పచ్చి మిరపకాయలు వేయిస్తోన్న వాసన వస్తోంది. ప్రతాప్ స్థిమితంగా కూచోలేక పోయాడు. వసారాలో నుండి గాటిపాడు నడవలోకి, అక్కడ నుండి రెండు మెట్లు ఎక్కి అరుగు మీద వున్న స్తంభానికి ఆనుకొని కూచున్నాడు. తరువాత లేచి, ఫ్రిజ్జు తెరిచి నీళ్ల బాటిల్ తీసుకుని రెండుసార్లు పొడిదగ్గు దగ్గాడు.

"అంత తొక్కులాడితే ఎట్లా? నాలుగు చేతులు ఉండాయా నాకు ఏమైనా?" సన్నటి గజ్జెల శబ్దం ప్రతాప్ ఎదురుగా వచ్చి నిలుచుంది.

సింథటిక్ చీర విత్ బ్లౌజ్... పొడిపొడిగా వున్న జుట్టుకు క్లిప్ పెట్టి వదిలేసింది. మెడలో ఒంటిపొర బంగారు గొలుసు. చెవులకు నాజుగ్గా ఊగుతున్న కమ్మలు. నుదుటి మీద ఎర్రటి దోస గింజ స్టిక్కర్.

"రావాల్నేమ్మా చంద్రకళ !" కొడుకు లోపలికి పోవటం కోడలి గొంతు పెద్దగా వినిపించటం చూసి బయట వసారా కిటికిలో నుండి లోపలికి చూస్తూ కోడల్ని పిలిచింది.

"వద్దులే అత్తా!"

"తోటకాన్నుండి ఈ టయానికి వస్తాను అని తెలుసు కదా... ఆ యింత అన్నం పప్పు జేయడానికి యింత ఎండ పడేవరకు వుండాల్నా ఏం! ఏం జేస్తాంటావో."

"యింట్లో పని వుండదు కదా.. అందుకే కాళ్లు సాపుకొని నిద్ర పోతాంటిలే? పాపం బోకులు తోమిండేది ఎవరో? పరుపులు మడిచి, కసువులు నూకిండేది ఎవరో? అరుగును కన్నెగా కడిగి తుడిసిండేది ఎవరో? అవల్లా కన్పియ్యవు నీకుల్యా?"

"ఆ.. అందరూ జేసేదేలే నువ్వు ఒక్కదానివే కొత్తగా ఏమన్నా జేస్తాండావా?"

"యిదిగో అదే నేను వద్దనేది. ఈ రోజే లేటు అయ్యింది. యింతకు ముందు అయితే ఈ టైయానికంతా టిఫిన్ క్యారియర్ తీస్కోని తోటకాటికి నేనే నడిసి వస్తాంటి. కూలోళ్లతో కలిసి పని జేస్తాంటి. యిప్పుడు అన్నిటికి కుంటు పడి చెయ్యి యిరిగినట్లయ్యింది..."

"యిప్పుడు ఏమయిందని?"

"బండి ఏస్కోని రయ్యిమని తిరుగుతావు. నీకేం తెలుస్తాది యింట్లో ఎంత పని వుంటాదో? అందరూ తలా ఒక పని అందుకుంటే తప్ప సంసారం నడ్వదు. నా ఒక్కదాని చేత యింట్లో పనే తెమలకుండా వుంది. యింగ తోట పని కూడా అంటే అయితాదా? సర్లేగానీ, వంట అయ్యింది. కాళ్ళు కడుక్కొని రాపో మరి" రైస్ కుక్కర్ ప్లగ్ తీసి  మిక్సీ జార్ పెట్టింది. ప్రతాప్‌కు పీట వేసి కంచం పెట్టింది. వండినవి చిన్న గిన్నెలల్లోకి మార్చింది.

"మాయమ్మ జేయడం లేదనే కదా నువ్వు అంగలారు స్తాండేది?"

"నేనేం అంగలార్సడంల్యా!  ఈ కాళ్ల నొప్పులతో నడ్వల్యాక పోతుండాను అని మీయమ్మనే అంటాంటుంది. కింద కూచోని ఏ పని జెయ్యల్యాకపోతాంది."

ప్రతాప్ ఏం మాట్లాడలేకపోయాడు.  అన్నం చాలు అన్నట్టు చెయ్యి అడ్డం పెట్టాడు. వేడి అన్నంలోకి రెండు చెంచాలు నెయ్యి వడ్డించింది.

"ఏం మాట్లాడవు?" ప్రతాప్‌ను రెట్టించింది.

అన్నం ముద్ద నములుతూ తల ఎత్తి భార్య ముఖంలోకి చూశాడు. "యాదో ఒగటి చెయ్యాల మరి! అట్ల పట్టనట్టు వుంటే ఎట్ల?" అంది.

"మనకు వచ్చేతరికే ఎందుకు యిట్ల అయితాదో అర్థం కాదు. పోయినసారి కరోనా అని ఎక్కడివి అక్కడే నిల్చిపాయా! అరటికాయలకు దిక్కే ల్యాకపాయ. తిరపతిలో అయితే మోకాళ్లకు ఆపరేసన్ ఫ్రీగా జేస్తారు అని జెప్తే పిల్చుకొని పోతిన్యా... నాలుగైదు సార్లు తిరపతికి తిప్పుకుండ్రి. కరోనా కాలంలో అపరేషన్లు అన్నీ ఆపేసినాం అని తొలీతా చెప్పిర్యా! కడాకు ఫ్రీగా జెయ్యం లెక్క గట్టాల్సిందే అని అండ్రి. సరే ఏం జేస్తాం. యాడన్నాపోండ్లే ఈ ఉగాదికి చేపియ్యాలను కుంటిమా!.."

"ఊ... ఈ ఉల్లిగడ్డలు యిట్ల నాశనం అయిపాయ..."

"అయినా సరే ఎట్లనోగట్ల తిప్పలు పడ్దాంలే అనుకుంటే తీరా ఆ టైమ్‌కు గొంతుకాటికి వచ్చి కూచుంటాయి యావో ఒగటి. పెద్దోడు ల్యాప్ టాప్ కొనిచ్చేవరకు నిమ్మలం పన్నీకపాయ. అమ్మయ్య అని ఊపిరి పీల్చుకోకముందే మా అక్క కొడుకు పెండ్లి వచ్చి పడ్యా..."

" పెండ్లికొడుక్కి ఉంగరం, పెండ్లిలో నలుగురు కలుస్తారు బాగుండదని మనం అందరం బట్టలు కొనుక్కుంటిమి..."

"తీసిపెట్టుకొనిండే ఆ కొదవ సదవ లెక్క అట్ల గాలికి కొట్టకపాయ. ఎవ్వరూ వినకపోతిరి నామాట. మేనమామవు కనీసం ఉంగరం అయినా పెట్టకపోతే సిగ్గుపోతాది అని మాయమ్మ కూడా వంత పాడ్యా..."

అత్తకు వినిపిస్తుందేమో అని కిటికి వైపు దృష్టి చూసింది చంద్రకళ. గొంతు తగ్గించింది.

"మనము యిట్లనే తాస్కారం చేసినామంటే మన పని గోవిందనే. ఆమె తిరగాడతాంటేనే యింట్లో అంతంత మటుకు. ఆ కాళ్ల నొప్పులతోనే మీనాయనకు అవి యివి అందించడం, అన్నం పెట్టడం చేస్తాంటాది. వామె గనక మంచంలో పడితే మన తిప్పలు మాములుగా వుండవు. అత్త మామలకు అంకితం అయిపోవాల్సిందే యింగ నేను. సంసారం యింగ నడిసినట్లే! అందుకే నా మాట యిని ఎట్లనో గట్ల కాళ్లు ఆపరేసన్ చేపియ్. ఓ మూన్నెల్లు కష్టబడితే తర్వాత నిమ్మలంగా వుండొచ్చు! అంతగా అయితే కూతుర్లకాడ ఓ నెలో రెన్నెల్లో వుంటాది." పెరుగు వేసి నంజుకోడానికి చింతకాయ తొక్కు వేసింది.

"నువ్వు చెప్పేది బానే వుంది గానీ, ఆపరేషన్ అంటే మాటలా?"

"నువ్వు అన్నిటికి ఎందుకు చింత చేస్తావ్? ఆమె బంగా రమే వుంది కదా! అవి ఏసుకొని ఎక్కడికి పోవల వామె?"

"బంగారు బ్యాంక్‌లో పెట్టనూ, దానికి వడ్డి కట్టనూ యిదే సరిపోయింది జీవితకాలమంతా! తప్పదు మనట్ల రైతులకు... ఆపరేషన్ సరే, యిప్పుడు చిన్నోనికి కూడా ల్యాప్‌టాప్ కావా లంటాండాడే ఎట్లబ్బా? అవ్! పిల్లోల్లు రాలేదే.. అన్నం తినేదానికి యింతసేపు అయినా..." వేలితో చింతకాయ తొక్కును నాలుక మీద రాసుకున్నాడు.

"వాళ్ళుగాని పొద్దున్నే అన్నం తినరూ మరి... మ్యాగీ పాకెట్లు తెచ్చుకొని వాళ్ళే జేసుకొని తిని పోయిరి. క్లాసులు వుండాయి అని.. పండుకున్నదాన్ని నన్ను లేపి నీళ్లు అడుగు తారు. అదే మ్యాగి అయితే మాత్రం యిద్దరు నోరెత్తకుండా జేసుకుంటారు."

"సిటిలో, పెద్ద కాలేజీలల్లో చదివేటోళ్లబ్బ నీ కొడుకులు. పొద్దన్నే అన్నం తింటారా వాళ్లు.. పూరీలు, దోశెలు, వడలు తినేటోళ్లు! హాస్టల్లకు తక్కువ కడ్తాండామా ఏమన్నా? పెద్దోనికి కాలేజీ ఫీజుకే సగం అయితిమి. అయినా వాన్ని ఈడనే యాడన్నా దగ్గర చేర్పిచ్చుకోకుండా మన వూర్లో పిల్లోళ్లు పంజాబ్‌లో చదువుతాన్నారు. ఎవరికీ తీసిపోకూడదు అని మనం ఆటికే పంపిస్తిమి..."

"మరి పంపిచ్చుకోక.. ఈన్నే అయితే వాడు సదివినట్లే. మనలెక్కనే అరటి చెట్లకు పాదులు చేసుకుంటా వుంటాడు. చిన్నోన్ని కూడా దూరం అంపియ్యాల్సిందే జూడు..." తెలియ కుండానే చంద్రకళ గొంతు పెరిగింది.

"ఆ.. మరి, పెట్టెలల్లో లెక్కలు మూలుగుతాండాయి. రేపు మొక్కజొన్న అమ్మితే వచ్చే లెక్క తెచ్చుకోడానికి మన ట్రాక్టర్ సరిపోదు. లారీ మట్లాడుకొని పోతా. అప్పుడు కొడుకును పంజాబులో ఏం ఖర్మ.. ఏకంగా అమెరికాకు అంపిచ్చి సదివిస్తువులే!"

ప్రతాప్ వెటకారం చంద్రకళకు ఎక్కడో తగిలింది.

"అన్నిటికి నన్నే అంటావే? ఏం నీ కొడుకు కాదా వాడు? కన్యాక సదివిచ్చుకోవాలే! నువ్వు ఒగనివే కష్టం చేస్తాన్యాట్లు మాట్లాడ్తావ్! ఉల్లిగడ్డలకు రేట్లు ల్యాకపోతే నేనా కారణం?"

"నువ్వు కాదు... నేనేలే కారణం సరేనా! ఎప్పుడూ నష్టమే .. అప్పులే... సుఖపడిందే లేదు ఎన్నడేగాని! ఎంతకాలం ఈ తిప్పలు పడేది? అయ్యేది కాదు పోయ్యేది కాదు. ఏమన్నాగాని ప్రతి సంవత్సరం రొంత భూమి అమ్ముకుంటాపోతా..." ఖాళీ ప్లేట్ను విసురుగా పక్కకు తోసి దిగ్గున లేచాడు ప్రతాప్.

"దండిగా జూసినాంలే యిట్లా బెదిరింపులు. ఎప్పుడూ అనే మాట కదా! అమ్ము... నాకు కూడా ఈ చాకిరి

తప్పుతాది…"

బైక్ స్టార్ట్ అయిన శబ్దంలో చంద్రకళ మాటలు వినిపించలేదు.

పోతున్న కొడుకు వైపు నీళ్లు నిండిన కళ్ళతో దిగులుగా చూస్తూ వుండిపోయింది ఆ అమ్మ.

♦ ♦ ♦

సిగ్నల్స్ సరిగ్గా లేకపోవటంతో అరటితోటలో నుండి బయటకు వచ్చి రోడ్డుకు ఒక పక్కగా నిలబడి ఫోను మాట్లాడు తున్నాడు ప్రతాప్.

"… నాకు గుర్తు వుందిలేరా సుధీరూ! మెసెజ్ కూడా పంపినారు. ఫీజుల సంగతి నేను చూసుకుంటా కదా, దాని గురించి నువ్వెందుకు చింత చేస్తావ్? యింగా టైం వుందిలే… నువ్వు చదువుకో అంతే, ఏమి!" కొడుకు యింకా ఏమైనా చెప్తాడేమో అని రెండు క్షణాలు ఆగి ఫోన్ పెట్టేశాడు.

"కాలేజి మొగం కూడా సూడకుండానే పస్ట్ యియర్ అయిపోగొట్టిరి. అర్నెల్లకే అయిపాయా! దసరా పండగకు మొదలు పెట్రి, ఉగాదికి అయిపోగొట్రి… ఆన్‌లైన్ క్లాసులు అని చెప్పి ఇంట్లోనే కూచోబెట్టి సదువు చెప్పిరి. ఫీజు మాత్రం పైసా తగ్గీకుండా మొత్తం ముక్కు పిండి కట్టిచ్చుకుండ్రి. హాస్టల్లో మహా అంటే ఓ నెల వున్నింటాడు. అదీ పరిచ్చలని. మొత్తం సంవత్సరం ఫీజు దొబ్బిరి! యిప్పుడు మళ్లీ ఫీజు అని ఎంట బడి సస్తన్నారు. తప్పుతాదా! రోట్లో తలకాయ వెట్టి పోటుకు బయపడితే అయితాదా యాడన్నా! ఈన్నే దగ్గర్లో యాడో ఒగసోట చేర్పిచ్చుకోంటే బాగుండు. ఏదో ఉద్దరిస్తాడని అంత దూరం పంపిస్తి. ఊర్లో మొగపిల్లోల్లు అందరు అక్కడే సదవబట్టిరి. ఆడ సదివితే ఉద్యోగాలు గ్యారంటి అంట అని అందరూ ఆటికే పోవడం మొదలువెట్టిరి. సంవత్సరానికి మూడు లచ్చలు! నాలుగేండ్లకు పన్నెండు… వీనికే యింత అయితాంటే యింగ చిన్నోడు కూడా రడీగా వుండాడు. వానిది, వీనిది యిద్దరిది కలిస్తే… ' గుండె గుభేలుమంది.

ఫీజుల గురించి ఎప్పుడు తలుచుకున్నా చెమటలు పడ్తాయి ప్రతాప్‌కు. మళ్లీ తనకు తానే ధైర్యం చెప్పుకుంటాడు.

ఈసారి అరటికాయలకు రేట్ వస్తే యివల్ల ఏం పెద్ద కథ కాదు. బయట పడచ్చు. పోయినసారి మాత్రం ఘోరం. ఎక్కడవి అక్కడే మూన్నెల్లపాటు నిల్చిపోతే ఏంగావల్ల జనాలు? అప్పుడు అరటికాయలు అట్ల! ఈ తూరి ఉల్లిగడ్డలు యిట్ల! ఎవరికి వుండవేమో యిట్ల కష్టాలు? ఎవరు జస్తారు ఈ సావులల్ల.. థూ.. రెండ్రెండు ఎకరాలు అమ్మి పారెక్కుతే సరి అన్ని అయిపోతాయి. అయినోళ్లు, కానోళ్లు అందరి కాళ్లు పట్టుకునే ఖర్మ తప్పుతాది. ముసిలోళ్లు వొప్పుకుంటారా…"

ఉదయం నుండి యివే ఆలోచనలు వెంటాడుతున్నాయి. ఒక్కసారిగా అన్నీ చుట్టుముట్టేసరికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

నల్లటి కియా కారు ప్రతాప్‌ను దాటి ముందుకు పోయి మళ్లీ రివర్స్ చేసుకొని వచ్చి ముందర ఆగింది. కారు ఎడమ వైపు నుండి జీన్స్ ప్యాంటు, టీ షర్టులు వేసుకున్న ఇద్దరు దిగిరి. మరో ఇద్దరు కారు కుడి పక్క నుండి దిగి ఎదురుగా వచ్చి నిలబడ్డారు. వారి యిద్దరి చెవులకు ముక్కుపుడకంత సైజ్ ఒంటిరాయి డైమండ్ కమ్మలు మెరుస్తున్నాయి. ఒక చెవికి మాత్రమే వుండటం కొత్తగా అనిపించింది. అరటి గెలల వ్యాపారులు కాదు అని వాళ్లను చూస్తానే అర్థమవుతుంది.

"అన్నా నమస్తే! మనదేనా ఈ తోట…" మాస్కు తీసి ప్రతాప్‌ను పలకరించాడు.

"అవ్ మనదే! యా వూరు సార్ మనది? ఎవరింటికి?"

"హైద్రాబాద్. లేండు కొనాలనే వచ్చాం. రెండు ఊర్లు జూసినాం. యిద్దరుముగ్గురికి చెప్పినాం." అన్నాడు ఒకతను.

"కొంటారు సరే! వ్యవసాయం జేసేటోళ్లు ఎవరు?"

"మేమే నలుగురం కలిసే కొనాలనుకుండాం. కలిసే చేపిస్తాం.."

"కలిసి చేస్తారా? అదీ హైదారాబాద్ నుండి?" అందరి ముఖాలు మార్చి మార్చి చూశాడు ప్రతాప్.

తాము సీరియస్‌గా వున్నామని చెప్పడానికి యింకొక అతను కలుగచేసుకున్నాడు. "మాకు కంపెనీ వుంది. అందులో మా నలుగురికి షేర్ వుంది.." అన్నాడు.

"మీరు ఉద్యోగస్థులు కాదా?"

"జాబ్ చేస్తున్నాం. అది ఎప్పుడూ వుండేదే. సబ్ కాంట్రాక్ట్ ప్రాజెక్టు కంపెనీ టేకప్ చేస్తుంది."

"కరోనా కాలంలో కూడా రెండూ నడ్సినాయా?"

"ఆ.. ఇంట్లో నుండే పని చేశాం. ఈ సారి ల్యాండ్ మీద యిన్వెస్ట్ చేయాలనుకున్నాం. ఆ పనిమీదనే తిరుగుతున్నాం. అక్కడ యింత యిక్కడ యింత వద్దు. కొంచెం గాని, ఎక్కువ గాని ఒకటే దగ్గర వుండాలి. అట్లా అయితే చూసుకోవటం, చేయించుకోవటం ఈజీ. ఖర్చులు కూడా కలిసి వస్తాయంట."

"ఎన్ని ఎకరాలు కొనాలనో?"

"ముందు రేట్లు ఎట్లున్నాయో తెలిస్తే…"

"ఏం పంటలు ఎస్తారో?"

"ఆ ల్యాండుకు సరిపోయేవి ఏవి అయినా సరే!"

"పండ్ల తోటలే అనుకుంటున్నాం…"

"ఎక్స్ పర్ట్స్ ఏది చెబితే అది!"

"టూ యియర్సులో రిటర్న్సు వచ్చేయ్యాలి"

ఒకరి తర్వాత ఒకరు మాట్లాడుతుంటే ప్రతాప్ అలా చూస్తూ

వుండిపోయాడు. తోటలో ఎన్ని గంటలు పని చేస్తారు, యింట్లో వాళ్లు ఎంత మంది వున్నారు, తోట పని ఎంత మంది చేస్తారు, కూలీలకు ఎంత యిస్తారు, కూలీలకు డిమాండ్ ఎలా వుంది, ఏం ఎరువులు వాడ్తారు, మార్కెటింగ్ ఎలా అని గుర్తుకు వచ్చిన విషయాలను అన్నీ అడిగారు. ఇద్దరు ఫోనుల్లో ప్రతాప్‌తో మాట్లాడింది మొత్తం రికార్డ్ చేశారు. పల్లెల వాసనే తెలియని వీళ్లు యిక్కడ వచ్చి వుండగలరా, ఎండముఖమే ఎరగనివీళ్లు వ్యవసాయం చేస్తారా అని ఆశ్చర్యపోతున్నాడు. ప్రతాప్ మౌనంగా వుండటం చూసి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ సైగ చేసుకున్నారు.

"అన్నా! నీ ఫోన్ నెంబర్ యివ్వు. మేము కాంటాక్ట్ చేస్తాం. నువ్వు చేసినా సరే.. మా నెంబర్లు యిచ్చి పోతాము."

"ఫ్రీ సర్వీసు కాదులే అన్నా! కమీషన్ వుంటుంది. మరిచిపోవద్దు"

దూసుకుపోతున్న కారును కనిపించేంతవరకు అట్లనే చూస్తూ వుండిపోయాడు.

♦ ♦ ♦

ఊ.. ఊ అంటూ కుక్కల అరుపులు .

గాఢనిద్రలో వున్న నారాయణ ఉలిక్కిపడి దిగ్గున లేచి కూచున్నాడు. సొప్ప అయిపోనట్లుంది. పాపం ఎద్దులు పిలుస్తాండాయి అని ఆరాటంగా మంచం దిగాడు.

నిద్రమత్తులో తూలుకుంటానే పంచను మోకాళ్ళ పైకి ఎగగట్టాడు. మూసివున్న వాకిలి రెక్కను ఒక చేత్తో తోసాడు. కిర్రుమంటూ తలుపు మెల్లిగా తెరుచుకుంది. ఎత్తుగా వున్న గడపమానును వాకిలి పట్టుకొని అడుగు వేయబోయి ఒక్క క్షణం ఆగాడు. ఏదో గుర్తుకు తెచ్చుకోవటానికి కళ్ళు ముసి తెరుస్తున్నాడు.

"అవ్.. ఏందో అరుపు యినబన్నే... అహ అరుపు కాదు.. లోపలినుండి పిల్చింది. యింగ ఏంది పిల్చుతాది? పాపం ఎద్దు పిలిచింటాది. ఊ.. సొప్ప ఎయ్యాల! ఎవరికీ? ఎద్దుకు... ఏది? యాడుంది?" కనురెప్పలు మూయకుండా గడపమాను యివతల నుండే ఇంటి లోపల ఎడమవైపు మూలకు కళ్ళు చిట్లించి చూసాడు. తెల్లటి ఆకారం లాంటిది ఏది కనిపించలేదు. గాటిపాడు మధ్యలో బైక్... టైర్లకు అతుక్కుపోయిన మట్టి పెళ్లలు. గోడకు ఆనించిపెట్టిన సైకిల్. నల్లటి నాపరాతి బండలు పాతిన గాట్లో ట్రాక్టర్ టైర్లు, పారలు, గంపలు.. కళ్ళు చూసిన దృశ్యాలు నారాయణ మెదడుకు అందుతున్నాయి. గడప దాటి లోపలికి అడుగులు వేశాడు. కుడివైపు వున్న అరుగు మీద వెలుతురు మసకగా పరుచుకొని వుంది. టేబుల్ మీద వున్న ల్యాప్ టాప్ నుండి వచ్చే వెలుగు గాటిపాడు వరకు పాకింది. గడ్డం కింద రెండు చేతులు పెట్టుకొని చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని ల్యాప్ టాప్లోకి తల దూర్చి చూస్తున్నాడు మనవడు సుధీర్. దంతెలకు వేలాడుతున్న ఫ్యాన్‌కు సరిగ్గా కిందనే సుధీర్ కుర్చీ వుంది. కింద వరుసగా పరుపులు పరిచి వున్నాయి. పడుకున్న వాళ్ళ మీద వెలుతురు పడటం లేదు. వాకిట్లో కూలర్ తిరుగుతోంది. ఏదో నీడ అరుగు మీద కదులు తున్నట్టుగా అనిపించి తల తిప్పి చూశాడు. నడవలో నిలబడి సుధీర్ వైపు చూస్తున్నాడు నారాయణ.

"ఏం గావల్ల అబ్బా?" వొళ్ళు విరుచుకుంటూ ఆవులించాడు సుధీర్.

"ఏం లేదులే గాని? పడుకోలే యింగా?"

లేదు అని చేతులు వూపాడు.

"బాగా పొద్దు పోయినట్లుందే? ఎంతయ్యిందో టైం?"

నిద్ర పట్టక ప్రతాప్ అటుయిటు మసులుతూనే వున్నాడు. అలికిడికి పరుపు మీద నుండి లేచి నిల్చున్నాడు.

"వాని జోలి నీకెందుకు నాయన? పోయి గమ్మున పడుకోరాదు!" అరుగు దిగి నడవలోకి వచ్చాడు.

"యింతసేపు పడుకొనేవుంటి. యావో అరుపులు యినిపిస్తే యిట్ల లోనికి వస్తి..."

"ఎవ్వరికి యినబడని అరుపులన్నీ నీకే యినిపిస్తాంటా యిలే" తండ్రికి వినపడకూడదని మెల్లిగా గొణిగాడు.

"నువ్వెందుకు లేసినావ్? టైం ఎంతయ్యిందని?"

"ఎంతోగొంత అయ్యింటాదిలే! ఏం నీళ్ళు గాని, అగ్గిపెట్టె గాని గావాల్లనా? "

"వద్దులే... వుండాదిలే" డ్రాయర్ జేబు తడుముకున్నాడు.

తండ్రి అప్పుడప్పుడు నిద్రలో ఎద్దులను కలవరించడం , ఒక్కొక్కసారి లేచి గాడిపాట్లోకి వచ్చి దేనికోసమో వెతకటం ప్రతాప్‌కు, వాళ్ళ అమ్మకి అనుభవమే! అరవై ఏండ్లకు పైగా అలవాటు పడిన ప్రాణం కదా అని చూసీ చూడనట్టు వుంటారు. మామ ఉత్త పాతకాలం మనిషి కదూ అత్తా అని కోడలు అంటే, అబ్బకి ఆ పెండ వాసన ల్యాకపోతే నిద్ర రాదు గావల్ల, మంచం కింద ఒకటి పెండగంప పెడితే మేలేమో! మెదల కుండా నిద్ర పోతాడు" అని సుధీర్ వాళ్ళ అమ్మ దగ్గర జోక్ చేస్తుంటాడు.

నడవలో వ్యతిరేక దిశలో కదిలి పోతున్న ఇద్దరి నీడలు గమ్మత్తుగా అనిపించాయి సుధీర్‌కు. ఒక చివర నారాయణ వాకిలి మూస్తుంటే యింకొక చివర ప్రతాప్ వాకిలి గడియతీస్తున్నాడు.

"ఈ యింట్లో చదువుకోవడమే కాదు, నిద్ర పోవటం కూడా కష్టమే! ఒకరు లేస్తే అందరికి డిస్టర్బు అయితాది.

వుండటానికేం వుంది? ఓ అని యింత పెద్ద యిల్లు. బయట అరుగులు, లోపల అరుగులు... వరసగా నలభై మంది పడుకోవచ్చు. అయినా ఏం లాభం? బెడ్ రూమ్స్ లేకుండా? రెండు రూములు వుండాయి కదా యింట్లో! ఆడ సదువుకొని అన్నే పండుకో.. ఎవరొద్దంటారు నిన్ను? అంటాది జేజి. కొట్టిడీలను పట్టుకొని బెడ్ రూములు అనడం ఏందో అర్థం కాదు. ఆ రూముల నిండా పెట్టెలు, సామాన్లు, మూటలు... ఎవరో ఒకరు అది గావాల్ల యిది గావల్ల అంటూ అ రూముల్లోకి రాడం పోడం... పొందా అదే సరిపోతాది...'

ల్యాప్టాప్‌లో చార్జింగ్ అయిపోతున్నట్టుగా సిగ్నల్ చూపిస్తోంది. చిరాగ్గా పైకి లేచాడు. ఒకటే స్విచ్ బోర్డ్. ప్రతాప్ సెల్లు చార్జింగ్‌లో వుంది.

"హూ... మిక్సీకి యిదే.. రైస్ కుక్కర్‌కు యిదే... టివికి యిదే... సెల్ ఫోన్లకు చివరకు ల్యాప్టాప్ కూడా యిదే గతి. ఇంతకంటే దరిద్రం యింగోకటి వుంటాదా యాడైనా? యిదిగో నువ్వే పెట్టుకో అంటారు. మళ్లీ కాసేపటికే ఒక్క నిమిషమేలే అని ప్లగ్ పీకి మిక్సినో యాదో ఒగటి తెచ్చి పెడతారు. పాపం అమ్మనే ఒక్కొక్కసారి పెద్దనాయన వాళ్ళింటికి పోతాంటాది మిక్సి ఎత్తుకొని. ఎట్లనో నెట్ కనెక్షన్ ఒకటి పెట్టిచ్చి బతికిచ్చినారు. ల్యాకపోతే సినిమా గనపడేది. ఇల్లే కొంచెం రీమాడల్ చేయిచ్చింటే ఈ తిప్పలు వుండవు. అందరికి బాగుంటాది. అమ్మకు అయితే ఈ బండలు తుడ్సల్యాక సాలయిపోతాంది. మనోజ్ గాని యిండ్లు బ్రమ్మండంగా వుంటాది అట్టనే. గ్రానైట్ బండలు... బాత్ రూమ్‌లో టైల్సు, కొళాయిలు... ఉద్యోగం వచ్చినాక చేసే ఫస్ట్ పని మాత్రం ఇల్లు రీమాడల్ చేయించడమే... జేజివాళ్ల కోసం మంచిగా లెట్రిన్ కట్టియ్యాల! ముందు బాగా సదవాలబ్బోయ్. ఈడ వుంటే అంతే! లేని ఆలోచనలు అన్నీ తలకాయలోకి దూరుతాంటాయి... ఏమేగాని పట్టిచ్చుకోగూడదు...'

◆◆◆

చేతులు తల కింద పెట్టుకొని ఆకాశం వైపు చూస్తూ పడుకున్నాడు ప్రతాప్. చంద్రుని దృష్టి తమ వైపు తిప్పుకోవ టానికి నక్షత్రాలు మిణుక్కు మిణుక్కుమని మెరుస్తున్నాయి. ఎవరో యింట్లో యింకా టీవీ నడుస్తున్నట్టుగా వుంది. సినిమా ఫైటింగ్ సౌండ్స్ వినిపిస్తున్నాయి. వెహికల్ వస్తున్న శబ్దం, దాని హెడ్ లైట్స్ వెలుగు దగ్గర అవుతూ వస్తోంది. తెల్లటి స్కార్పియో వచ్చి రెండు ఇల్లు అవతల ఆగింది.

"కొడుకు ఫారెన్ నుండి పంపిస్తాంటేనే కదా ఇతగాడు మాడీమిద్దె కట్టిచ్చ్యా, తోట కొన్యా, పెద్ద బండ్లు కొండ్రి. ఆడ వాడు ఎట్లా సంపాయిస్తాన్నాడో? ఎంత సంపాయిస్తాన్నాడో ఏమో? ఎన్ని ఉద్యోగాలు చేసి మిగలబెట్టి ఈటికీ పంపిస్తా న్నాడో? ఏం పిల్లోల్లు ఈ కాలం పిల్లోల్లు! సిటిలల్లో పనిజేసు కుంటా పల్లెలల్లో భూములు కొనేస్తాన్నారు. ఒకర్ని జూసుకొని ఒగరు... రేపు యింగొగాడు వస్తాడు. భూమి కొంటాము, కమీషన్ యిస్తామని. ఎంత ధైర్యంగా చెప్తారు! పెట్టుబడి ఎంతయినా పెడ్తాం... రెండేండ్లల్లో పెట్టిందంతా ఎనక్కు రావాలంట! ఈ కరోనా కాలంలో జనాలందరు దుమ్ము నాక్కోనిపోయింటే... వీళ్లకు మాత్రం మిగులుబాటు... డబ్బులు వుండాయనేనా వాళ్లు అట్ల ముందుకు వస్తాండేది? ల్యాకనేనా మేము వదిలిచ్చుకోవాలి అని అనుకుంటాండేది. కలిసి ఎవసాయం చేపిస్తారంట! ఈడేమో కలిసి చేసుకోకుండా కోట్లాడుకొని యిడిపోయ్యేది, చేసుకోలేక సచ్చేది. చ్యాతకాక అమ్ముకునేది. అమ్ముకొని ఆ యింత లెక్కలు నిమిషాల్లో అయిపోతాయి. అ తర్వాత వాళ్ళకాన్నే కూలికి పోవడ్తాది. ఎంత తిక్కనా కొడుకులం... తలకాయలు పూర్తిగా చెడి పోయేట్టుగా వుండాయి... వాళ్లు చేయంగా లేనిది, ఈన్నేపుట్టి ఈన్నే పెరిగిండేటోళ్లం మా చ్యాత కాదా? పెద్దలు యిచ్చిండే భూమి అమ్ముకుంటే ఏమన్నా వుందా మానం పోతాది... కొడుకులు వుండేటోళ్ళు భూమి కొంటారుగాని అమ్ముతారా యాడయినా అని నాయన అంటాంటాడు. యా అప్పో సప్పో చేసి పిల్లోల్లను సదివిచ్చుకోవాల.."

ఉదయం నుండి వున్న దిగులు ప్రతాప్‌కు యిప్పుడు లేదు. సాయంకాలం అరటి తోట దగ్గర సుధీర్ అన్న మాటలు గుర్తుకు వస్తే ప్రతాప్‌కు కడుపు నిండుగా చల్లగా అనిపిస్తుంది.

"నా పరీక్షలు అయిపోతానే జేజికి ఆపరేషన్ చేయిద్దాం నాన... చెట్లకు నీళ్లు ఎట్లా అని చింత చేయాకు. జేజి దగ్గర హాస్పిటల్లో నేను వుండి జూసుకుంటాలే. జేజికి కాలు బాగయితే అన్నీ సెటిల్ అయితాయి. తోటకు ఏం కాదులే"

సుధీర్ చాలా పెద్దవాడు అయినట్టుగా అనిపిస్తోంది ప్రతాప్‌కు. అప్పుల నుండి బయట పడగలను అన్న ధైర్యం మెల్లిగా కలుగుతోంది. రేట్లు వుంటే ఈ అప్పులు చేసే గాచారం ఎందుకుంటాది? ఈ మార్కెట్ మీదనే అమ్మ ఆపరేషన్, పిల్లల చదువులు ఆధారపడివుండాయే! వాళ్లకు వుండే మార్కెట్టు మాకు ఎందుకు వుండదు? వాళ్లు పండిచ్చే పండ్లు మేము పండీలేమా? యిన్నేండ్లు సంసారాన్ని యిగ్గకచ్చినా, యింగ ఓ మూడేండ్లు యిగ్గలేనా? అప్పటికంతా పెద్దోడు చేతికి వస్తాడు. యింగ చిన్నోనిదే ఒకటే వుంటాది సదువు. పెద్ద యిబ్బంది వుండదు..."

సుధీర్ వచ్చి తలకింద దిండు పెట్టి, దుప్పటి కప్పిపోవటం నిద్రలో వున్న ప్రతాప్‌కు తెలుస్తోంది. ■



# కార్మిక కర్షక ఐక్యతతోనే దేశానికి భవిష్యత్తు

- తపన్ సేన్

**ఆ**ర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం తెచ్చిన ప్రగతి నిరోధక, మోసపూరిత వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టేందుకు, ప్రభుత్వం మెడలు వంచేందుకు దేశవ్యాప్తంగా రైతులు ఏడాదికి పైగా వీరోచిత పోరాటం జరిపారు. ఈ పోరాటానికి కార్మికవర్గం నిరంతర సంఘీభావ కార్యక్రమాలతో మద్దతు నిచ్చింది. ఈ స్ఫూర్తితో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సంఘాల ఐక్యవేదిక 'ప్రజలను కాపాడుకుందాం, దేశాన్ని రక్షించుకుందాం' అని పిలుపునిచ్చాయి. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలతో మొండిగా సాగుతున్న మోడీ ప్రభుత్వాన్ని నిలువరించేందుకు మార్చి 28, 29 తేదీల్లో రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు ఈ ఐక్యవేదిక పిలుపునిచ్చి, విజయవంతంగా సమ్మె జరిపింది. దేశ సంపద సృష్టికర్తలు రైతాంగం, కార్మికవర్గం నిరంతరం జరిపే పోరాటాల కొనసాగింపుగానే ఈ సార్వత్రిక సమ్మె.

**ఐక్యవేదిక విస్తృతి :** నయా ఉదారవాద ఆర్థిక విధానాలను మనదేశంలో 1991లో ప్రవేశపెట్టారు. అప్పటినుంచీ జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల్లో ఇది 21వది. మూడు దశాబ్దాలుగా సంఘటిత, అసంఘటిత రంగ పరిశ్రమలు, సంస్థల్లో అనేక ఉద్యమాలు, పోరాటాలు జరుగుతున్నాయి. సార్వత్రిక సమ్మెల సందర్భంగా చేసిన కృషి ద్వారా కార్మిక సంఘాల ఐక్యవేదిక విస్తృతంగా బలోపేతమైంది. 2009 నాటికి దేశంలోని అత్యధిక కార్మిక సంఘాలు ఐక్యవేదికలో అంతర్భాగమయ్యా యి. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో దాని అనుబంధ బీఎంఎస్ ఐక్యవేదిక నుంచి వైదొలగినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేదు. వారి కేంద్ర నాయకత్వం ప్రభుత్వా నికి వత్తాసు పలికినప్పటికీ రక్షణరంగం వంటి అనేక రంగాల్లో సంస్థాగత పోరాటాల్లో బీఎంఎస్ సంఘాలు పాల్గొన్నాయి.

**పురోగతి :** బిజెపి పాలనలో ముఖ్యంగా రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి నయా ఉదారవాద విధానాల దూకుడు తారస్థాయికి చేరింది. ఆర్థిక వ్యవస్థలో ప్రధాన ఉత్పత్తిదారులైన కార్మిక, కర్షకులు.. ఆ విధానాలతో ప్రభావితమయ్యే విశాల ప్రజానీకం భాగస్వామ్యంతో జరిపిన పోరాటాల ఫలితంగా పాలక వర్గాల నిజస్వరూపం మరింత స్పష్టంగా బయట పడుతోంది. ప్రజల జీవనోపాధి, హక్కులపై అధికార గర్వంతో అత్యంత క్రూరంగా వేధింపులకు పాల్పడ టాన్ని దేశం మొత్తం చూసింది. కోవిడ్ మహమ్మారి కాలం మొత్తంలో పాలకుల దాడి అతిక్రూరంగా, అమానవీయంగా స్పష్టంగా కనిపించింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల్లో కోరుకున్న విధ్వంసక విధానాలను అధికారం అడ్డం పెట్టుకుని ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రజల నిస్సహాయతను ప్రభుత్వం నిస్సిగ్గుగా ఉపయోగించుకుంది. ఈ పనులన్నీ బాహాటంగా జరిగాయి. చిన్న కమతాల వ్యవసాయాన్ని నాశనం చేసి లాభాపేక్షే ధ్యేయంగా ఉన్న బడా, గుత్త పెట్టుబడిదార్లకు (కార్పొరేట్లకు) వ్యవసాయ రంగాన్ని ధారాదత్తం చేయడానికి వినాశకర వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం తెచ్చింది. వ్యవసాయ రంగంపై అధికారం, ఆదాయం మొత్తం కుబేరుల గుప్పిట్లో ఉంటుంది. ఇప్పటికే ఆకలితో అల్లాడుతున్న ప్రజానీకాన్ని, దేశం ఆత్మవిశ్వాసాన్ని, స్వావలంబనను నిప్పుల కుంపట్లోకి నెట్టే చట్టాలను ప్రభుత్వం చేసింది. అంతులేని లాభాపేక్షతో అర్రులు చాచే బడా పెట్టుబడిదారీ వర్గాన్ని సంతృప్తి పరచేందుకు కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను ఈ కాలంలో ప్రకటించింది. సంక్షోభం కొనసాగుతుండగా, ఉత్పాదకాభివృద్ధి ఘోరంగా క్షీణిస్తున్న దశలో, ఉద్యోగాలు – ఉపాధి – ఆదాయాలు కోల్పోతూ ఉ పాధి సంబంధాలు స్తబ్దుగా ఉన్న సమయంలో కార్మికులు – ఉద్యోగులపై వ్యయం సాధ్యమైనంత తగ్గించుకునే అవకాశాన్ని

కార్పొరేట్లకు ప్రభుత్వం కల్పించింది. ఆహారం, చమురు, విద్యుత్, మందులు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు ద్రవ్యోల్బణం కారణంగా ఆకాశాన్నంటుతుండగా.. సాధారణ ప్రజానీకం సగటు ఆదాయాలు గణనీయంగా క్షీణిస్తున్న దశలో కార్పొరేట్లను సంతృప్తి పరచేందుకు మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా సిద్ధపడింది. విశాల ప్రజానీకాన్ని దోచుకునే ఉపకరణాన్ని కార్పొరేట్లకు, బడా వ్యాపారవర్గాలకు అందించింది. ఉద్యోగాలు, ఉపాధి కోల్పోవడం, నాణ్యమైన ఉపాధి కల్పన తిరోగమనం వల్ల నిరుద్యోగం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ఫలితంగా పేదరికం, దారిద్ర్యం, ఆకలి పెద్దఎత్తున తాండవిస్తున్నాయి. 2022–23 బడ్జెట్ అదే వినాశకర విధానాలను బయట పెట్టింది.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నయా ఉదారవాద ఆర్థిక విధానాల్లో అంతర్భాగమే. ఈ మూడు దశాబ్దాలుగా రకరకాల పద్ధతుల్లో ప్రైవేటీకరణ ప్రక్రియ నడుస్తోంది. చివరకు 'జాతీయ మానిటైజేషన్ ప్రాజెక్టు' పేరున దేశ సంపదను పాలకుల సన్నిహితులకు అప్పనంగా దఖలుపరిచే ప్రక్రియ చేపట్టింది. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ పైసా ఖర్చు లేకుండా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల పరం చేస్తున్నారు.

**పోరాటాల ఉధృతి :** కాగా, అన్ని వర్గాలకు చెందిన పీడిత ప్రజలు నూతన ఒరవడిలో పోరాటాలు చేయడం ఈ కాలంలో చూస్తున్నాం. 2020 మార్చి చివరి నుంచి కోవిడ్ పేరున అనేక నెలలపాటు దేశాన్ని అన్ని విధాలా ప్రభుత్వం స్తంభింపజేసింది. లాక్‌డౌన్ విధించారు. ఏ రకమైన ఉద్యమాలను, సమీకృత కార్యక్రమాలను, ప్రచారాలను అనుమతించలేదు ఇటువంటి పరిస్థితుల్లో 2020 నవంబరు 26న 20వ సార్వత్రిక సమ్మె దిగ్విజయంగా జరిగింది. 1991 నుంచి జరిగిన అన్ని సార్వత్రిక సమ్మెల్లో ఇదే అత్యంత ఉధృతంగా జరిగిన సమ్మె. పరిస్థితులు విసురుతున్న సవాళ్లను అత్యంత చైతన్యవంతంగా సరికొత్త మార్గాల్లో ఎదుర్కొని.. సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎంతో పట్టుదలతో ఆ సమ్మె నిర్వహించారు. ఆ రోజు నుంచి రైతులు దేశ రాజధానిని నలువైపులా ముట్టడించి వినాశకర, దుర్మార్గమైన, ప్రజలందరి బతుకులను ఛిద్రం చేసే వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలని సంవత్సరం పైగా సాగిన చారిత్రాత్మక పోరాటాన్ని ప్రారంభించారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వికేంద్రీకరణ పద్ధతుల్లో యావత్ కార్మికవర్గం అనేక సంఘీభావ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, చురుగ్గా పాల్గొంటూ రైతుల పోరాటానికి మద్దతు ప్రకటించింది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ అన్ని ప్రాంతాల్లో సంఘ ప్రాతినిధ్యంతో నిమిత్తం లేకుండా అన్ని సంఘాల కార్మికులు మద్దతుగా నిలిచారు.

కార్మిక సంఘాల ఐక్యవేదిక దేశవ్యాప్త చురుకైన సంఘీభావ కార్యక్రమాల ఫలితంగా కార్మిక సంఘాల ఐక్యవేదికకు, రైతు సంఘాల ఉమ్మడి వేదికకు మధ్య బంధం బలపడింది. కార్మికవర్గం, రైతుల ఈ ఐక్యత, సంఘీభావ కార్యక్రమాలు జరిగే క్రమంలో నూతన ఒరవడికి దారితీశాయి.

భారతదేశంలో ఆదాయాల వ్యత్యాసం మునుపెన్నడూ ఎరగనంత హీనస్థితిలో ఉంది. పైస్థాయిలోని ఒక్కశాతం మంది దేశ సంపదలో మూడు వంతుల మొత్తాన్ని కలిగి ఉన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న అట్టడుగు పేదలందరి సంపద 6 శాతం మాత్రమే. 2020 నాటికి పైస్థాయి పది శాతం వద్ద 57 శాతం సంపద పోగుపడింది. అట్టడుగు స్థాయి సగం దేశ జనాభా 13 శాతం మాత్రమే కలిగిఉంది. పై ఒక్క శాతం మంది 22 శాతం దేశ ఆదాయాన్ని లాగేసుకున్నారు.

సంవత్సర కాలంగా దేశ జీడీపీ పెరుగుదల విలోమ దిశలో (నెగెటివ్) ఉంది. ఇదే కాలంలో కార్పొరేట్ వర్గాలకు చెందిన పైస్థాయి బిలియనీర్ల సంపద 40 శాతం పైగా పెరిగింది. వారిలోని కొంతమంది సంపద గతంకంటే ఈ సంవత్సరం 8 నుంచి 10 రెట్లు పెరిగింది. వీరి సంపదలోని ఈ అనూహ్య పెరుగుదల ఏ విధమైన ఉత్పత్తి క్రమం నుంచి వచ్చింది కాదు. కేవలం ప్రజలను దేశ సంపదను అనేక ప్రభుత్వ పథకాల పేరున దోపిడీ చేసి పోగేసుకున్నారు. ప్రభుత్వమే తన అధికార, పాలనాపటిమతో పథకాలను రూపొందించి కార్పొరేట్ శక్తులకు ఆ అవకాశం కల్పించింది. మోడీ ప్రభుత్వం దేశాన్ని మబ్బులో ఉంచి ప్రజల నోట్లో దుమ్ముకొట్టి అడ్డూ అదుపూ లేని ఈ ఆశ్రిత పక్షపాతాన్ని పెంచి పోషిస్తోంది.

**ఐక్యపోరాటాల ఆవశ్యకత :** కార్మికులు, రైతులు తమ, తమ సమస్యలకు ఉమ్మడి కారణాన్ని కలిగి ఉన్నారు. బడా కార్పొరేట్లు (గుత్త పెట్టుబడిదారులు) నడిపే ప్రభుత్వమే ఉమ్మడి శత్రువని, దానితో కలిసికట్టుగా తలపడవలసిందేనని గుర్తించారు. కార్మికులను, ప్రజలను, యావత్ దేశాన్ని నాశనం చేసే వినాశకర పాలనకు వ్యతిరేకంగా మార్చి 28, 29 తేదీల్లో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఇకముందు జరగబోయే కార్మివర్గ ఐక్య కార్యాచరణకు నాంది. దేశ సంపదను కొల్లగొట్టే గుత్త పెట్టుబడిదార్లకు (బడా కార్పొరేట్లకు) వ్యతిరేకంగా సామాన్య ప్రజానీకం బతుకుదెరువు, హక్కుల కోసం జరిగే పోరాటం ఇది. ఈ సమ్మె కేవలం జీవనోపాధి, హక్కుల పరిరక్షణ కోసం మాత్రమే కాదు. దుర్మార్గమైన దోపిడీ, వినాశనం నుంచి దేశాన్ని పరిరక్షించే ఉన్నతమైన రాజకీయ లక్ష్యంతో జరిగింది. ■

కవిత

# నీరు మింగిన నేల

- గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201

ప్రవహించిన నది
పూర్తిగా కప్పేసింది నేలని
ఉప్పొంగిన నది స్థిరమై
కొండని కోనని ముంచేసింది!

నది చుట్టూ వర్ధిల్లిన మనుగడను మట్టెట్టింది
గూగుల్‌కి అందని గూడేలని సైతం గుటుక్కు మింగింది
నదిని ఆసరాగా చేసుకుని తీరాన ఆవాసాలు
ఒండ్రు మట్టి నేల ఆసరాగా ఆలంబన
తమదైన సంస్కృతి విరాజిల్లిన నేల
జంతు సావాసంలో ఎదిగిన మనిషి
మునిగిన గుడిసెలో గతాన్ని నెమరు వేసుకుంటూ
రేపటి కోసం ఆలోచనలో ...

ఎన్ని గుడిసెల్లోనో ఎన్ని బతుకుల్లోనో
శోకాన్ని నింపిన నది
ఆవేశం ఆక్రోశం చల్లారి
అడ్డుకట్టని సుతారంగా తాకుతుంది
వెనుకకు తిరిగి చూసుకుంటే
తాను చేసిన విధ్వంసపు చిహ్నాలు కానవస్తాయి
ఒక్కో చెట్టు ఎన్నేళ్ళ ప్రాయమో
యవ్వన దశలోని చెట్లు సైతం
ఆయుస్సు మూడి గూడేలతో పాటు జల సమాధి
చెట్టుతో పాటు మీది గూడు మునిగితే
తల్లడిల్లిన పిట్ట ప్రాణం
తమతో పాటు తమ కోసం పారిన నది
నట్టేట ముంచుతుందని ఊహించని జీవ రాశులు
ఎంతటి మిత్ర ద్రోహం! మహా విషాదం!

మనిషి అంతే.. తన సమూహంతో
ఓ తెగ ఓ జాతి వలస
అన్నీ కోల్పోయి ఇంకా ఎత్తైన కొండ మీదికి అదే చోటు
మైదానం రుచించదు
అవే విల్లులు అవే బాణాలు అదే వేట
ఆ అడవిలో దొరికేవే ఆహారం
ఇంకో చెట్టుకి పుట్టకి మొక్కు



తనదైన బతుకు ఎవ్వరికీ హాని కలిగించక
అక్షరం లేక పోయినా
తన తరపున గొంతులు విప్పారవని ఎరుగు

వెనుక ముంచి ముందుకు సాగే కాలువల్లో
కమురు వాసన పసి గట్టలేరు
ఆనవాళ్ళు లేని ఇళ్ళు వెనుక
గుమ్ములు నిండే ఇళ్ళు ముందు
రెంటి మధ్య నవ నాగరికుల పోలవరం
ఎవరికి వరం! ఎవరికి శాపం!

కవిత

# చిన్నతోక - పెద్దలోపం

- చందలూరి నారాయణరావు

97044 37247



**ఆ** చిన్న తోకతోనే ఆడుతుంది
లోకమంతా ...
దానికి లోబడి నడుస్తుంది
కాలమంతా ...
ముందు కనిపించని వెనుక రహస్యం
వెనుకుండి నడిపించే ముందు నిజం

పేరు చివరలోనూ
ఊరుమొదటలోనో
వీధి మధ్యలోనో
మాట పొట్టలోనో
ఎక్కడున్నా చాలు
ఆ బలమే ఆయుధం
ఆ బలగమే శాసనం!

ఎంతటి దూరాన్ని కూడా ఛేధించి
దగ్గరగా చుట్టేసి చుట్టుకుపోతూ
మనసులో మునిగి మనుషుల్ని తేల్చి
ఓ ఒడ్డుకు నెట్టి
గిరి గీసి 'కులాన్ని ఆ చిన్నతోక'గా
గౌరవంతో తాపడం చేసి
దూకుడును, ధిక్కారాన్ని
వరుసను, వర్గాన్ని, గర్వాన్ని, బంధాన్ని
ఓ గొలుసుతో లోకానికి
అనుసంధించిన భావజాలమే
బహిరంగ రహస్యమే 'కులం'

ఒక రంగు రుచిమరిగిన కళ్ళు
ఒక మత్తుకు బానిసైన మనసులు
ఒక రుచికి లంగిన నాలుక
ఒక స్వరానికి అలవాటైన కంఠం
మరొకనేమాట వినిపించుకొని
చెవుల్లో ఏపుగా పెరిగిన వివక్ష
పీల్చే గాలికి గీతలు గీసి తాగే నీటికి తగాదా నేర్పి
బతుకుల్లో విపరీతాలని
మనసుల్లో వైపరీత్యాలను పోషించే విషం
పూజించే కల్మషం 'కులం'

వీరి మధ్య ఏ తోకలేనివారే అనాధులు
అన్నీ ఉన్నా ఒంటరి విరోధులు
నిత్యం ఏదో ఒక చోట పీడించబడే అభాగ్యులు

పుట్టేది ఏ కులమో తెలియకపోయినా
కళ్ళు తెరిచేలోగే ముఖంపై ఓ ముద్రతో
అడుగుపెట్టే లోకంలో
శాసించే శక్తికి వారసులు గానో
వివక్షకు బలయ్యే బలహీనులు గానో
ఎవరికి ఎవరు తెలియదు

పుట్టుక చావు, చీమూ నెత్తురు
ఆకలీ నిద్ర, కోరికా కల
అంతా, అన్నిటా ఒకటే
అయినా ఒక్క పదం మనసును
నిలువుగా చీల్చే అభిమానం ఒకచోట
అనివార్యం మరో చోట

ఎక్కడిదీ వైరస్... ఎప్పటికో వాక్సిన్
ఎవడికి పుట్టిన బుద్ధిలోపమో?
లోకంలో అడుగడునా శాపమే
ఎప్పు డూ ఎక్కడో ఒక చోట ఘోరమే! ■






# నానీలో కరోనా కాలాన్ని బంధించిన చలపాక ప్రకాష్

- వోర ప్రసాద్
94900 990

**కరోనా** వైరస్ ప్రపంచాన్ని ఒక్కసారిగా లాక్‌డౌన్ చేసింది. హడావుడిగా సాగిపోయే ఆధునిక మానవుడి జీవితానికి సడన్ బ్రేక్ వేసింది. సమయం చాలా విలువైందంటూ మానవ సంబంధాలను సైతం పణంగా పెట్టి వేగంగా సాగిపోతున్న మార్కెట్ వ్యవస్థ అనివార్యంగా విరామాన్ని ప్రకటించక తప్పలేదు. ఊహించని విధంగా మానవ జీవితాన్ని అతలాకుతలం చేసింది కరోనా. ప్రాణాంతకంగా మారి ప్రపంచం నలుమూలలనూ చుట్టిముట్టి మనుషులపై తన ప్రతాపాన్ని చూపించింది. ఎన్నో ప్రాణాలను హరించింది. ఎందరినో ఆసుపత్రి పాల్జేసింది. కరోనా వైరస్ తాకని కుటుంబం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం కొంత శాంతించినట్టే కనబడుతుంది. ఎక్కడ ఏ చిన్న జ్వరమొచ్చినా 'కరోనానా' అనుకోవడం మామూలైపోయింది. ఇలాంటి కరోనా అనుభవాలను నానీల ప్రక్రియలో చలపాక ప్రకాష్ 'కరోనా నానీలు' పేరుతో తెలుగు పాఠకులకు అందించాడు.

సీనియర్ రచయితగా, నానీల ప్రక్రియలో తగిన కృషి చేసిన నానీల కవిగా చలపాక ప్రకాష్ గుర్తింపు పొందారు. ఈ పుస్తకంలో నానీలు కూడా పాఠకుడి మనసుని అందుకునే స్థాయిలో ఉన్నాయి. నాలుగు చరణాల ఒక మంచి నానీ ఒక్కసారి పాఠకుడు చదివితే గుర్తుండిపోతుంది. అలాంటి నానీలు ఈ పుస్తకం నిండా ఉన్నాయి. కరోనా వైరస్ చాలా ప్రమాదికారి. ఒకరి నుండి ఒకరికి వేగంగా వ్యాపించే లక్షణంతో మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసింది. కరోనా సోకిన వ్యక్తి సమీపంలోకి కూడా సాటి మనిషిని వెళ్ళకుండా చేసింది. దానితో కరోనా సోకిన మనిషి, అతని కుటుంబం అంటరానితనాన్ని చవిచూసింది. సన్నిహితులు, మిత్రులు అనుకున్నవారు కూడా 'కరోనా' సోకిన వారికి కనీస తోడ్పాటు ఇవ్వడానికి కూడా ముందుకు రాని సంఘటనలు పత్రికల్లో చదవాల్సి వచ్చింది. ఇక కరోనా సోకిన వారి బాధ వర్ణనాతీతం. ఒకపక్క కరోనాతో శారీరక అనారోగ్యంతో బాధపడుతూ, మరోపక్క సాంఘిక వెలివేతను భరించి జీవించాల్సి వచ్చింది. నిజంగా కరోనా మానవత్వానికి, మానవ విలువలకి అగ్నిపరీక్షే పెట్టింది. కరోనా కాలంలోని వేదనాభరితమైన మానవ అనుభవాలు నానీల ప్రక్రియలో మనల్ని పలకరించి మన గుండెల్ని మెలిపెడతాయి. కరోనా కాలంలో కరోనా వల్ల ఉత్పన్నం అయిన అనేక ప్రత్యేక పరిస్థితుల్ని వైవిధ్యంగా ఈ నానీల రూపంలో చలపాక ప్రకాష్ మన ముందుకు తెచ్చారు.

ఆ వీధిన వెళ్ళిన/ అంబులెన్స్

తిరిగి వస్తుందేమిటి/ మహా ప్రస్థానమై! అని సందేహ పద్ధతిలో ఒక భయానక స్థితిని దృశ్యీకరిస్తాడు. మన వీధుల్లోకి అరుదుగా మాత్రమే అంబులెన్స్ వస్తుంది. అదే పనిగా అనేకసార్లు వస్తున్న అంబులెన్స్‌ను 'మహాప్రస్థానమై' వస్తుందంటాడు కవి. శవాలుగా మారిన మనుషులను తీసుకెళ్ళడానికి అంబులెన్స్‌లు సరిపోలేదు. హాస్పిటల్స్ సరిపోలేదు. కరోనా వేగంతోటి అంబులెన్స్‌ల వేగం పోటీ పడలేకపోయిన పరిస్థితి మనం చూసాం. ఆ దృశ్యాలన్నీ ఈ నానీ మనకు గుర్తుచేస్తుంది.

ఎంత ప్రేముంటే/ ఏముంది?

కౌగిలింత, షేకెండ్/ ఇచ్చి పుచ్చుకోలేనపుడు

అన్న నానీలో మనుషులు కలుసుకున్నపుడు, తమ మధ్య

ఉన్న అనుబంధాన్ని, ప్రేమను వ్యక్తం చేయడానికి కరచాలనం చేయడం, హత్తుకోవడం మన జీవితంలో భాగమైపోయింది. ఆధునిక సంస్కృతిలో సాధారణంగా మారిన ఈ అలవాట్లకు కరోనా అడ్డంగా నిలబడింది. కరచాలనాలు, కౌగిలింతలూ లేని కలయిక కవికి అసంతృప్తిగా అనిపించింది. చాలామంది ఈ నానీ చదివిన పాఠకులు 'మాక్కూడా అలానే అనిపించింది' అని కవితో కరచాలనం చేస్తారు.

పాత అలవాట్ల నుండి మారిపోవాల్సి రావడం బాధ కలిగించినా, కొన్ని కొత్త మార్పులకు కరోనా మార్గం చూపిందంటున్నాడు కవి –

గృహమే కదా/ స్వర్గసీమ!

లాక్‌డౌన్‌లో గాని/ తెలిసి రాలేదు అంటాడు ఓ నానీలో.

కుటుంబంలో అందరూ కలిసి కూర్చుని సరదాగా గడిపే అవకాశం అరుదైపోయిన కాలంలో కరోనా వచ్చింది. అందర్నీ ఇంట్లోకి నెట్టి తలుపేసింది. అనివార్యంగా కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే గడపాల్సి వచ్చింది. అది ఒకందుకు మంచిదే అని ప్రకాష్ ఈ నానీ ద్వారా మన దృష్టికి తెస్తాడు. కవి ఈ నానీలను ఎంతో శ్రద్ధగా రాయడంతో పాటు ప్రతి నానీకి అర్థవంతమైన చిత్రాన్ని జతచేసి మరింత విలువ చేకూర్చటం బాగుంది. ఆయా నానీలను చదివిన పాఠకుడు పక్కనే ఉన్న చిత్రాన్ని చూసి మరింత భావ గాఢతని పొందుతాడు.

విభిన్నమైన ఆలోచనలను, భావాల్ని నానీల్లో చక్కగా వ్యక్తీకరించాడు చలపాక ప్రకాష్. ఆ విలక్షణత వల్ల కొన్ని నానీలు మరింత ఆకట్టుకుంటాయి.

ఒక్కపూటా ఇంటిపట్టున / ఉండడట!

మరి లాక్‌డౌన్ వేళ/ ఏం చేసాడో! అంటాడు చమత్కారంగా!

యువకులు ఇంటిపట్టున ఉండకుండా తిరిగే అలవాటు కరోనా కాలంలో సాధ్యం కాదు కదా! ఆ విషయాన్ని నానీగా మనముందు ఆవిష్కరించి ఇల్లు వదిలి బయట తిరిగేవారిని కొంటెగా ఆటపట్టిస్తాడు.

బంధుమిత్రులు/ ఎందరుంటేనేం?

కరోనా రానంత వరకే/ అందరూనూ!

ఈ నానీ బంధుత్వాల, స్నేహాల నిజమైన అర్థాన్ని ప్రశ్నిస్తుంది. అన్నిటా ఆసరాగా ఉంటారని నమ్మిన బంధువులు, స్నేహితులు కరోనా సమయంలో మొహం చాటేయడం ఒక విషాదం. ఇటువంటి సమయాల్లో మనుషులుగా మనం ఉన్నతంగా, మానవత్వంతో ప్రవర్తించడానికి మార్గాలేంటి అని ఆలోచిస్తాం. కరోనా కాలంలో ఎందరికో ఇటువంటి అనుభవాలు ఎదురై మానవ సంబంధాల మీదే వెగటు పుట్టింది. నిజంగా ఇటువంటి పరిస్థితులు మానవులకు పెద్ద సవాలుగా ఎప్పటికీ ఉంటాయి. ఆ సవాలును స్వీకరించే స్థితికి మనుషులు, సమాజం ఎదగాలి. అంతకు మించి మార్గం లేదు. కరోనాలు వచ్చినా మనుషులు మానవత్వంతో ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలని కవి ఆకాంక్ష.

ఇవాళ శవాన్ని / మోసుకుపోతుందెవరు?

అందరూ ఉన్నా/ ఏమీ కానివాళ్ళు

అన్న నానీలోని వాస్తవాన్ని పట్టిస్తూ పత్రికల్లో మనం అనేక వార్తలు వచ్చాయి. బంధుమిత్రులు, అయినవాళ్ళు ఎవరూ దగ్గరకు రానప్పుడు ఆసుపత్రి సిబ్బంది లేదా అంబులెన్స్ నిర్వాహకులో శవాలను తీసుకెళ్ళి ఎటువంటి తంతూ లేకుండానే అంతిమ సంస్కారాన్ని ముగించిన సంఘటనలు కవి దృష్టిని దాటిపోలేదు. ఏమీ కానివాళ్ళయినా ఆ సమయంలో వాళ్ళే అయినవాళ్ళయిన ఒక సందర్భాన్ని పాఠకుడి ముందుకు తీసుకువస్తాడు. నాలుగు చరణాల సరళమైన అక్షర సముదాయంలో ఎంతో లోతైన భావం ఇటువంటి నానీల్లో మనకు కనబడుతుంది. నాలుగు మాటలే కాని మనసును ఎంతో కల్లోలపరుస్తాయి. మానవ సంస్కారాన్ని తట్టి లేపడానికి నాలుగు అక్షరాలు కలిస్తే చాలనిపిస్తాయి.

చలపాక ప్రకాష్ కవి, విమర్శకుడు మాత్రమే కాదు. 'రమ్యభారతి' త్రైమాసిక పత్రికను సుదీర్ఘ కాలంగా వెలువరిస్తున్న ఆ పత్రికకు సంపాదకుడు కూడా. అందుకే కరోనా ప్రభావం పత్రికలపై పడటాన్ని విస్మరించలేదు.

అక్షరాలను తాకింది/ కరోనా దెబ్బ

పిట్టల్లా రాలిపోతున్నై/ పత్రికలు అన్నాడు.

ఈ కరోనా కాలంలో ఎన్నో వారపత్రికలు, మాసపత్రికలు కొనసాగలేక మనుగడ కోల్పోయాయి. కొన్ని విరామం ప్రకటించవలసి వచ్చింది. కరోనా అనంతరం కొన్ని తిరిగి తల ఎత్తుకున్నా ఎన్నో పత్రికలు శాశ్వతంగా మూతపడ్డాయి. ఆ పరిస్థితిని వేదనతో నానీలో ఒదిగించాడు చలపాక ప్రకాష్.

ప్రముఖ కవి, నానీల రూపానికి శ్రీకారం చుట్టిన డా॥ ఎన్. గోపి "ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో 'ఉదహరించదలిస్తే ఇందులోని ప్రతి నానీ ఒక గాయపడ్డ జీవన

శకలం. వీటి సాహిత్య విలువల ఉటంకింపులకిది సమయం కాదు. కీర్తి కోసం రాసిన నానీలు కావివి. ఆర్తితో ఎలుగెత్తి ఆక్రోశిస్తున్నవి. రేపటి తరాల కోసం రికార్డు చేస్తున్న ఆర్కైవ్స్ కవితలు' అని రాయడం చాలా సందర్భోచితంగానూ, వాస్తవికంగానూ ఉంది.

ఈ పుస్తకంలో కరోనా నానీలతో పాటు కొన్ని ఇతర సామాజిక అంశాలతో కూడిన నానీలు కూడా చలపాక జతచేశాడు. వాటిలో కరోనా ప్రస్తావన లేదు కానీ సమకాలీన సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న అంశాలను నానీలుగా రూపుకట్టారు. ముఖ్యంగా మహిళలపై రాసిన నానీ

ఇక కత్తులై/ మొలవాలి
ఆడపిల్లల రక్షణకై/ చేతిగోళ్ళు

అని రాసిన నానీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాలు, హింసను మనకు గుర్తుచేస్తుంది. నేడు ప్రతీక్షణం స్త్రీలపై జరుగుతున్న ఘోరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆ భయానక పరిస్థితిని మహిళలు ధైర్యంగా ఎదుర్కోవడానికి సన్నద్ధం కావాలని కవి ఆకాంక్షిస్తాడు.

చిన్నారి లోకేశ్వరి రాసిన నానీలకు కూడా తన పుస్తకంలో చోటిచ్చి చలపాక ప్రకాష్ ప్రోత్సహించడం అభినందనీయం. ఈ పుస్తకంలోని మరో ముఖ్యమైన అంశం గురించి ప్రస్తావించాలి. కరోనా కాలంలో చనిపోయిన రచయితలు, ప్రముఖులు, చలపాకకు అత్యంత సమీప బంధువులు అయిన 72 మందికి ఈ పుస్తకంలో కొన్ని పేజీలు కేటాయించడం. వారి గురించి క్లుప్త వివరాలను అందించడం బావుంది. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, సింగమనేని నారాయణ, తుర్లపాటి కుటుంబరావు, దేవీప్రియ, పోరంకి దక్షిణామూర్తి, కాళీపట్నం రామారావు వంటి ప్రముఖులతో పాటు మరెందరినో కోల్పోయిన విషయం మనం గుర్తుచేసుకుని మరోసారి నివాళి అర్పిస్తాం.

చలపాక 'కరోనా నానీలు' పుస్తకం బాధ్యతగా తీసుకొచ్చిన విషయాన్ని తన మాటలో ప్రస్తావించడమే కాకుండా, అలా తీసుకొచ్చిన సహ రచయితల పుస్తకాలను పరిచయం చేయడం తన సహృదయతకు నిదర్శనం. కరోనా కాలంలో కరోనా అంశంతో వచ్చిన 14 పుస్తకాలను పరిచయం చేస్తూ రాసిన వ్యాసాన్ని ఈ పుస్తకంలో చేర్చడం బావుంది. మొత్తంగా కరోనా చేసిన విలయాన్ని తన చిన్ని పుస్తకంలో తగినంతగా రికార్డు చేయడానికి చేసిన మంచి కృషి చలపాక ప్రకాష్ చేశారు. అందుకు రచయితను తప్పక అభినందించాలి. ■



## తడి విలువ తెలిస్తే...

**అ**క్షరాలు దిద్దించి
ఒడి నుంచి దించి బడిలో వదలేసి
వెళుతున్న నాన్న కన్నుల్లో తడి విలువ తెలిస్తే !
నవమాసాలు మోసి
పురిటినొప్పుల్ని ఓర్చి పసికూన ఏడుపు
వినగానే అమ్మ కంట్లో తడి విలువ తెలిస్తే !

చల్ల పుచ్చుకొని కాసేపు సేదదీరి
కదలిపోతున్న బాటసారిని చూస్తున్న
గృహిణి నయనాల్లో తడి విలువ తెలిస్తే !
కూతురు పెళ్ళికూతురై
పుట్టిల్లు విడిచి మెట్టింటికి వెళుతుంటే
ఊరు ఊరందరి కళ్ళల్లో తడి విలువ తెలిస్తే !

ఒక్క గుండె ఆగిపోతే
సాగలేక ద్రవించే కోటానుకోట్ల
హృదయాల్లోని తడి విలువ తెలిస్తే !
'మానవుడే మహనీయుడై
ఈ లోకమే స్వర్గమై విరిసిల్లదా'

**- సురేంద్ర రొద్ద**
94915 13570

# నిప్పుల దీపం?

- బి.గోవర్ధనరావు
94419 68930

1
ఎవడో.. ఒకడు
కాలాన్ని కూడా గుప్పెట్లో వుంచే
ప్రయత్నం చేస్తున్నాడు!
ఏదో ఒక క్షణాన
ఎవరో ఒకరి పక్షాన నిలబడి
ఒక విధ్వంస ఘటనకు
ముందు మాటను రాస్తూ..
వర్తమానంపై వాడిన
వసంతాలను తెస్తున్నాడు!
యుద్ధ మేఘాలను ఆహ్వానిస్తున్నాడు!
నిండు జీవితాల మీద
బోసి నవ్వుల మీద
బీభత్సాన్ని కురిపిస్తున్నాడు!
రేపటి రోజును
అభద్రత వైపు..
అపాయం వైపు తీసుకెళ్తున్నాడు!

2
రాజ్యాలాడుకునే పాచిక లాటలో
పావులా కదులుతూ
పాదరసంలా జారుతూ
దాడుల సంక్షోభాలను
దాగని దుఃఖ కల్లోలాలను
నలువైపులా పంచుతూ
సామ్రాజ్య వాదాగ్నులను
యథేచ్ఛగా విసురుతూ –
చేదు జ్ఞాపకాల బాధల్ని
మానని గాయాల గాథల్ని
అందరికీ అందిస్తూ –
మరణ మృదంగాలను పలికిస్తూ –
హింసధ్వనితో విహరిస్తూ –
గర్భశోక ఘోషల్ని ఆస్వాదిస్తున్నాడు!




3
ఎప్పటి నుంచో పొంచున్న రాజ్యకాంక్ష
దమనకాండగా మారి
జన జీవనంపై విరుచుకు పడుతుంది!
ప్రగతిదారులను విడదీస్తుంది!

ప్రేమలు పలకరింపులు,
ఆప్యాయతలు.. అనుబంధాలు
మమతలు.. మానవీయతలు
కన్నీటి కథలవుతాయి!
చరిత్రలో మరో చీకటి అధ్యాయం మొదలవుతుంది!

4
ఒక వైపు.. సాఫీగా సాగే
బతుకు పయనం –
కల్తీల కాటుకు, దోపిడీ దారుల వేటకు
బలై పోతున్నపుడు
మరో వైపు.. విషాదపు వైరస్
మృతుల భాషలో.. వేస్తున్న ప్రశ్నలకు ..
బదులివ్వలేని నేతలు..
ఫెయిల్యూర్ స్టోరీలు రాసుకుంటూ
ప్రజల భవితను అగాథాల వైపు
అంధకారం వైపు నడిపిస్తున్నపుడు –
పాలకుల నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ
మండుతున్నదొక – నిప్పుల దీపం! ■

# ఉక్కు రి బిక్కిరవుతోంది!

- గుండాన జోగారావు
63027 18715



గద్దెక్కిన గెద్ద కన్నేసింది
త్యాగాల కోడిపెట్ట
లాభాల పిల్లల్ని
విదేశీ సర్పనీడలో
పెంపకానికి ఇస్తే
అది అంపకం కాదు
చంపడానికే నన్నది
జగమెరిగిన సత్యం ...


'ప్రభుత్వం చేయాల్సింది పరిపాలన
అస్సలు కానే కాదు వ్యాపారం'
అని రానాలు వ్యాఖ్యానించినప్పుడు
ఏ సఖ్యతకై ఈ ఉపహారం?
అమర జీవుల బలిదానం
గ్లోబళాయి వశమైతే
ఇక చేయాల్సింది శవ జాగరణే...

ఉద్యోగ భద్రత కొరవడి
నియంతృత్వ ఉరవడితో
కార్మికుల్లో అలజడి మొదలై
ఆనవాళ్ళు నిలుపుకోవడం
సవాలుగా మారుతుంది ...
ఏ ఉదయం ఉద్వాసన పత్రంతో
స్వాగతం పలుకుతుందో
ఏ సంక్లిష్ట సందర్భం దోషిగా
నలుగురిలో తలదించేలా చేస్తుందో
ఏ అభియోగ పత్రాలు
హృదయాందోళన కారణమవుతాయో ...
అందాల్సిన సొమ్ము అందక దిగులుతో
ఎందరు సొమ్మసిల్లి పడిపోతారో ...

కర్మాగారం ధర్మ ప్రభువుల
నిర్లక్ష్యానికి సాక్ష్యమైనప్పుడు
నిరసనతో నిలదీతతో
గొంతెత్తి వంతపాడుతూ

ఉద్యమ స్ఫూర్తితో నినదించాల్సిన
వ్యర్థార్థమాన వాతావరణమిది...
ఆంధ్రుల హక్కైన విశాఖ ఉక్కు
వధ్యశిలపై శిరస్సు వంచకుండా
హృద్యంగా స్పందించాల్సిన
అత్యవసర సమయమిది ...

నేనూ...
మీరూ...
మనమందరం !
అంపకం ఓ సాదరంగా సాగనంపడం
బళాయి ఓ బలవంతుడు
ఉరవడి ఓ వేగం!






# మనుషుల కవి కుంచెశ్రీ

- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

**నా** సెమట సుక్కకి విలువ్వాడ?
కారిపోయిన సెమటను తుడిచిన
టువాలుకు తెలుసు
నా పంటకు విలువ్వాడ?
దళారాల జేబుల్లో నిండిన
డబ్బుకు తెలుసు (మన మధ్యన మనిషి : పు 145, 146)

కుంచెశ్రీ అనే కలం పేరు గల యువకవి చింతా లక్ష్మినారాయణ. ఆయన చిత్రకారుడు కూడా. అందుకే కుంచె లక్ష్మినారాయణగా కూడా ఆయన ప్రసిద్ధుడు. చిత్రకారుడైన కవి గనక ఆయన కవితలు కూడా తీర్చిదిద్దినట్లుంటాయి. లక్ష్మినారాయణ ఇదివరకే 'అమ్మ పేరే నా కవిత్వం' అనే దీర్ఘ కవిత, 'జిత్తు గీసిన చిత్రం' అనే కథల సంపుటి, 'నేతగాడు' అనే నవల ప్రచురించారు. ఆయన తర్వాతి కావ్యం 'మన మధ్యన మనిషి'.

ఆధునిక కవులకు వర్తమానమే వస్తువు. ఇవాళ కంటి ముందు కనిపిస్తున్న సామాజిక వాస్తవికత అలంకారికమై ఆధునిక కవులలో కవితగా పురుడు పోసుకుంటుంది. 'మన మధ్యన మనిషి'లోని కవితలన్నీ గత నాలుగైదేళ్లలో లక్ష్మినారాయణ రాసినవే. ప్రపంచీకరణ యుగంలో ఇటీవల జీవితమే లక్ష్మినారాయణ కవిత్వ వస్తువు. మన మధ్యన సంచరించే అనేక రకాల మనుషులు, మనల్ని పాలించే రాజకీయ వ్యవస్థ, మనల్ని నడిపిస్తున్న శక్తులు – ఇవే లక్ష్మినారాయణ కవిత్వ వస్తువులు. భూమితో స్నేహ హస్తం కలిపే మనిషి, ఆకలినే తింటూ బతికే మనిషి, సంపాదన కోసం ఊరిలోని వీధుల మీద పడే మనిషి – ఇలాంటి మనుషులే లక్ష్మినారాయణ కవిత్వంలో కనిపించే మనుషులు.

'దేశభక్తి' అనే మాట ఇవాళ మతభక్తిగా ప్రచారమౌతున్నది. దేశమంటే మనుషులు అన్న గురజాడ చెప్పిన అర్థాన్ని తెరమరుక్కి పంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గుంటూరు జిన్నా టవర్ గొడవే ఇందుకు తాజా ఉదాహరణ. లక్ష్మినారాయణ దేశమంటే మనుషులేనని చెప్పడం దేశభక్తులకు ఆనందం కలిగించే విషయం.

దేశభక్తంటే/భక్తి కానేకాదు
దేశంలో నలుగురికి అండగా నిలవడం
పదుగురిని ఆసరా కల్పించడం (పు:70)

గత ఏడాది చరిత్రంతా రైతు ఉద్యమ చరిత్ర, కరోనా చరిత్ర. రైతుల సంక్షేమం పేరు చెప్పి కేంద్రం ప్రకటించిన మూడు చట్టాలు రైతు వ్యతిరేక చట్టాలని, వాటిని వెనక్కి తీసుకోవాలని భారతీయ రైతులు 2020 అక్టోబర్ ప్రాంతం దేశ రాజధాని ఢిల్లీలో ఉద్యమం నడిపి విజయ సాధించారు. కరోనా రెండో విడత దేశాన్ని గడగడలాడించింది. ఈ వర్తమాన నిర్దిష్ట సంఘటనల మీద లక్ష్మినారాయణ అర్థవంతమైన కవితలు రాశారు. వ్యవసాయ స్వభావం లేని పాలకులు వ్యవసాయ దేశంలో ఎలా ఉంటారు అని ప్రశ్నించాడు ఈ కవి.

దుక్కిదున్ని పంట పండించి
నలుగురికి అన్నం పెట్టలేనోడు
మనల్ని గద్దించే వాడెలా అవుతాడు?

ఢిల్లీలో రైతుల ఉద్యమాన్ని అణచివేయడానికి పాలకులు అనేక హింసా మార్గాలనుసరించారు.

నిత్యం చెమట తుపానులో
కూడలిలోని విగ్రహంలా తడిసే మాకు
జలఫిరంగుల వర్షం ఏపాటిది? (పు:96) అని కవి ప్రశ్నించాడు. కుంచెశ్రీ శ్రామికవర్గం నుంచి వచ్చిన కవి.

శ్రమతత్వం తెలిసిన కవి. శ్రమపట్ల గౌరవం ఉన్న కవి. ముఖ్యంగా రైతు పక్షపాతి.

'రేప్పొద్దున మీ ఆకలికి

ఈ పొద్దే మా కాయకష్టం (పు:73)

అవి రైతుశ్రమను కీర్తించారు. దేశానికి రేపటి ఆకలి తీర్చడానికి రైతు ఈరోజు ధాన్యం పండిస్తాడనడం అద్భుతమైన పరిశీలన. అలాంటి రైతులు దేశవ్యాప్తంగానూ, ప్రత్యేకించి రాయలసీమలోనూ అనేక రకాలుగా మరణిస్తున్నారు. ఈ వాస్తవాన్ని

నింగికి కన్నులతికించి/ ఎంతమంది పోయారో

నేలలోకి చేతులు నాటి/ ఎంతమంది పోయారో..

నమ్మకపు నాగిలాట/ గెలుపోటముల జూదమైంది (పు : 31, 32) అని కవి ఆవేదనగా ప్రశ్నించాడు.

రాయలసీమ కవి రాయలసీమను గురించి కవిత రాయకుండా ఉండడం వీలుకాదు. రాయలసీమ కవిత అంటే రాయలసీమ కరువు కవిత అనే అర్థం. రాయలసీమ కరువంటే రైతుల ఆత్మహత్యలు. అందుకే కుంచెశ్రీ రాయలసీమ జీవిత విషాదాలనన్నింటినీ వర్ణించి...

మొగుల్యాక పెళ్ళాము/ తండ్రిల్యాక పిళ్ళోళ్ళు

రైతుల్యాక ఊరే/ అస్తమయమైన సూర్యతేజమైతే

నా కుంచెతో/ సీమ బతుకు చిత్రం ఎట్లాగీసేది (పు:112) అని ప్రశ్నించాడు.

ప్రపంచీకరణ విధ్వంసం మూడు దశాబ్దాల నుంచీ, దాని రోగ రూపమైన కరోనా విధ్వంసం మూడేళ్ళ నుంచీ ప్రపంచ ప్రజలంతా అనుభవిస్తున్నారు. ఈ విధ్వంసాల మీద ప్రపంచవ్యాప్తంగా కవిత్వం వస్తున్నది. ఈ కవిత్వోద్యమంలో తెలుగు కవులనేకులు పాల్గొంటున్నారు. కుంచెశ్రీ ఈ ఉద్యమంలో తాజా కవి. ప్రపంచీకరణ వచ్చినాక బాగా దెబ్బతిన్న రంగం వ్యవసాయ రంగం. దేశానికి వెన్నెముకగా కీర్తించబడే రైతుకు ప్రపంచీకరణ మృత్యురూపమే అయింది. అందుకే కవి 'వెన్నెముక యిరసకండి' అన్నాడు.

యువ రైతుల ఎన్నెముక ఇరసకండి

దేశానికి రైతులవసరమప్పా! అని కవి అనంతపురం జిల్లా భాషలో బుద్ధి చెప్పాడు.

మన పాలకులు ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ మనకిచ్చిన మహత్తరమైన కానుక మన కంటి ముందరి పర్యావరణ విధ్వంసం. పంట పొలాలలో బహుళ అంతస్తుల భవనాలు. ప్రాదేశిక జీవిత అదృశ్యం వంటివి. వీటనన్నిటినీ కుంచెశ్రీ అధిక్షేపించాడు.

ఎవరి కన్నులు ఎర్ర బడ్డాయో

ఎవరి చేతులకు గొడ్డళ్ళు మొలిచినాయో

అరణ్యమంతా శశిరం ఆవహించింది (పు:51)

ప్రపంచీకరణ ప్రవేశించినాక గ్రామాలు ధ్వంసం అవుతూ నగరాలు బలిసిపోతున్నాయి. గ్రామాల పొలాలలోకి సెజ్‌లు చేరాయి. ఈ వాస్తవాన్ని కవి

నిజం ఇప్పుడు అక్కడ ఊరులేదు

అది పట్నంగా పెరిగిన ఖాళీ అరణ్యమే

కనిపిస్తున్నదంతా కాంక్రీటు జంగిలే (పు. 116) అని నిర్వచించాడు.

కరోనా కాలంలో లాక్‌డౌన్ సమయంలో నగరాలకు వలస వచ్చిన కూలీలు పనులు లేక రోడ్లమీదకి వచ్చి కాలి నడకన ఊళ్ళకు బయలు దేరిన సంఘటన భారతదేశాన్ని కలచి వేసింది. ఆ సమయంలో పేదలు పడ్డ బాధలు వర్ణనాతీతం. కవి .. తిరోగమన వలసపోరులో/

ఓడింది పేదరికమే (పు:50) అనడం కఠిన వాస్తవం. లాక్‌డౌన్ సమయంలో ప్రజల్ని నియంత్రించడానికి పోలీసులు వ్యవహరించిన తీరును

అలా నగరంలోకి అడుగు పెడితే

ఏ లాఠీ నా వీపుపై విరుగుతుందేమోననే భయం (పు:43) అని వ్యాఖ్యానించాడు.

ప్రపంచం ఎంత మారుతున్నా భారతదేశం కులమతాల విషయంలో వెనక్కెనక్కి వెళ్తున్నది. మధ్య యుగాల విశ్వాసాలు, ఆచారాలు, అహంకారాలు మళ్ళీ పుంజు కుంటున్నాయి. కవులు వీటిమీద నిరంతరం యుద్ధం ప్రకటిస్తూనే ఉన్నారు. కుంచెశ్రీ ఈ యుద్ధంలో సైనికుడయ్యాడు.

వర్ణపు ముసుగులో ఎంతకాలం దాక్కోగలం

ప్రేమ స్వచ్ఛమైనప్పుడు వర్ణం ఏనాటిది?

రా.. వర్ణపు ముసుగుల్లేని

ఓ నవ సమాజాన్ని మనతోనే నిర్మిద్దాం

ఈ లోకాన ప్రేమ కాగడా వెలిగిద్దాం (పు:68) అని పిలుపునిచ్చాడు. ఈ పిలుపులో గురజాడ స్ఫూర్తి ధ్వనిస్తున్నది.

పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతున్నకొలదీ సమాజంలో బూటకపు విలువలూ పెరుగుతున్నాయి. వాస్తవికవాద కవులు ఈ కుహనా విలువల్ని నిలదీయకుండా ఉండలేరు.

ఇప్పుడిప్పుడే నెరసిన నెత్తికి

నల్లరంగేసి పాయమోడౌతాంటాడు

ముసలోల్ల పక్కకిపోయి

నవ్వుతూ నవయువకుడౌతాడు (పు:81) అని దెప్పి పొడిచాడు.

కుంచెశ్రీ కొంతమంది స్త్రీల బతుకులను మనముందు ఆవిష్కరించాడు. ఇటీవల భారత దేశవ్యాప్తంగా స్త్రీలపైన జరుగుతున్న పురుషుల దౌర్జన్యాలను కవి నిరసించాడు.

రొంత ఆడదాని చర్మం/ కుక్కల కండ్లకి కనబడితే
ఎంగిలి కార్సుకుంట/ నాకాలనుకుంటాయి (పు:121)

కోటి విద్యలు కూటికొరకే అని సామెత. జానపద కళలన్నీ బతుకుతెరువు కోసం పుట్టిన విద్యలు. వాటిలో 'సోదె' ఒకటి. కుంచెశ్రీ సోదె చెప్పే ఒక 'ఎరుకలమ్మ'ను పరిచయం చేశారు.

సంకన బుట్టతో నోట్లో వక్కాకుతో
శేరు నూకల కోసమో చాటబియ్యం కోసరమో
సందులు గొందులు తిరిగి సోదె చెప్తానంటూ
అరచెయ్యిని చూత్తూ
ఆశువుగా నూరేండ్ల బతుకుని లెక్కలేత్తుండేది (పు:129)

ప్రపంచీకరణ కాలంలో ఆంగ్లభాషా ప్రభావం ప్రజలపై మాతృభాషల పట్ల ఆదరణ తగ్గినమాట వాస్తవం. ఈ అన్యాయం పట్ల అనేకమంది కవులు నిరసనలు తెలుపుతున్నారు. కుంచెశ్రీ తన మాతృభాషాభిమానం చాటుకున్నారు.

ఆకాశంలో నక్షత్రల్లాగా/ నా తెలుగక్షరాలు వెలగాలని
ఆశించే అభిమానిని నేను (పు:76)

కుంచెశ్రీ తన కవితలతో తన సామాజిక చైతన్యాన్ని ఆవిష్కరించడమే కాక, నేరుగా అనేక రకాల చైతన్యాన్ని ప్రబోధించారు.

రొమ్ములోకి విప్లవ శ్వాసపీల్చు
నీ ధైర్యానికి
శత్రువైనా వెనకడుగు వేయాల్సిందే (పు:37)
నీలో ఉన్న శక్తిని నమ్ము
నువ్వే ఓ విప్లవ జెండాలా ఎగురుతావు (పు:62)
అంటూ ఆత్మవిశ్వాస కవితలు రాశారు.

అనంతపురం జిల్లా నుంచి కుంచెశ్రీ తెలుగు వచన కవిత్వాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయనలో ఒక మార్మికుడు ఉన్నాడు. ఆ మార్మికుడు పూర్తిగా బహిర్ముఖుడు కాగలిగితే ఆయన మరింత సామాజిక కవిగా, ఆవిష్కృతమౌతారు. కుంచెశ్రీ గొంతులో స్పష్టత, క్లుప్తత ఉన్నాయి.

మన సమాజం మరింత నాగరికమూ, ప్రజాస్వామికమూ కావాలన్న తపన ఉంది. సమస్యలు గుర్తించి ఆవిష్కరించే నిజాయితీ ఉంది. వాటి పరిష్కార మార్గాలవైపు ఆయన దృష్టి తిప్పితే ఆయన సమగ్ర కవిగా ఎదుగుతాడు.

నిటారుగా నిలబడిన రైతు మాత్రం
చేన్లో సుడి తిరిగిన తాటిచెట్టులా
దిష్టిబొమ్మలా నిల్చిపోయాడు (పు:172)

■

## యుద్ధానికి హృదయముంటుందా ?


**యు**ద్ధానికి ఆయుధం అవసరముంటుంది
ఆయుధానికి కర్కశత్వం అవసరముంటుంది
రక్తాన్ని వొంటికి పూసుకొని నర్తించే గుణముంటుంది
ప్రయోగించిన తర్వాత అదిచేతిలో వుండనంటుంది
మనసు లేని ఆయుధాన్ని
మనసు వుండాల్సిన మనిషి ప్రయోగించడమే
యుద్ధనీతి యిప్పుడు!

మనిషి పువ్వునో, పాటనో ప్రేమించినట్లు
మనిషిని ప్రేమించాలి కదా మరి
బదులిచ్చే, చేతులు చాపే మనిషి పక్కన
మనిషి ఓలలాడడేమిటి?
తెలి తెలినవ్వుల గంగా పొంగులై పోవడేమిటి?
ఆకాశంలో మబ్బుల దారుల వెంట పక్షుల గుంపులా
నేలన మట్టినంటి నడిచే మనుషుల సమూహం ఎక్కడనీ?
చూపుల్లోంచి చూపులు చూపుల్లోకి దూకినప్పుడు
అగ్ని పర్వతాలు పేలుతున్నాయ్
మాటల్లోంచి మాటలు మౌనాల్ని వెలిగిస్తున్నప్పుడు
తుపానులు చెలరేగుతున్నాయ్
మనిషంటే కన్నీటి బిందువుల అనంత కారుణ్యాంబుధి
మనిషంటే చిరుజల్లులా కురిసి హరివిల్లులా విరిసి
ఏకైక తెల్లరంగులా హసించే నిష్కల్మషి
మనిషంటే మెట్టు మెట్టుగా
అడుగు అడుగుగా అధిరోహించే శిఖర సాహసి
మనిషంటే ఒక నమ్మిక ఒక వేడుక
ఒక విలువ ఒక నిలువ
మనిషి వినా మనిషి ఊహించలేం
మనిషి మారణం మనిషికే చేటు

■■■

చేతులెత్తేద్దామా నీతులు ఒంపి ఒంపి
నూతుల లోతుల్లో దాగుందామా
ఊహాగానాలు చేస్తూ భ్రమావరణంలో గిరగిరల భ్రమరంలా
స్వీయ తృప్తతలో తిరిగేద్దామా
అపోహల అపనమ్మకాల మౌఢ్య భావనల
స్వలాభా స్వభావాల
అనౌచిత్య రగడల మంటలు రగిలిద్దామా?
మనిషిలోంచి ఆయుధం
ఆయుధంలోంచి యుద్ధం
మరి ఎవరు విరిచేస్తరు?
ఆ యుద్ధం ఎవరు చేస్తరు?

**- దాసరాజు రామారావు**



## ఒక యుద్ధం
## అనేక విధ్వంస దృశ్యాలు

**యు**ద్ధం ఎప్పుడూ విధ్వంసమే
విద్వేషాలే యుద్ధానికి మూల ధాతువులు
ఆధిపత్య పోరు
ప్రాణాల్ని ఛిద్రం చేస్తుంది

అండ చూసుకొని ఒక చిన్న దేశం
అంగ బలం చూసుకొని ఒక పెద్ద దేశం
యుద్ధానికి తెరలేపాయి
శూన్యాన్ని విధ్వంసం చేసి
ఆకాశాన్ని అల్లకల్లోలం చేసి
రక్తపు మడుగుల వాసనతో
యుద్ధం తడిసిపోతోంది

నాటో వ్యూహాల మధ్య
దేశాల దేహాలు తగలబడిపోతున్నాయి
ఇప్పుడు బతకడమంటే
మూడో ప్రపంచ యుద్ధమే!

దాహోర్తులేవో దేహాల్ని మింగుతున్నాయ్
యుద్ధాలెపుడూ సామాన్యుని
గుండె మీద తాండవం చేస్తాయ్!

ఇప్పుడు ఉక్రెయిన్, రష్యాల మధ్య
యుద్ధం ఒక అనేకానేక
విధ్వంసక దృశ్యాల్ని లేపి సాదృశ్య పరుస్తున్నాయి!
ప్రాణాలు మట్టి రేణువులతో
చివరాఖరి ఘోషను విన్నవిస్తున్నాయి!

**- గవిడి శ్రీనివాస్**
**70192 78368**

## ప్రజాస్వామ్యం ముసుగులో ...

**గో**డ మీద పిల్లులకి
ఏదో ప్రాణభయం వుండే వుంటుంది
బతకడానికి వీలైన మార్గాన్ని ఎంచుకుంటాయి

'వాళ్ల'ని గోడల మీద పిల్లులని
ఎవరన్నారో కానీ అసలే బిక్కచచ్చిన పిల్లులన్నీ
గాయానికి అవమానం తోడైనదని
దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నాయి
ఇప్పుడు దేశమంతా గోడలు బీటలు వారేలా
పిల్లుల రోదనలు వినబడటం లేదూ?

క్రూరంగా మ్యావ్ మ్యావ్ అంటూ జీరగా గర్జించే
గండుపిల్లులు కూడా బేర్ బేర్మని రోదిస్తుంటే
నాకైతే గుండె తరుక్కుపోతున్నదబ్బా
మేం మా ఆకలికి అల్లాడిపోతూ ఉంటామే తప్ప
మాకేమైనా వాళ్ల మాదిరిగా
పదవీ కాంక్షలుంటాయా అంటూ
గాద్గదిక స్వరంతో ప్రశ్నిస్తున్నాయి
జవాబు చెబుదామా?

మా దీనాలోపనలో ఒకింత రక్షణనిచ్చే
గూడు కోసం తపనే వుంటుంది తప్ప
మేమేమైనా భూముల్ని కబ్జా చేస్తామా అంటూ
దీనంగా బోరుమంటున్నాయి
వెళ్లి ఓదారుద్దామా?

మా బతుకు పోరాటంలో
రోజుకో పొయ్యిని వెతుక్కొని పిల్లల్ని కుక్కల నుంచి
దాచిపెట్టుకుంటామే
వాళ్లలా కుల మత కలహాల అగ్నిగుండాలు
రగులుస్తామా ఏంటి అని
దిక్కులేక అడుగుతున్నాయి
సముదాయిద్దామా మరి?
మా శరీరం రంగు తెల్లబట్టలేసుకుంటారు కానీ
వాళ్ల బట్టల మీద కనబడని రక్తపు మరకలుంటాయి
మాతో ఎందుకు పోలుస్తారంటూ
అన్ని పిల్లి జాతులు ధర్నాకి దిగుతున్నాయి
వెళ్లి చర్చలు మొదలెడదామా?

**– రజిత కొండసాని**
**99492 95459**

## రెప్పవాల్చని స్వప్నం పుస్తకావిష్కరణ



ప్రముఖ రచయిత్రి దొండపాటి నాగజ్యోతి శేఖర్ రచించిన 'రెప్పవాల్చని స్వప్నం' కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభ సాహితీ స్రవంతి ఆధ్వర్యాన మార్చి 14న కాకినాడ గాంధీభవన్‌లో జరిగింది. అద్దేపల్లి జ్యోతి అతిధులను వేదికపైకి ఆహ్వానించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అధ్యక్షతన జరిగిన సభలో సాహితీస్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి పుస్తక ఆవిష్కరణ చేశారు. సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు డా.జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ నాగజ్యోతి కవిత్వం నిండా కొత్త పదాల చేరికతో గాయాల రాత్రి, గేయాల ఉదయము, మౌనతోట, మదిసంచి, కాంతి పక్షులు, కలలపుప్పొడి, వేకువశృతులు వంటి ఇంతకుముందు ఎవ్వరూ ప్రయోగించని సరికొత్త ప్రయోగాలు, పోలికలు, ప్రతీకలు కనిపిస్తాయని అన్నారు. పద్మజవాణి తన సమీక్షలో.. దప్పిగొన్న నది, నాన్న పడక్కుర్చీ, పుస్తెలతాడు వంటి కవితల్ని విశ్లేషించారు. గ్రంథం మొదటి కృతిని కట్టా కృష్ణారావుకి అందజేసారు. సాహితీస్రవంతి సభ్యులు రచయిత్రి నాగజ్యోతీ శేఖర్‌ని ఘనంగా సత్కరించారు. రచయిత్రి తన స్పందనను తెలియజేస్తూ, తాను రచయిత్రిగా రూపుదిద్దుకోవటానికి కారకులైనవారికి ధన్యవాదాలతో పాటు ఆవిష్కరణ సభను వినూత్నంగా నిర్వహించిన సాహితీస్రవంతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాళ్ళరేవు ఎంఇవో మంగాయమ్మ, పి.సుబ్బరాజు, సి.ఎన్.మూర్తి, డా.ప్రసాద్, బొల్లోజు బాబా, అద్దేపల్లి ప్రభు, అవధానుల మణిబాబు, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక దర్పణం విహంగం

సామాజిక సమస్యలను ప్రతిబింబించే కావ్యంగా విహంగం కవిత్వం నిలచిందని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. సాహితీ స్రవంతి నగర కమిటీ ఆధ్వర్యంలో నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య అధ్యక్షతన కవి గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి రాసిన కవిత్వం విహంగం ఆవిష్కరణ సభ  మార్చి 20వ తేదీన లలిత కళాసమితిలో జరిగింది. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ కవిత్వంలో మానవీయ విలువలు దాగి ఉన్నాయని, ఇది గౌరెడ్డి సాహిత్యంలో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ప్రముఖ కథకులు ఇనాయతుల్లా మాట్లాడుతూ... చిక్కనైన కవిత్వ సృజన విహంగంలో కనిపించిందని అన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి జెయస్సార్కె శర్మ మాట్లాడుతూ తెలుగు కవిత్వం రాస్తూ తెలుగుభాషా సాహిత్య సేవలో కీర్తి సంపాదిస్తున్న గౌరెడ్డి అభినందనీయుడన్నారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆచార్య దండెబోయిన పార్వతి మాట్లాడుతూ ఈ కవిత్వం వస్తు, శిల్ప వైవిధ్యంగా సాగిందని అన్నారు. అధ్యాపకులు డా.అరుణ మాట్లాడుతూ కవిత్వం సామాజిక చైతన్యానికి బాటలు వేస్తుందని కవిత్వం లోతుల్లో సంచరిస్తూ సాగిందన్నారు. డా.మారుతీ కుమారి మాట్లాడుతూ ఈ కవిత్వంలో వైవిధ్యమైన భాష ఉందని, అది కవిత్వానికి గాఢతనిస్తుందని అన్నారు. సభను నగర ఉపాధ్యక్షులు విజయులు తనగల ప్రారంభించగా ముగింపు సందేశం కవితా వెంకటేశ్వర్లు ఇచ్చారు. సభలో కవి గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, కవులు పుల్లా రామాంజనేయులు, డి.పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కథలుగా అల్లుకుపోయిన 'ఖబర్ కే సాత్'

సమాజ మార్పులను ఆకళింపు చేసుకుని, పరిశీలనా, పరిశోధనా దృష్టితో దేశమంతా కథలుగా అల్లుకుపోయిన కథలే ఖబర్ కే సాత్ కథలని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కథా సమయం ఆధ్వర్యంలో తుంగభద్ర ప్రచురణ తీసుకొచ్చిన శ్రీనివాసమూర్తి ఖబర్ కె సాత్ కథలను నగరంలోని లలిత కళాసమితిలో ఆయన ఆవిష్కరించారు. సభకు కథకులు జి.ఉమామహేశ్వర్ అధ్యక్షత వహించారు. సంపుటిని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో జరిగిన పరిణామాలు, ఘటనలలే వస్తువులుగా రచయిత ఈ కథలు రాశాడన్నారు. సీమ అస్తిత్వాన్ని, మాండలికాన్ని, మట్టి మనషుల వెతల్ని వైవిధ్యమైన శిల్పంతో ఆవిష్కరించారని అన్నారు. కథకుడికి దేశంలోని ప్రతి ప్రాంతమూ వస్తువైందని, కాశ్మీరీల జీవితాలు కూడా ఖబర్ కె సాత్‌లో ఉన్నాయని అన్నారు. కవి పాణి మాట్లాడుతూ నిండైన దృష్టితో కథలు ఉన్నాయని, కథల్లో అంతర్లీన దు:ఖం ప్రవహిస్తుందని కథల ద్వారా జీవితాన్ని అన్వయం చేసుకోవచ్చని అన్నారు. కథల్లో నీటి సమస్య,  భూమి సమస్య ఇలా ప్రతి సమస్యను స్పృశించాడన్నారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా కథల ప్రయాణాన్ని కర్నూలు నుంచి ఆరంభించిన కథకుడన్నారు. సభను కథాసమయం సభ్యులు తెలకపల్లి మధుసూదన శర్మ ప్రారంభించారు. సభలో శ్రీనివాసమూర్తి తన కథల్ని చదివి వినిపించారు.



# నివాళి

## రంగస్థల నటుడు తల్లావఝ్ఝుల సుందరం మృతి



**తె**లుగు నాటక రంగానికి హాస్యంతో కొత్త శైలి చూపిన రంగస్థల నటులు, దర్శకుడు, నవలా రచయిత తల్లావఝ్ఝుల సుందరం మాస్టారు (71) మార్చి 21న కన్నుమూశారు. చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో సోమవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందంటూ సుందరం మాస్టారు తన మిత్రుడు తనికెళ్ల భరణికి ఫోన్ చేశారు. విషయం తెలుసుకున్న ఇద్దరు శిష్యులు ఆయన ఇంటికి చేరుకొని ముషీరాబాద్ కేర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సుందరం మాస్టారు మరణవార్త విన్న పలువురు రంగస్థల ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుమారుడు, కుమార్తె అమెరికా నుంచి వచ్చిన తరువాత ఈనెల 23న జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. నాటక రచన, ప్రదర్శనలకు సుందరం మాస్టారు తన జీవితాన్ని అంకితం చేశారు. రెండు వందలకుపైగా నాటకాల్లో నటించి మెప్పించారు. నాటకాన్ని హాస్యం వైపు మళ్లించే ప్రయత్నంలో మాస్టారు విజయాన్ని సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో 1950 అక్టోబరు 29న సుందరం జన్మించారు. బీఎస్సీ చదివిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రంగ స్థల కళల విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. నాలుగేళ్ల క్రితం ఆయన భార్య శిరీష మరణించారు. బొల్లోజు బాబా, గిడుగు చలపతి, అవధాను ల మణిబాబు, పసుమర్తి పద్మజావాణి, ప్రిస్కిల్లా, పద్మావతి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## మల్లు స్వరాజ్యం కన్నుమూత



**తె**లంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం (71) మార్చి 19 శనివారం రాత్రి కన్నుమూశారు. కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో ఆమె బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె 13 ఏళ్ల వయసులో సాయుధ పోరాటంలో పాల్గన్నారు. సాయుధ పోరాటంలో తుపాకీ పట్టిన మొదటి మహిళ స్వరాజ్యం కావడం గమనార్హం. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డికి స్వరాజ్యం చెల్లెలు. మల్లు వెంకటరెడ్డి సతీమణి.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెంలో భీమిరెడ్డి రామిరెడ్డి, చొక్కమ్మ దంపతులకు 1931లో స్వరాజ్యం జన్మించారు. ఆమె నిజాం సర్కారుకు ముచ్చెమటలు పట్టించారు. రజాకార్ల పాలిట సింహస్వప్నమై నిలిచారు. 1945–48 సంవత్సరాల్లో సాయుధ పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. సాయధ పోరాటం సమయంలో ఆమెపై నిజా ప్రభుత్వం రూ. 10 వేల రివార్డును ప్రకటించింది. సాయుధ పోరాట విరమణ తర్వాత తుంగతుర్తి నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 'నా మాటే తుపాకీ తూటా' అనే పేరుతో స్వరాజ్యం ఆత్మకథ రాశారు. పదేళ్ల వయసులోనే మాక్సిం గోర్కి నవల 'అమ్మ'ను చదివి స్ఫూర్తి పొంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు స్వరాజ్యం. పాటలు కట్టి ప్రజలను చైతన్యవంతులను చేయడం, భూస్వాముల గడీలపై దాడులు చేయడం, ధాన్యాన్ని పేదలకు పంచడం, గ్రామాలను విముక్తం చేసి, భూములను రైతులకు పంచి ఇవ్వడం లాంటి కార్యక్రమాల్లో ఆమె పాల్గన్నారు. రైతులను, మహిళలను, గిరిజనులను ఏకం చేసి గెరిల్లా పోరాటం చేశారు. ఆమె బాణీ కట్టిన 'ఉయ్యాలో ఉయ్యాలా' పాట ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించింది. ఆమె సాహితీ స్రవంతి కార్యక్రమాల్లో పాల్గొని పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఐద్వా ఆధ్వర్యాన నడుస్తున్న మానవి పత్రిక సంపాదకవర్గంలో ఆమె పనిచేశారు.

## సీనియర్ జర్నలిస్ట్ విద్యారణ్య అస్తమయం



**సీ**నియర్ జర్నలిస్ట్, కవి విద్యారణ్య కామ్లేకర్ (60) గుండెపోటుతో మార్చి 16న హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో మరణించారు. కర్నూలు జిల్లాకు చెందిన విద్యారణ్య ప్రముఖకవి చరిత్రకారులు పండిత హీరాలాల్ గారి కుమారుడు. 1989 నుంచి ఆంధ్రప్రభ దినపత్రిక సీనియర్ రిపోర్టర్‌గా, న్యూస్‌బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. మిలాప్ హిందీ దినపత్రిక, షకాల్డ్ మరాఠి దిన పత్రికకు అసోషియేటెడ్ ఎడిటర్‌గా పనిచేశారు. వారి తండ్రి పేరు మీద కర్నూలు జిల్లాలో సాహిత్య రంగంలో విస్తృతంగా పనిచేస్తున్న వారిని గుర్తించి పండిత హీరాలాల్ స్మారక సాహిత్య పురస్కారాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏడూ ఇస్తూ వచ్చారు. కరోనా కారణంగా గతేడాది నుంచి పురస్కారం ప్రకటించలేకపోతున్నానని, త్వరలో ఇస్తామని ఇటీవల ఆయన సన్నిహితులతో వెల్లడించారు. విద్యారణ్య ఆకస్మిక మృతి పత్రికారంగానికి, సాహితీరంగానికి తీరని లోటని, అటువంటి స్నేహశీలిని కోల్పోవడం బాధాకరమని సాహితీస్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు కెంగార మోహన్ కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పేర్కొన్నారు. కర్నూలు ఖ్యాతిని నలుమూలలా విస్తరించిన విద్యారణ్య ఆకస్మిక మరణం విచారకరమని కర్నూలు జిల్లా తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గన్నమరాజు సాయిబాబా, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూరా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

# పుస్తకాలు




**అంపశయ్య నవీన్ సాహిత్య మూర్తిమత్వం (వ్యాసాల సంకలనం)**

**వెల : రూ.300 పేజీలు : 286**

**ప్రతులకు : 99892 91299**

**గ**త యాభై సంవతసర్రాలుగా ఆధునిక తెలుగు సాహిత్యరంగంలో నిర్వి రామంగా కృషి చేస్తున్న అంపశయ్య నవీన్. ఇప్పటివరకూ 34 నవలలు, వందకుపైగా కథలు, వందలాది వ్యాసాలు రాశారు. వివిధ ప్రక్రియల్లో నవీన్ గారు తన ప్రతిభను కనపర్చారు. ఈ సంవత్సర ఆయన అశీతిపూర్తి సందర్భంగా ఆయన సృష్టించిన సాహిత్యంపై అనేకమంది విమర్శకులు చేసిన మూల్యాంకలనంతో ఈ గ్రంథం వెలువడింది. నవీన్ సాహిత్యంపై ఆసక్తి ఉన్న వాళ్లందరూ చదవాల్సిన పుస్తకం.




**స్నేహరాగం** నవల, **కొన్ని కథలు**

**రచన : అంపశయ్య నవీన్**

**వెల : 200 పేజీలు : 144**

**ప్రతులకు : 99892 91299**

**నే**ను విరివిగా నవలలు రాస్తున్న 1970 – 80లలో స్వాతి మాసపత్రికలో పదికి పైగా నవలలు, ఎన్నో కథలు రాశాను. అవన్నీ మంచి పాఠకాదరణ పొందాయి. ఈ నవల 2021లో స్వాతిలో వచ్చింది. యౌవనంలో ఉన్న ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య నిసర్గ, నిస్వార్థ, నిరూపమానమైన శృంగారాతీత, స్వచ్ఛమై స్నేహం ఉండటానికి వీల్లేదా? ఈ ప్రశ్నకు జవాబే ఈ నవల. ఈ పుస్తకంలో ఈ నవలికతో పాటు ఐదు కథలు కూడా ఉన్నాయి. **- అంపశయ్య నవీన్**





**కొంగలు గూటికి చేరేవేళ** కవిత్వం

**రచన : డాక్టర్ కాళ్లకూరి శైలజ**

**వెల : 150 పేజీలు: 110**

**ప్రతులకు : అనల్ప ప్రచురణలు, అమెజాన్**

**అ**నల్పప్రచురించిన 29వ పుస్తకం ఇది. డాక్టర్ కాళ్లకూరి శైలజ గారికి కవిత్వపరంగా ఇది మొదటి పుస్తకం. శైలజ వృత్తిరీత్యా వైద్యురాలు. నిత్యం శస్త్రచికిత్సలతో రోగులను కాపాడే వృత్తిని ఎంతగా ప్రేమిస్తారో సాహిత్యాన్ని కూడా అంతే ప్రేమించే మృదుస్వభావి ఆమె. వివిధ కళల పట్ల అభిమానం మెండుగా ఉన్న శైలజ .. స్వల్పకాలంలోనే ఒక పాఠకురాలి నుంచి కవయిత్రిగా, నవలా రచయిత్రిగా, కథకురాలిగా, వ్యాసకర్తగా, అనువాదకురాలిగా పరిణామం చెందారు. **- కె.బలరామ్**




**అక్షరం అమృతం**

వ్యాస సంపుటి

**రచన : పొత్తూరి సుబ్బారావు**

**వెల : 150 పేజీలు : 232**

**ఈ** పుస్తకం అన్ని రకాల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఎంతో ఉపయుక్తమైనది. దేశభక్తి, దైవభక్తి, సేవాగుణం, సహకార దృక్పథం, పెద్దల గౌరవింపు, మన జానపద ప్రజాకళలు, సంగీత, సాహిత్య, నృత్య కళారంగాలపై ఈ వ్యాసాలు అభిరుచిని కలిగిస్తాయి. సీనియర్ పాత్రికేయ రచయిత, సంపాదకులు పొత్తూరి సుబ్బారావు గారి కలంలోంచి జాలువారిన ఈ అక్షర ముత్యాల కిరణం నిత్య పఠనీయం. **- తంగిరాల చక్రవర్తి**




**గజల్ మెహఫిల్**

**సంపాదకులు: దా.విజయలక్ష్మి పండిట్, బిక్కి కృష్ణ**

**వెల : 150 పేజీలు : 152**

**ప్రతులకు : 86390 61472**

**ఇ**ది 68 మంది స్పందించి, అందించిన గజల్లతో సమకూర్చిన సంకలనం. దీనిని గజల్ ప్రక్రియను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఏర్పడ్డ విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ ప్రచురించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి, బయట ప్రాంతాల నుంచి కవులూ కవయిత్రులూ ఈ గజల్లు రాశారు. ఎందరో కవులు తమదైన బాణీలో వాణిలో తమ మనోభావాలను, అనుభూతులను, ఆవేదనలను, విరహ వియోగాలను, గాయాలను ... ఈ గజల్ మెహఫిల్‌లో వినిపించారు.




**రాగరేఖలు**

**డాక్టర్ పి.విజయలక్ష్మి పండిత్**

**వెల : 120 పేజీలు : 124**

**ప్రతులకు : రచయిత్రి, 86390 61472**

**ఈ** రాగ రేఖలు సంపుటిలో గజల్ సౌందర్య సమీక్షణం వైపు మన దృష్టి సారిస్తే ఎన్నో మధుర భావాల తటిల్లతలు, తాత్విక ఊహల మబ్బుతెరలు, సుకుమారమైన అనుభూతుల పూలవనాలు, రాగరంజితమైన మృదయాకాశంలో వలపు వెన్నెలలు చిలకరిస్తాయి. భక్తి పారవశ్య భావనల కలనేతగా గజల్ గుల్‌మోహర్ తోటలో అద్భుత యోగ పూరేఖల సురభిళాలు వెదజల్లితే .. ఈ రాగరేఖలు.

**- కళారత్న బిక్కి కృష్ణ**

# పుస్తకాలు



## కోయిలాలో కోయిలా ...

**పాఠశాల విద్యార్థుల గేయ కవిత్వం**
**వెల : రూ.60 పేజీలు : 72**
**ప్రతులకు : 98856 57582**

**తె**లుగు ఉపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్య ఏ పాఠశాలలో పనిచేస్తే ఆ పాఠశాలలో అనేకమంది విద్యార్థులను కవులుగా, కళాకారులుగా తయారు చేస్తారు. అశ్వారావు పేటలో పనిచేసి నప్పుడు పిల్లల చేత కవితలు రాయించి 'చిగురాకుల సవ్వడి' సంకలనం వెలువరించారు. ముదిగొండలో 'ముదిగొండ ముత్యాలు' పేరిట పిల్లల చేత రాయించారు. ఇది చెరువు మాదారం పాఠశాల విద్యార్థుల చేత రాయించిన గేయకవిత్వం. చదవండి. ప్రోత్సహించండి.

**- పోతగాని సత్యనారాయణ**



## మనిషి దొరికిపోతున్నాడు

కవిత్వం
**రచన : గుండాన జోగారావు**
**వెల : 100 పేజీలు: 120**
**ప్రతులకు : 94901 85708**

**క**విత్వం పట్ల ప్రేమను కడదాకా నిలుపుకోవడం కొందరికే సాధ్యం. ఆ కొందరిలో గుండాన జోగారావు ఉన్నారు. రైల్వేలో సీనియర్ పాసింజర్ గార్డుగా పనిచేస్తూ వృత్తినీ, ప్రవృత్తినీ కాపాడుకుంటూ కవిగా, కథకుడిగా గుర్తింపు పొందారు. ఇదిగో ఇప్పుడు ఎక్కడో మాయమైపోయాడనుకున్న మనిషి దొరికిపోతున్నాడని ఈ కవిత్వం వెలువరించారు.

**- దాట్ల దేవదానం రాజు**




## అగ్నికెరటాలు కవిత్వం

**రచన : బడుగు వీర వెంకట్రావు**
**వెల : 120 పేజీలు: 136**
**ప్రతులకు : 94406 72229**

**ప్ర**ధానోపాధ్యాయుడిగా పాఠశాల ఆలనా పాలనా చూస్తూనే కవిగా తనను తాను ఆవిష్కరించుకుంటున్నారు బడుగు వీర వెంకట్రావు. ఇప్పటికే రెండు కవితా సంకలనాలు వెలువరించారు. సమకాలీన సమాజంలో పెడ ధోరణులను ఎండగడుతూ మంచి విలువలను కాపాడు కుంటూ ఈ 'అగ్నికెరటాలు' వెలువరించారు. ఆకాశదీపం, వలస పక్షులు, ఆకటి గాయం వంటి కవితల్లో కవి శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబింపచేశారు.

**- కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ**





## నేను - నా బడి స్వీయచరిత్ర

**రచన : డా.ఎస్ ఎన్ గిరిధర ప్రసాద్ రాయ్**
**వెల : 150 పేజీలు: 244**
**ప్రతులకు : 94949 00367**

**ఇ**ది ఓ సామాన్యుడి స్వీయ చరిత్ర. ఇందులో అసామాన్య అనుభవాల కథనాలు ఉన్నాయి. ఆయనకు ఎదురైన సమస్యలను లౌకిక దక్షతతో పరిష్కరించిన చతురతల విజయాలున్నాయి. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి నుంచి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎదిగి, ఎన్నో విజయాలు సాధించిన స్ఫూర్తిదాయకమైన కథనం ఇది.

**- డా.పివి సుబ్బారావు**





## నేల విమానం కవిత్వం

**రచన : వాసరచెట్ల జయంతి**
**వెల : 120 పేజీలు : 136**
**ప్రతులకు : 99856 08077**

**వా**సరచెట్ల జయంతి వాక్యాలివి. జీవితా నుభవాలను వడబోసి, సహ జీవితాలను ఉత్సాహపరిచే తడి అక్షరాల తపన జయంతి కవిత్వం. తరచూ రాస్తూ వచ్చిన తన కవితల సంపుటి ఈ నేలవిమానం. ఇందులో జ్ఞాపకాలున్నాయి. తరగని కన్నీళ్లున్నాయి. మనిషిని నిలబెట్టే పట్టుదల, ప్రయత్నం ఉన్నాయి. తనవైన అనుభవాలు, తనవైన ఆవిష్కరణలను అక్షరరూపంలో ఆవిష్కరించింది. అక్కడక్కడా కన్నీళ్లలో కరిగిపోతాం. అప్పుడప్పుడు జ్ఞాపకాల్లో ఉత్తేజితులమవుతాం. గాలి విమానం కాదిది, నేల విమానం.

**- డా. నందిని సిధారెడ్డి**




## తురాయిపూలు కవిత్వం

**రచన : వాసరచెట్ల జయంతి**
**వెల : 150 పేజీలు : 120**
**ప్రతులకు : 99856 08077**

**ఈ** సంపుటిలో నాన్న నా ధైర్యం, మా నాన్న ఆణిముత్యం లాంటి కవతలన్నీ పితృవాత్సల్యాన్ని తెలియజేసేవి. ఒక అమ్మాయిగికీ కవయిత్రి నాన్న పట్ల చూపిన ప్రేమ సహజానుభవమే అయినా ఆమె ఆర్తి ప్రత్యేకంగా గమనింపదగినది. నాన్నతో పాటు అమ్మ కవితలు కూడా ఈ సంపుటిలో ప్రముకంగా చోటు చేసుకున్నాయి. జయంతి వంటి కవయిత్రులు అనుభూతిని బలంగా ప్రోది చేస్తూ కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

**- కాంచనపల్లి గో.రా**

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

జననం : 23.04.1891 మరణం : 25.02.1961




వడ్లగింజలు, అరికాళ్ళకింద మంటలు, కీలెరిగి వాత, కలుపు మొక్కలు, గులాబీ అత్తరు వంటి వీరి కథలు సుప్రసిద్ధం. వీరపూజ, మిథునానురాగము, శ్మశానవాటిక, అనాథ బాలిక, రక్షాబంధనము వంటి రచనలు చేశారు. 'అనుభవాలు-జ్ఞాపకాలు' పేరుతో రాసిన స్వీయ చరిత్ర ప్రసిద్ధ పుస్తకం.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 3 ▪ SANCHIKA - 7 ▪ KRISHNA ▪ April 2022
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.03.2022



# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు


## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు


























20% ప్రత్యేక తగ్గింపుతో...

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

గూగుల్ పే, ఫోన్ పే నెం : 9490099258

ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం